సంక్షేమ
# మనసర్కార్
Follow: manasarkar

సంపుటి: 01 ::: సంచిక:309 | హైదరాబాద్ 12 జూన్ 2026, శుక్రవారం | పేజీలు: 8, వెల: రూ. 5/-
Vol-01 ::: Issue-309 | Hyderabad 12 June 2026, Friday | Pages: 8, Rs. 5/-

## మెగా డీఎస్సీ కాదు..
# మెగా స్కామ్

చంద్రబాబును నిలదీసిన జగన్ | నియామకాలలో అక్రమాలు జరిగాయని ఆరోపణ

క్రీడాకారులకు అన్యాయం చేశారని మండిపాటు | సీబీఐ దర్యాప్తుకు డిమాండ్ | జెన్-జీ మొత్తం చూస్తోందని హెచ్చరిక



**డీఎస్సీ నియామకాల పేరుతో రాష్ట్రంలో భారీ స్కామ్ జరిగిందని వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోపించారు. ప్రశ్నపత్రాల లీకేజీ నుంచి స్పోర్ట్స్ కోటా అక్రమాల వరకు అనేక అవకతవకలు జరిగాయని పేర్కొంటూ, ఈ వ్యవహారంపై సీబీఐతో సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. మెగా డీఎస్సీ కాదు.. మెగా స్కామ్ అంటూ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌లపై జగన్ తీవ్ర విమర్శలు గుప్పించారు.**

**తాడేపల్లి (ఏడీఎన్ఎన్):**

డీఎస్సీ రిక్రూట్ మెంట్ లో ఎన్నో అక్రమాలు జరిగాయని, వెలుగులోకి వస్తున్న అవకతవకలు దిగ్భ్రాంతికి గురి చేస్తున్నాయని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, డీఎస్సీ నియామకాల పేరుతో చంద్రబాబు ప్రభుత్వం భారీ స్కామ్‌కు పాల్పడిందని ఆరోపించారు.చంద్రబాబు పాలనంతా దగా, మోసాలు, అబద్ధాలు, స్కాములతో నిండిపోయిందని జగన్ విమర్శించారు. "వెన్నుపోటు, మోసానికి ప్యాంట్, షర్ట్ వేస్తే అది చంద్రబాబే" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. మెగా డీఎస్సీ పేరుతో లక్షలాది మంది అభ్యర్థుల నమ్మకాన్ని చంద్రబాబు, నారా లోకేశ్‌లు వమ్ము చేశారని మండిపడ్డారు. డీఎస్సీ వంటి కీలక నియామక ప్రక్రియలో కూడా అక్రమాలు, లీకులు చోటుచేసుకోవడం దురదృష్టకరమన్నారు. 16 వేల పోస్టుల భర్తీకి నిర్వహించిన పరీక్షల్లోనే ఇన్ని వివాదాలు, ఆరోపణలు వస్తుంటే దానిని "మెగా డీఎస్సీ"గా ఎలా పేర్కొంటారని ప్రశ్నించారు. ఇది ఉద్యోగార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడటమేనని విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో 6,100 పోస్టులకు ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేశామని జగన్ గుర్తు చేశారు. అయితే ఆ నియామక ప్రక్రియను పూర్తి చేయకుండా రద్దు చేసి, అదే పోస్టులను కలిపి కొత్త నోటిఫికేషన్ విడుదల చేసి మెగా డీఎస్సీగా ప్రచారం చేశారని ఆరోపించారు. ఇది ప్రజలను మోసం చేయడమేనని అన్నారు.వైసీపీ ప్రభుత్వ హయాంలో దేశ చరిత్రలోనే రికార్డు స్థాయిలో 1.30 లక్షల ఉద్యోగాలను ఒకే నోటిఫికేషన్‌తో భర్తీ చేశామని జగన్ పేర్కొన్నారు. గ్రామ స్వరాజ్య సాధన, సుపరిపాలన లక్ష్యాలతో చేపట్టిన ఆ నియామక ప్రక్రియ ఉద్యోగాల చరిత్రలో సువర్ణ అధ్యాయంగా నిలిచిందని చెప్పారు. 2019 మే 30న ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కేవలం 50 రోజుల్లోనే జీవో జారీ చేశామని ఆయన గుర్తుచేశారు. జూలై నెలలో నోటిఫికేషన్లు విడుదల చేసి, ఆగస్టులో దరఖాస్తుల ప్రక్రియ పూర్తి చేసి, సెప్టెంబర్‌లో పరీక్షలు నిర్వహించినట్లు వివరించారు. మొత్తం 2,800 పరీక్షా కేంద్రాల్లో 19 లక్షల మంది అభ్యర్థులు పరీక్షలు రాసినా ఒక్క తప్పు కూడా జరగలేదని జగన్ తెలిపారు. ఎలాంటి లీకులు, అక్రమాలు లేకుండా అత్యంత పారదర్శకంగా పరీక్షలు నిర్వహించి, నాలుగు నెలల్లోనే 1.30 లక్షల ఉద్యోగాలను భర్తీ చేశామని పేర్కొన్నారు.

...::: తరువాయి 2వ పేజీలో...



## ప్రధానితో...
# సీఎం రేవంత్ భేటీ

**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్):**

ఢిల్లీలో జరిగిన 'నీతి ఆయోగ్' గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం ముగిసిన తర్వాత , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన అత్యంత ప్రాధాన్యత కలిగిన పెండింగ్ ప్రాజెక్టులు, కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణకు అందాల్సిన ఆర్థిక , సాంకేతిక సహకారంపై ఇద్దరు నేతలు సుదీర్ఘంగా చర్చించారు.తెలంగాణ రవాణా వ్యవస్థకు, పారిశ్రామిక వృద్ధికి ఊతమిచ్చే 'రీజినల్ రింగ్‌రోడ్డు' పనుల పురోగతిని సీఎం రేవంత్ రెడ్డి ప్రధానికి వివరించారు.

...::: తరువాయి 2వ పేజీలో...

## ఏపీలో నాలుగు రాజ్యసభ
# స్థానాలు ఏకగ్రీవం



**అమరావతి (ఏడీఎన్ఎన్):**

ఆంధ్రప్రదేశ్‌లో ఖాళీగా ఉన్న నాలుగు రాజ్యసభ స్థానాలకు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ స్థానాల కోసం అధికార కూటమిలో భాగంగా టీడీపీ నుంచి ముగ్గురు అభ్యర్థులు చింతకాలయ విజయ్, భాష్యం రామకృష్ణ, సావా సతీష్‌ను, అలాగే జనసేన నుంచి లింగమనేని రమేష్‌ను ఆయా పార్టీల అధిష్టానాలు ఖరారు చేశాయి. ఈ నలుగురు అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేశారు.ఎన్నికల ప్రక్రియలో భాగంగా, ప్రతిపక్ష పార్టీల నుంచి మరే ఇతర నామినేషన్లు దాఖలు కాకపోవడంతో, వీరంతా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు అధికారికంగా ధృవీకరించారు. దీనికి సంబంధించిన ధృవీకరణ పత్రాలను అధికారులు అభ్యర్థులకు అందజేశారు.




## సంతానోత్పత్తి కోసం
# కొత్త పాలసీ...

**అమరావతి (ఏడీఎన్ఎన్):**

రాష్ట్రంలో మరో కొత్త పాలసీని తీసుకురాబోతున్నట్లు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఢిల్లీలో జరిగిన నీతి ఆయోగ్ 11వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో ఆయన గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ పాపులేషన్ మేనేజ్‌మెంట్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో సంతానోత్పత్తి తగ్గిందని, అందుకే కొత్త పాలసీని తీసుకురాబోతున్నామని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు 1.5 కంటే తక్కువగా ఉందన్నారు. భవిష్యత్తులో మానవవనరుల కొరత, వృద్ధాప్య సమస్యలు అధిగమించాలంటే కొత్త పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ తప్పనిసరి అని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రాభివృద్ధి గురించి సీఎం ప్రస్తావించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రానికి రూ. 23 లక్షల కోట్ల వరకూ పెట్టుబడులను ఆకర్షించామని వెల్లడించారు. ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రాజెక్టు సంజీవని అమలు చేస్తున్నామని తెలిపారు. విద్యార్థుల కోసం ఏఐ లెర్నింగ్, క్వాంటం టెక్నాలజీస్, అడ్వాన్స్‌డ్ స్కిల్లింగ్ ప్రోగ్రామ్స్‌ను అందుబాటులోకి తీసుకురాబోతున్నామని స్పష్టం చేశారు.

## భారత నౌకపై క్షిపణి దాడి
# విశాఖవాసి మృతి



ఒమన్ గల్ఫ్ లో భారతీయ సిబ్బందితో ప్రయాణిస్తున్న 'సెటెబెలో' అనే వాణిజ్య చమురు ట్యాంకర్‌పై అమెరికా సైన్యం గురువారం క్షిపణి దాడికి పాల్పడింది. ఈ భీకర దాడిలో ముగ్గురు భారతీయ నావికులు మృతి చెందినట్లు అక్కడి అధికారులు వెల్లడించారు. మరో 21 మంది సిబ్బందిని సురక్షితంగా రక్షించారు. తమ ఆంక్షలను ఉల్లంఘిస్తూ ఇరాన్ నుంచి చమురు రవాణా చేస్తున్నందుకే, హెచ్చరికలు పాటించని ఈ నౌక ఇంజిన్ గదిని లక్ష్యంగా చేసుకుని యుద్ధ విమానం ద్వారా ఖచ్చితమైన దాడి చేశామని అమెరికా సెంట్రల్ కమాండ్ ధృవీకరించింది. క్షిపణి తగలడంతో నౌకలో మంటలు చెలరేగి అది నీట మునిగింది.

...::: పూర్తి కథనం 3వ పేజీలో...



## ఖమ్మం రైతులకు
# మంత్రి ఉత్తమ్ భరోసా...

**ఖమ్మం (ఏడీఎన్ఎన్):**

ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతాంగానికి శాశ్వత సాగునీటి భద్రత కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని జలసౌధలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ , జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ వేగవంతంగా పూర్తి చేయడానికి ఒక ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రధానంగా సీతమ్మసాగర్ ప్రాజెక్టు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని, అలాగే ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, అటవీ అనుమతులు , నిధుల సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.ఖమ్మం జిల్లా భవిష్యత్తును మార్చబోయే సీతారామ ప్రాజెక్టుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యంగా పాలేరు లింక్ కెనాల్ ద్వారా కొత్త ఆయకట్టుకు సాగునీరు అందించడంతో పాటు పాత ఆయకట్టును స్థిరీకరించడం, మున్నేరుపాలేరు అనుసంధానం వంటి పనులు ఖమ్మం, సూర్యాపేట జిల్లాల రైతులకు ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. విద్యుత్ ఖర్చు లేకుండా గ్రావిటీ ద్వారా నీటిని మళ్లించడం ఈ ప్రాజెక్టుల ప్రత్యేకత అని, భద్రాచలం, ఖమ్మం ప్రాంతాల్లో వరద రక్షణ పనులకు కూడా అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ఆయన వివరించారు.

## రైతుల భూములతో
# వ్యాపారం చేస్తే ఊరుకోం



**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**

ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే వందకు వంద శాతం రద్దు చేస్తుందని మాజీ మంత్రి హరీశ్ రావు స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాల వల్ల తెలంగాణకు రావాల్సిన రూ.70 వేల కోట్ల ఫార్మా పెట్టుబడులు ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయాయని ఆయన ఆరోపించారు.ఫార్మా సిటీ రద్దు చేసి రైతులకు భూములు తిరిగి ఇస్తామని కాంగ్రెస్ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని హరీశ్ రావు గుర్తు చేశారు. ఫార్మా సిటీ కోసం సేకరించిన భూములను ఇతర అవసరాలకు వినియోగించడం చట్టబద్ధం కాదని పేర్కొన్నారు. ఫార్మా సిటీ కోసం తాను కూడా 17 ఎకరాల భూమిని ఇచ్చానని తెలిపారు.రైతుల నుంచి సేకరించిన భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం ఉపయోగిస్తే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని హరీశ్ రావు హెచ్చరించారు. ఈ భూముల అంశంపై ఇప్పటికే పలువురు రైతులు న్యాయస్థానాలను ఆశ్రయించారని చెప్పారు. భూముల వినియోగంలో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై ప్రభుత్వానికి నిజంగా ప్రేమ ఉంటే వివాదాలు లేని భూములను కేటాయించాలని హరీశ్ రావు సూచించారు. ఫ్యూచర్ సిటీలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడాన్ని బీఆర్ఎస్ వ్యతిరేకించదని స్పష్టం చేశారు.

...::: తరువాయి 2వ పేజీలో...



## ఇరాన్ పై
# భీకర దాడులే..

ఇరాన్‌పై భీకర దాడులు చేస్తామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. 'ట్రూత్ సోషల్' వేదికగా పోస్ట్ చేసిన కొద్ది సేపటికే.. ఇరాన్ పై అమెరికా క్షిపణుల వర్షం కురిపించింది. అమెరికా ప్రతిపాదిత ఒప్పందంపై ఇరాన్ సంతకం చేయకపోతే భీకర దాడులు కొనసాగుతాయని ట్రంప్ స్పష్టం చేశారు.

...::: పూర్తి కథనం 3వ పేజీలో...




## వికసిత్ భారత్
# సాధనే లక్ష్యం

ప్రధాని మోదీ అధ్యక్షతన నీతి ఆయోగ్ 11వ గవర్నింగ్ కౌన్సిల్ భేటీ


**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్):**

మానవ వనరుల అభివృద్ధి, ఉత్పాదక ఉపాధి, ఆరోగ్యంపోషకాహారం, అందరికీ సమాన అవకాశాలు అనే నాలుగు కీలక స్తంభాలపై 'వికసిత్ భారత్2047' సాధనే లక్ష్యంగా కార్యాచరణను రూపొందించినట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ కల్చరల్ సెంటర్‌లో ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన గురువారం నీతి ఆయోగ్ 11వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం ఘనంగా జరిగింది. దేశ సమగ్ర అభివృద్ధి, మానవ వనరుల పురోగతి, 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడమే లక్ష్యంగా ఈ ఉన్నత స్థాయి భేటీ సాగింది.

...::: తరువాయి 2వ పేజీలో...

## పని మనుషులు కాదు...
# వారే జాతి నిర్మాతలు!

గృహిణి విలువ వెలకట్టలేనిది | ఇంటి బాధ్యత భార్యభర్తలిద్దరిదీ.. | సుప్రీంకోర్టు సంచలన తీర్పు



**'ఆడ కూతురా నీకు అడుగడుగున వందనం... అను నిత్యం కరుగుతున్న నీవు రక్త చందనం'**

అన్న జాతీయ ఉత్తమ సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ కలానికి సరికొత్త బలాన్నిస్తూ.. ఈ అపురూపమైన పాటలోని స్త్రీవాద భావజాల ఆంతర్యాన్ని... మగువల అంతర్వేదనను అక్షరాలా.. ఆవిష్కరించిన అరుదైన సన్నివేశానికి.. భారత అత్యున్నత న్యాయస్థానం వేదికైంది. 'అష్టకష్టాలను పంటి బిగువున భరిస్తూ.. అహర్నిశలూ కుటుంబాన్ని కాపాడుకునే మహిళలు కేవలం గృహిణులు మాత్రమే కాదు... భావి తరాలను తీర్చిదిద్దుతూ దేశాన్ని ముందుకు నడిపించే 'జాతి నిర్మాతలు' అని సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. పెళ్లంటే కేవలం ఇంటి పనుల కోసం ఓ మనిషిని నియమించుకోవడం కాదని, వివాహ బంధంలో దంపతులిద్దరికీ సమాన బాధ్యత ఉంటుందని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. వివాహం జరిగినంత మాత్రాన మహిళలు తమ కలలను, ఆశయాలను త్యాగం చేయాల్సిన అవసరం లేదని, పెళ్లి అనేది ఆమె గుర్తింపునకు ముగింపు కాదని తేల్చిచెప్పింది.

...::: తరువాయి 2వ పేజీలో...

## మూడు 'ఎంపీ' స్థానాలు
# బీజేపీ కైవసం!



**భోపాల్ (ఏడీఎన్ఎన్):**

మధ్యప్రదేశ్‌లో ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాలను అధికార బీజేపీ క్లీన్‌స్వీప్ చేసింది. ముగ్గురు అభ్యర్థులు మాత్రమే బరిలో మిగలడంతో ఈ ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు భారత ఎన్నికల సంఘం గురువారం అధికారికంగా ప్రకటించింది. నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగియడంతో గెలిచిన అభ్యర్థులకు అసెంబ్లీ ప్రాంగణంలో ఎన్నికల అధికారులు ధృవీకరణ పత్రాలను అందజేశారు.

...::: తరువాయి 2వ పేజీలో...

## నేడు రాష్ట్రవ్యాప్తంగా
# వైసీపీ ర్యాలీలు



...::: పూర్తి కథనం 4వ పేజీలో...

## ఏపీ సర్కార్‌కు
# ఎన్‌హెచ్‌ఆర్‌సీ నోటీసులు




**విశాఖపట్నం (ఏడీఎన్ఎన్):**

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన ఘోర పేలుడు ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ సీరియస్‌గా స్పందించింది. ఈ ఘటనను సుమోటోగా స్వీకరించిన ఎన్‌హెచ్‌ఆర్‌సీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది.

...::: తరువాయి 2వ పేజీలో...

సంక్షిప్త మనసర్కార్
Follow: manasarkar
శుక్రవారం | హైదరాబాద్
12.06.2026
www.manasarkar.com

# రైతుల భూములతో వ్యాపారం చేస్తే ఊరుకోం

**మొదటిపేజీ తరువాయి...**

గతంలో ఫార్మా సిటీ కోసం సేకరించిన భూములనే జర్నలిస్టులకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే వందకు వంద శాతం రద్దు చేస్తుందని మాజీ మంత్రి హరీశ్ రావు స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాల వల్ల తెలంగాణకు రావాల్సిన రూ.70 వేల కోట్ల ఫార్మా పెట్టుబడులు ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయాయని ఆయన ఆరోపించారు.ఫార్మా సిటీ రద్దు చేసి రైతులకు భూములు తిరిగి ఇస్తామని కాంగ్రెస్ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని హరీశ్ రావు గుర్తు చేశారు. ఫార్మా సిటీ కోసం సేకరించిన భూములను ఇతర అవసరాలకు వినియోగించడం చట్టబద్ధం కాదని పేర్కొన్నారు. ఫార్మా సిటీ కోసం తాను కూడా 17 ఎకరాల భూమిని ఇచ్చానని తెలిపారు.రైతుల నుంచి సేకరించిన భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం ఉపయోగిస్తే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని హరీశ్ రావు హెచ్చరించారు. ఈ భూముల అంశంపై ఇప్పటికే పలువురు రైతులు న్యాయస్థానాలను ఆశ్రయించారని చెప్పారు. భూముల వినియోగంలో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.జర్నలిస్టులపై ప్రభుత్వానికి నిజంగా ప్రేమ ఉంటే వివాదాలు లేని భూములను కేటాయించాలని హరీశ్ రావు సూచించారు. ఫ్యూచర్ సిటీలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడాన్ని బీఆర్ఎస్ వ్యతిరేకించదని స్పష్టం చేశారు. అయితే, గతంలో ఫార్మా సిటీ కోసం సేకరించిన భూములనే జర్నలిస్టులకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

# మూడు 'ఎంపీ' స్థానాలూ బీజేపీ కైవసం!

**మొదటిపేజీ తరువాయి...**

బీజేపీ తరఫున బరిలోకి దిగిన రజనీశ్ అగర్వాల్, తరుణ్ చుగ్, మహేశ్ కేవత్ ఈ ఎన్నికల్లో విజయం సాధించారు. నిజానికి కాంగ్రెస్ పార్టీ ఇక్కడి నుంచి తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్‌ను బరిలోకి దంపింది. అయితే ఆమె నామినేషన్ తిరస్కరణకు గురికావడంతో, పోటీలో కేవలం ముగ్గురు బీజేపీ అభ్యర్థులు మాత్రమే మిగిలారు. దీంతో పోలింగ్ అవసరం లేకుండానే ముగ్గురూ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మీనాక్షి నటరాజన్‌పై తెలంగాణలో ఒక క్రిమినల్ కేసు నమోదై ఉందని, ఆ విషయాన్ని ఆమె తన నామినేషన్ అఫిడవిట్‌లో దాచారని బీజేపీ అభ్యర్థి మహేశ్ కేవత్ రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం కేసుల వివరాలు వెల్లడించనందున ఆమె నామినేషన్‌ను ఎన్నికల అధికారి తిరస్కరించారు. కాగా, దేశవ్యాప్తంగా 10 రాష్ట్రాల్లోని 27 రాజ్యసభ స్థానాలకు జూన్ 1న ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన సంగతి తెలిసిందే.



# ప్రధానితో... సీఎం రేవంత్ భేటీ

**మొదటిపేజీ తరువాయి...**

ఈ ప్రాజెక్టును వేగవంతం చేసేందుకు అవసరమైన కేంద్ర నిధులను త్వరితగతిన విడుదల చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దీనివల్ల రాష్ట్రంలోని పారిశ్రామిక ప్రగతికి ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు.అంతేకాకుండా, రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న 'భారత్ ఫ్యూచర్ సిటీ' నుండి ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నం డీప్ వాటర్ పోర్టు వరకు ప్రతిపాదించిన 12 లేన్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణానికి కేంద్రం పూర్తి మద్దతు ఇవ్వాలని సీఎం కోరారు. ఈ ప్రాజెక్టు రెండు రాష్ట్రాల మధ్య వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడమే కాకుండా, రవాణా రంగాన్ని కొత్త పుంతలు తొక్కిస్తుందని వివరించారు. గ్రేటర్ హైదరాబాద్ ట్రాఫిక్ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే దిశగా చేపట్టిన 'హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్ 2' పనులకు కేంద్రం తన వాటాను, అవసరమైన నిధులను మంజూరు చేయాలని సీఎం కోరారు. అలాగే, పర్యావరణ పరిరక్షణ, నగర రూపురేఖలను మార్చే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన 'మూసీ నది ప్రక్షాళన' కార్యక్రమానికి కేంద్రం ఆర్థిక మరియు సాంకేతిక సహకారం అందించాలని పీఎంకు రిక్వెస్ట్ చేశారు.దక్షిణ తెలంగాణకు వరప్రదాయినిగా భావిస్తున్న 'పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం' గురించి కూడా సీఎం ప్రధానితో చర్చించారు. ఈ పథకానికి సంబంధించి కేంద్ర జల సంఘం నుండి రావాల్సిన క్లియరెన్స్ లను త్వరగా ఇప్పించాలని ఆయన కోరారు. రాష్ట్రంలోని కీలక ప్రాజెక్టుల విషయంలో కేంద్రం సానుకూలంగా స్పందించి, తగిన సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.




# సీబీఎస్ఈ లోపాలు గుర్తించిన యువకుడికి ఐఐటీలో ఉద్యోగం!

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

సీబీఎస్ఈ ఈ ఏడాది ప్రవేశపెట్టిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ మూల్యాంకన ప్రక్రియలోని సాంకేతిక లోపాలను కేంద్ర ప్రభుత్వ సైబర్ సెక్యూరిటీ విభాగం (సెర్ట్ఇన్) దృష్టికి తీసుకెళ్లి వార్తల్లో నిలిచిన 19 ఏళ్ల నిసర్గ అధికారిని ఐఐటీ కాన్పూర్ తమ సైబర్ డిఫెన్స్ రీసెర్చ్ సెంటర్ లో 'ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్, థ్రెట్ ఇంటెలిజెన్స్ ఇంజినీర్'గా ఉద్యోగావకాశం కల్పించింది. చిన్న వయసులోనే అద్భుతమైన సాంకేతిక సామర్థ్యాలున్న నిసర్గ నియామకంతో తమ సైబర్ విభాగం మరింత బలోపేతం అవుతుందని ఐఐటీ కాన్పూర్ డైరెక్టర్ ప్రొఫెసర్ మహీంద్ర అగర్వాల్ ఆశాభావం వ్యక్తం చేశారు. కాంట్రాక్టు విధానంలో జరిగిన ఈ నియామకానికి సంబంధించిన వేతన వివరాలను విద్యాసంస్థ అధికారికంగా వెల్లడించలేదు. ఈ ఏడాదే 12వ తరగతి పూర్తి చేసిన నిసర్గ చిన్నతనం నుంచే కోడింగ్, సైబర్ సెక్యూరిటీపై ఉన్న ఆసక్తితో 'క్యాప్చర్ ది ఫ్లాగ్' వంటి హ్యాకింగ్ పోటీల్లో పాల్గొని పలు బహుమతులు గెలుచుకున్నాడు. తల్లిదండ్రులిద్దరూ ఫైనాన్స్ రంగంలో ఉన్నప్పటికీ, సొంత ప్రతిభతో ఈ గుర్తింపు తెచ్చుకున్నాడు. ఈ నియామకంపై నిసర్గ స్పందిస్తూ.. ఫుల్‌టైమ్ సైబర్ సెక్యూరిటీ విభాగంలో పనిచేయడం ఆనందంగా ఉందని, అయితే వేతనం తాను అనుకున్న దానికంటే కాస్త తక్కువగానే ఉందని పేర్కొన్నాడు.

# మెగా డీఎస్సీ కాదు.. మెగా స్కామ్

**మొదటిపేజీ తరువాయి....**

అక్టోబర్ 2 గాంధీ జయంతి నాటికి మొత్తం నియామక ప్రక్రియ పూర్తయిందని ఆయన తెలిపారు. ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు ప్రస్తుతం గ్రామ, వార్డు స్థాయిలో ప్రజలకు సేవలు అందిస్తున్నారని చెప్పారు. ఇదే నిజమైన రికార్డని, దానికి చంద్రబాబు ప్రభుత్వం దగ్గర కూడా పోలిక లేదని వ్యాఖ్యానించారు.ఇక ప్రస్తుత డీఎస్సీ నియామకాల్లో అవకతవకలు, గోల్‌మాల్ వ్యవహారాలు బయటపడుతున్నాయని జగన్ ఆరోపించారు. పేపర్ లీకులు, మెరిట్ జాబితాలపై అనుమానాలు, అభ్యర్థుల నుంచి వస్తున్న ఫిర్యాదులు ప్రభుత్వ వైఫల్యాన్ని బయటపెడుతున్నాయని అన్నారు."మెగా డీఎస్సీ పేరుతో ఎంతమంది అభ్యర్థులు కన్నీళ్లు పెడుతున్నారు? ఎంతమంది ఆవేదనకు గురవుతున్నారు?" అంటూ చంద్రబాబు ప్రభుత్వాన్ని జగన్ నిలదీశారు. డీఎస్సీ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి నిజాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఉద్యోగార్థులకు జరిగిన అన్యాయంపై వైసీపీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

**డీఎస్సీలో స్కెచ్ ప్రకారమే అక్రమాలు**

డీఎస్సీ మాత్రమే కాదు, ఏ నియామక పరీక్షలోనైనా ప్రశ్నాపత్రాల తయారీ, అప్‌లోడింగ్, డిజిటల్ నిర్వహణ వంటి ప్రక్రియలు అత్యంత గోప్యంగా జరగాల్సి ఉంటుందని, కానీ చంద్రబాబు ప్రభుత్వం ఆ రహస్య ప్రక్రియకు పూర్తిగా తూట్లు పొడిచిందని జగన్ విమర్శించారు. సాధారణంగా డీఎస్సీ ప్రశ్నాపత్రాలను ఎస్సీఈఆర్టీ తయారు చేస్తుందని, పరీక్షల నిర్వహణ బాధ్యతలను డీఎస్సీ కన్వీనర్ పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. అయితే ఈసారి కన్వీనర్‌ను పక్కనపెట్టి ప్రశ్నాపత్రాల తయారీ నుంచి నిర్వహణ వరకు రెండు కీలక బాధ్యతలను కూడా ఎస్సీఈఆర్టీ డైరెక్టర్‌కే అప్పగించారని ఆరోపించారు. దీంతో డీఎస్సీ పరీక్షల్లో అక్రమాలకు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా అవకాశం కల్పించిందని అన్నారు.రహస్యంగా జరగాల్సిన ప్రశ్నాపత్రాల తయారీ, అప్‌లోడింగ్ పనులను ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో చేయించారని జగన్ ఆరోపించారు. పరీక్ష ఫలితాలను సాధారణంగా అందరికీ అందుబాటులో ఉంచుతారని, కానీ ఈ డీఎస్సీలో మాత్రం ఎంపికైన అభ్యర్థులకు మాత్రమే సందేశాలు పంపి, మార్కులు, కటాఫ్‌లు, ర్యాంకులను బహిరంగంగా ప్రకటించలేదని విమర్శించారు. ఆన్‌లైన్ పేరుతో మొత్తం ప్రక్రియను కేంద్రీకృతం చేశారని, ఒకరికి ఒకరు నిష్పత్తిలో కాల్‌లెటర్లు జారీ చేశారని అన్నారు. నవీన్ అనే అభ్యర్థి మెరిట్ సాధించినప్పటికీ సర్టిఫికెట్ల పరిశీలనకు రాలేదనే కారణంతో ఉద్యోగం ఇవ్వలేదని చెప్పడం హాస్యాస్పదమన్నారు. మెరిట్ జాబితాలో పేరు తొలగించి, డేటాను మాయం చేసి, కాల్‌లెటర్ ఇవ్వకుండా సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు రాలేదని ఎలా చెబుతారని ప్రశ్నించారు.డీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారాన్ని దాచి




పెట్టేందుకు ప్రభుత్వం నానా అగచాట్లు పడుతోందని జగన్ ఆరోపించారు. ప్రశ్నాపత్రాల తయారీలో ఎవరు పాల్గొన్నారు? డిజిటల్ యాక్సెస్ ఎవరి చేతుల్లో ఉంది? ఎంతమందికి పేపర్ లీక్ అయింది? ఎంతమేరకు డబ్బులు చేతులు మారాయి? వంటి అంశాలన్నీ బయటపడాల్సి ఉందన్నారు. ఇలాంటి అనుమానాలు, అవకతవకల నేపథ్యంలో సీబీఐ విచారణ తప్పనిసరి అని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అధికార యంత్రాంగం మొత్తం చంద్రబాబు ఆధీనంలోనే ఉందని, నిజాలు బయటకు రావాలంటే స్వతంత్ర సంస్థతో విచారణ జరగాల్సిందేనని అన్నారు. విద్యాశాఖ మంత్రిగా నారా లోకేశ్ ఉన్నందున థర్డ్ పార్టీ ఏజెన్సీ లేదా సీబీఐ దర్యాప్తు ద్వారానే అసలు వాస్తవాలు వెలుగులోకి వస్తాయని జగన్ పేర్కొన్నారు.


**స్పోర్ట్స్ కోటాలో స్కామ్?**

డీఎస్సీ నియామకాల్లో స్పోర్ట్స్ కోటా పేరుతో భారీ అవకతవకలు జరిగాయని జగన్‌మోహన్‌రెడ్డి ఆరోపించారు. డీఎస్సీ పోస్టుల్లో సర్దుబాట్లు ఎవరి కోసం చేశారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జాతీయ స్థాయి పతక విజేత దుర్గయ్యకు స్పోర్ట్స్ కోటాలో 1:1 నిష్పత్తిలో కాల్‌లెటర్ వచ్చినప్పటికీ ఉద్యోగం రాలేదని, సర్టిఫికెట్లు సక్రమంగా ఉన్నా ఎంపిక చేయకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. స్పోర్ట్స్ కోటాను పూర్తిగా స్కామ్‌గా మార్చేశారని, నిజమైన క్రీడాకారులకు అన్యాయం చేశారని విమర్శించారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా స్పోర్ట్స్ కోటా అభ్యర్థులు డీఎస్సీ పరీక్ష రాయాల్సిన అవసరం లేదంటూ జీవో తీసుకువచ్చారని, కొన్ని పోస్టులకు డిగ్రీ కూడా అవసరం లేదని నిబంధనలు మార్చారని ఆరోపించారు. క్రీడా ప్రతిభతో సంబంధం లేకుండా కేవలం పోటీల్లో పాల్గొన్న వారికి ఉద్యోగాలు కల్పించేలా వ్యవస్థను మార్చారని, దీనివల్ల అర్హులైన క్రీడాకారులు నష్టపోయారని అన్నారు.స్పోర్ట్స్ కోటా ఉద్యోగాల వ్యవస్థను దళారీ కేంద్రంగా మార్చారని జగన్ ఆరోపించారు. మెడల్స్ సాధించిన వారిని పక్కనపెట్టి, కేవలం పాల్గొన్నట్లు సర్టిఫికెట్లు చూపించిన వారికి ఉద్యోగాలు ఇచ్చారని విమర్శించారు. తమకు అనుకూలమైన వారికి ఉద్యోగాలు కల్పించేందుకే జీవో నంబర్ 4, 47లను తీసుకువచ్చారని, తర్వాత జీవో 23, 25, 26లతో ఇతరులకు అవకాశాలు లేకుండా చేశారని ఆరోపించారు. ఇంటర్ కాలేజీ క్రీడల్లో 99 మంది టీచర్ పోస్టులు భర్తీ చేస్తే, అందులో 86 మందికి మెడల్స్ లేకపోయినా ఉద్యోగాలు ఇచ్చారని తెలిపారు. అలాగే డీఎస్సీలో ఒక్కో ఉద్యోగాన్ని రూ.15.26 లక్షలకు అమ్ముకుంటున్నట్లు బేరసారాలు జరిగిన వీడియో బయటకు వచ్చిందని, ప్రభుత్వ లోగోతో పాటు ఫోన్ నంబర్లు కూడా స్పష్టంగా కనిపిస్తున్నా కేవలం తూతూ మంత్రంగా కేసులు పెట్టి, స్టేషన్ బెయిల్‌తో వదిలేశారని విమర్శించారు. ఈ ఘటనలన్నీ డీఎస్సీలో భారీ స్కామ్ జరిగిందనేందుకు నిదర్శనాలని, దీనిపై సమగ్ర విచారణ జరగాలని జగన్ డిమాండ్ చేశారు.

**లీకులే చంద్రబాబు ట్రాక్‌రికార్డు**

చంద్రబాబు పాలన మొత్తం లీకేజీల మయమేనని, ఇప్పుడు డీఎస్సీ నియామకాల వ్యవహారంలోనూ అదే పరిస్థితి కనిపిస్తోందని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. 1995లో టెన్త్ క్లాస్ పేపర్ల లీక్ నుంచి 2025 బీఈడీ, టెన్త్ మ్యాథ్స్ పేపర్ లీకుల వరకు జరిగిన ఘటనలను ప్రస్తావించారు. 1996 ఎంసెట్ ఇంజినీరింగ్ పేపర్లు, 1997 ఇంటర్మీడియట్ పేపర్లు, 2017 టెన్త్ సైన్స్ పేపర్, 2019 టెన్త్ పేపర్ లీక్ వంటి ఘటనలను గుర్తుచేస్తూ, ఇప్పుడు డీఎస్సీ టీచర్ల నియామకాలలోనూ లీకులు, అవకతవకలు వెలుగుచూశాయని ఆరోపించారు. "లీకుల్లో చంద్రబాబు రికార్డు ఇదే" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.డీఎస్సీ వ్యవహారంలో ఉన్న ఆధారాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని సీబీఐ దర్యాప్తునకు తాము పట్టుబడుతున్నామని జగన్ తెలిపారు. తప్పులను ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి, అరెస్టులతో భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. "ఇది జెన్‌జీ కాలం.. ఇప్పుడు జెన్‌ఆల్ఫా కూడా వస్తోంది. నిజాలను ఎవరూ ఆపలేరు. యువత మోసాన్ని గమనిస్తోంది" అంటూ హెచ్చరించారు. ఇటీవల తనను కలిసిన డీఎస్సీ అభ్యర్థులకు న్యాయపోరాటం చేస్తానని హామీ ఇచ్చానని, అవసరమైతే భవిష్యత్తులో అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసి డీఎస్సీ నియామకాలను పునఃసమీక్షించి అన్యాయం జరిగిన వారికి న్యాయం చేస్తామని తెలిపారు. తప్పు చేసిన వారిని శిక్షిస్తామని కూడా స్పష్టం చేశారు.

# తొలి 'మేడ్ ఇన్ ఇండియా' సీ-295 విమాన ప్రయోగం విజయవంతం



**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్):**

భారత రక్షణ రంగ చరిత్రలో దేశీయంగా తయారైన మొట్టమొదటి 'మేడ్ ఇన్ ఇండియా' సీ295 సైనిక రవాణా విమానం తన తొలి ప్రయాణ పరీక్షను విజయవంతంగా పూర్తి చేసుకుంది. గుజరాత్‌లోని వడోదరా ఫైనల్ అసెంబ్లీ లైన్ ప్లాంట్ నుంచి టేక్ ఆఫ్ అయిన ఈ విమానం, సురక్షితంగా ల్యాండ్ అయి సరికొత్త రికార్డు సృష్టించింది.

**టాటా, ఎయిర్‌బస్ సంయుక్త విజయం**

టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టీఏఎస్ఎల్), ఎయిర్‌బస్ సంస్థల సంయుక్త భాగస్వామ్యంతో ఈ విమానాన్ని పూర్తి స్వదేశీ సాంకేతికతతో రూపొందించారు. భారత ప్రైవేట్ రంగంలో ఒక సైనిక విమానం రూపుదిద్దుకోవడం ఇదే తొలిసారి కావడం విశేషం. మొత్తం 56 విమానాల కోసం కుదిరిన రూ. 21,935 కోట్ల ఒప్పందంలో భాగంగా.. 16 విమానాలు స్పెయిన్ నుండి రాగా, మిగిలిన 40 విమానాలను 'మేక్ ఇన్ ఇండియా' కింద వడోదరా ప్లాంట్‌లో తయారు చేస్తున్నారు. ఆ 40 విమానాల్లో విజయవంతంగా పరీక్షించిన మొదటి విమానం ఇదే.

**ఆవ్రో స్థానంలో సరికొత్త వ్యూహాత్మక బలం:**

భారత వైమానిక దళంలో సుదీర్ఘకాలంగా సేవలు అందిస్తున్న పాత 'ఆవ్రో748' విమానాల స్థానంలో ఈ అధునాతన సీ295 విమానాలు చేరనున్నాయి. రెండు పవర్‌ఫుల్ టర్బోప్రాప్ ఇంజన్లు కలిగిన ఈ విమానాలు దాదాపు 70 మంది సైనికులను లేదా 48 మంది పారాట్రూపర్లను మోసుకెళ్లగలవు. సరిహద్దుల్లోని కొండ ప్రాంతాలు, చిన్న రన్‌వేలపై కూడా ఇవి సులభంగా టేక్ ఆఫ్, ల్యాండ్ అవ్వగల సామర్థ్యాన్ని కలిగి ఉండటంతో పాటు, విపత్తు సహాయక చర్యల్లోనూ కీలక పాత్ర పోషించనున్నాయి.

**కేంద్ర మంత్రి, ప్రముఖుల హర్షం:**

ఈ అద్భుత ఘనతపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సోషల్ మీడియా వేదికగా హర్షం వ్యక్తం చేశారు. ఇది కేవలం ఒక విమానం గాల్లోకి ఎగరడం మాత్రమే కాదని, ఏరోస్పేస్ తయారీ రంగంలో భారతదేశం సాధిస్తున్న ఎదుగుదలకు నిదర్శనమని కొనియాడారు. ఈ ప్రాజెక్టు విజయవంతానికి రాత్రింబవళ్లు కృషి చేసిన వైమానిక దళం, టాటా, ఎయిర్‌బస్ బృందాలతో పాటు ఇంజనీర్లు, కార్మికులకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# హిందూ మహిళల వారసత్వ ఆస్తిపై సుప్రీంకోర్టు కీలక సూచనలు



**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్):**

దేశంలో హిందూ మహిళల ఆస్తి వారసత్వ హక్కులపై తలెత్తుతున్న వివాదాలను పరిష్కరించేందుకు సుప్రీంకోర్టు కీలక సూచనలు చేసింది. పిల్లలు లేని మహిళలు తమ మరణానంతరం ఆస్తి ఎవరికి చెందాలనే విషయమై తప్పనిసరిగా వీలునామా రాసుకోవాలని స్పష్టం చేసింది. ప్రస్తుత చట్టాల ప్రకారం వచ్చే చిక్కులను నివారించేందుకు, కోర్టు మెట్లు ఎక్కకముందే సమస్యలను పరిష్కరించుకునేలా మధ్యవర్తిత్వం (ప్రీలిటిగేషన్ మిడియేషన్) తప్పనిసరి చేయాలని ఆదేశించింది. ప్రస్తుత హిందూ వారసత్వ చట్టం ప్రకారం, ఒక మహిళకు పిల్లలు లేని పక్షంలో ఆమె మరణానంతరం ఆస్తి మొదటగా భర్త కుటుంబానికే చెందుతుందని సుప్రీంకోర్టు గుర్తుచేసింది. వివాహం తర్వాత మహిళ గోత్రం మారుతుందని, ఆమెపై ప్రధాన బాధ్యత భర్త కుటుంబానిదే అవుతుందనే సంప్రదాయ అంశాన్ని ఈ సందర్భంగా కోర్టు ప్రస్తావించింది. ఈ చట్టపరమైన నిబంధనల వల్ల మహిళ పుట్టింటి వారికి, అత్తింటి వారికి మధ్య పెద్ద ఎత్తున ఆస్తి వివాదాలు చెలరేగుతున్నాయని కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ తరహా వారసత్వ వివాదాలకు అడ్డుకట్ట వేసేందుకు కోర్టు ఆశ్రయించడానికి ముందే 'ప్రీ-లిటిగేషన్ మిడియేషన్' ద్వారా రాజీ కుదుర్చుకోవడాన్ని తప్పనిసరి చేయాలని కోర్టు ఆదేశించింది. ఈ మధ్యవర్తిత్వ ప్రక్రియలో ఇరుపక్షాల మధ్య కుదిరే ఒప్పందాలను కోర్టు తీర్పు (డిక్రీ)గా పరిగణించాలని స్పష్టం చేసింది. తద్వారా సుదీర్ఘ కోర్టు కేసుల భారం తగ్గుతుందని అభిప్రాయపడింది. ప్రస్తుత వారసత్వ చట్టంలోని సెక్షన్ 15(1)(బి) మహిళల పట్ల వివక్ష పూరితంగా ఉందంటూ కొంతమంది న్యాయవాదులు వ్యక్తం చేసిన అభ్యంతరాలపై కూడా కోర్టు స్పందించింది. ఒకవేళ ఈ చట్టాన్ని సవరించాల్సి వస్తే, ఆ బాధ్యత పూర్తిగా పార్లమెంటుదేనని..కోర్టులు చట్టాలను సవరించలేవని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. మహిళలు తమ ఆస్తిపై వివాదాలు రాకూడదనుకుంటే వీలునామా రాసుకోవడమే ఉత్తమ మార్గమని సూచించింది.


# టర్కీ భారత రాయబారిగా రుద్ర గౌరవ్ శ్రేష్ఠ్

**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్):**

దేశ దౌత్య విభాగంలో కేంద్ర ప్రభుత్వం తాజాగా ఒక కీలకమైన మార్పు చేపట్టింది. రిపబ్లిక్ ఆఫ్ టర్కీలో భారత తదుపరి రాయబారిగా సీనియర్ ఐఎఫ్ఎస్ అధికారి రుద్ర గౌరవ్ శ్రేష్ఠ్ ను నియమిస్తూ భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ గురువారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌లో భారత రాయబారిగా విజయవంతంగా సేవలందిస్తున్న రుద్ర గౌరవ్ శ్రేష్ఠ్‌కు పశ్చిమాసియా రాజకీయాలపై, అంతర్జాతీయ సంబంధాలపై మంచి పట్టు ఉంది. ఈ నేపథ్యంలోనే వ్యూహాత్మకంగా ఎంతో కీలకమైన టర్కీకి ఆయనను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. భారత విదేశాంగ సర్వీస్ (ఐఎఫ్ఎస్)లో సుదీర్ఘ అనుభవం కలిగిన ఆయన త్వరలోనే టర్కీ రాజధాని అంకారాలో బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుతం మారుతున్న అంతర్జాతీయ సమీకరణాల నేపథ్యంలో టర్కీతో భారతదేశ ద్వైపాక్షిక, వాణిజ్య బంధాలను మరింత బలోపేతం చేయడంలో శ్రేష్ఠ్ నియామకం కీలక పాత్ర పోషించనుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.




# పని మనుషులు కాదు... వారే జాతి నిర్మాతలు!



**మొదటిపేజీ తరువాయి....**

జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఓ ప్రమాద కేసు విచారణ సందర్భంగా గృహిణుల ప్రాధాన్యతను ప్రత్యేకంగా ప్రస్తావించింది. గృహిణి అంటే ఇంటి పెద్దపై ఆధారపడే వ్యక్తిగా చూడటం తప్పు అని, నిజానికి కుటుంబమంతా ఆమెపైనే ఆధారపడుతుందని కోర్టు పేర్కొంది. వివిధ రంగాల్లో మహిళలు రాణిస్తున్నప్పటికీ ఇంటి పనుల విషయంలో వారిని తక్కువ అంచనా వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. మహిళలు చేసే ఉచిత గృహ సేవలు దేశ జీడీపీలో 15-17 శాతం వాటాతో సమానమని.. ఒకవేళ ఆమె చేసే పనిని ఆర్థికంగా లెక్కిస్తే నెలకు కనీసం రూ.30 వేల కంటే ఎక్కువ విలువ ఉంటుందని ధర్మాసనం అభిప్రాయపడింది. పంజాబ్‌కు చెందిన ఓ మహిళ 2001లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించగా.. పరిహారం కోసం ఆమె భర్త, ముగ్గురు పిల్లలు ఆశ్రయించిన కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. గతంలో మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్ బాధిత కుటుంబానికి రూ. 2.42 లక్షల పరిహారం ఇవ్వాలని ఆదేశించింది. అయితే ఈ పరిహారంపై అసంతృప్తితో బాధిత కుటుంబం పంజాబ్, హరియాణా హైకోర్టును, ఆ తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించగా ఈ కేసు విచారణకు వచ్చింది.

# భారీ అగ్నిప్రమాదం.. 4 వేల ఈవీఎంల దగ్ధం



**కోల్‌కతా (ఏడీఎన్ఎన్):**

పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతా అలీపూర్ ప్రాంతంలో గల తొమ్మిది అంతస్తుల ప్రభుత్వ భవనంలో గురువారం ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 10 నియోజకవర్గాల్లో ఉపయోగించిన సుమారు 4,000 ఈవీఎంలు పూర్తిగా దగ్ధమయ్యాయి. దక్షిణ 24 పరగణాల జిల్లా పరిషత్ కార్యాలయంతో పాటు పలు ప్రభుత్వ విభాగాలు ఉన్న ఈ భవనంలో చెలరేగిన మంటలను అదుపు చేయడానికి అగ్నిమాపక సిబ్బందికి 24 గంటలకు పైగా సమయం పట్టింది. ఈ ప్రమాదంపై బెంగాల్ మంత్రి కౌశిక్ చౌధురీ స్పందించారు. ఇది సాధారణ అగ్నిప్రమాదంలా కనిపించడం లేదని, దీని వెనుక ఏదైనా కుట్ర దాగి ఉందా? అనే కోణంలో విచారణ జరుపుతున్నామని ఆయన స్పష్టం చేశారు. భవనంలోని రెండు, మూడు అంతస్తుల్లో మొదలైన మంటలు, మధ్య అంతస్తులకు కాకుండా నేరుగా తొమ్మిది, పదో అంతస్తులకు ఎలా వ్యాపించాయనేది అనుమానాలకు తావిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఫోరెన్సిక్ నివేదిక వచ్చిన తర్వాతే పూర్తి స్పష్టత వస్తుందని మంత్రి వెల్లడించారు. ఈ ఘోర ప్రమాదం వెనుక కుట్ర కోణాన్ని కొట్టిపారేయలేమని కేంద్ర మంత్రి సుకాంత మజుందార్ కూడా అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం దక్షిణ 24 పరగణాల యంత్రాంగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు. ఫోరెన్సిక్ పరీక్షలు, శాస్త్రీయ ఆధారాల సాయంతోనే ప్రమాదానికి గల అసలు కారణాలను నిర్ధారిస్తామని అధికారులు తెలిపారు. ఈ అగ్నిప్రమాదంలో ఈవీఎంలతో పాటు భవనంలో ఉన్న ప్రభుత్వ రికార్డులు, మౌలిక సదుపాయాలు, భద్రతా వ్యవస్థలకు వాటిల్లిన నష్టాన్ని కూడా అధికారులు అంచనా వేస్తున్నారు.



# వికసిత్ భారత్ సాధనే లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి...**

ఈ సమావేశంలో కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్‌లతో పాటు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు (చంద్రబాబు, యోగి ఆదిత్యనాథ్, డి.కె. శివకుమార్ తదితరులు), కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు, నీతి ఆయోగ్ ప్రతినిధులు విస్తృతంగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా "వికసిత్ భారత్ 2047 కోసం సమగ్ర మానవాభివృద్ధి" అనే అంశంపై చర్చించారు. వయస్సు, ప్రాంతం, లింగం, సామాజికఆర్థిక నేపథ్యాలతో సంబంధం లేకుండా ప్రతి పౌరుడి సంక్షేమాన్ని పెంపొందించడమే ధ్యేయంగా పెట్టుకున్నారు. దేశంలో వ్యవస్థాపకతను ప్రోత్సహించడం, నైపుణ్యాభివృద్ధిని బలోపేతం చేయడం, స్థిరమైన ఉపాధి అవకాశాలను విస్తరించడంపై ప్రధాని మోదీ ప్రత్యేకంగా దిశానిర్దేశం చేశారు. వీటితో పాటు డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డేటా ఆధారిత విధానాలు, విద్యాక్రీడల అభివృద్ధిపై చర్చించారు. రాష్ట్రాల అభివృద్ధి ప్రణాళికలను జాతీయ లక్ష్యాలతో అనుసంధానిస్తూ, స్వల్పదీర్ఘకాలిక లక్ష్యాల పర్యవేక్షణకు ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

# ఏపీ సర్కార్‌కు ఎన్‌హెచ్‌ఆర్‌సీ నోటీసులు

**మొదటిపేజీ తరువాయి...**

ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలతో రెండు వారాల్లో సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించింది. అలాగే గాయపడిన కార్మికుల ఆరోగ్య పరిస్థితి, మృతుల కుటుంబాలకు అందించిన ఎక్స్ గ్రేషియా వివరాలను కూడా నివేదికలో పొందుపరచాలని సూచించింది.విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోని స్టీల్ మెల్టింగ్ షాప్1లో గత సోమవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో తొలుత 8 మంది కార్మికులు మృతి చెందగా, చికిత్స పొందుతున్న పైడిరాజు బుధవారం మృతి చెందడంతో మృతుల సంఖ్య 9కి చేరింది. మరో ఆరుగురు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. 150 టన్నుల ద్రవ ఉక్కును మోసుకెళ్తున్న భారీ లాడెల్ నుంచి ఒక్కసారిగా ఉక్కు ద్రవం విస్ఫోటనం చెంది చెల్లాచెదురుగా పడటంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ద్రవ ఉక్కు వేడి, విస్ఫోటనం తీవ్రతకు అక్కడి భారీ క్రేన్ పూర్తిగా దగ్ధమై, ప్లాంట్ పరిసరాల్లో మంటలు వ్యాపించాయి. ఈ ఘటనపై కార్మిక సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, భద్రతా నిబంధనలను సక్రమంగా అమలు చేయకపోవడమే ప్రమాదానికి కారణమని ఆరోపిస్తున్నాయి.



# భారత నౌకపై క్షిపణి దాడి.. విశాఖవాసి మృతి

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

ఒమన్ గల్ఫ్ లో భారతీయ సిబ్బందితో ప్రయాణిస్తున్న 'సెటెబెలో' అనే వాణిజ్య చమురు ట్యాంకర్‌పై అమెరికా సైన్యం బుధవారం జరిగిన క్షిపణి దాడిలో ముగ్గురు భారతీయ నావికులు మృతి చెందినట్లు అక్కడి అధికారులు వెల్లడించారు. మరో 21 మంది సిబ్బందిని సురక్షితంగా రక్షించారు. తమ ఆంక్షలను ఉల్లంఘిస్తూ ఇరాన్ నుంచి చమురు రవాణా చేస్తున్నందుకే, హెచ్చరికలు పాటించని ఈ నౌక ఇంజిన్ గదిని లక్ష్యంగా చేసుకుని యుద్ధ విమానం ద్వారా ఖచ్చితమైన దాడి చేశామని అమెరికా సెంట్రల్ కమాండ్ ధృవీకరించింది. క్షిపణి తగలడంతో నౌకలో మంటలు చెలరేగి అది నీట మునిగింది. ఈ దారుణ ఘటనపై భారత ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పశ్చిమాసియాలో వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడాన్ని తక్షణమే ఆపేయాలని, అంతర్జాతీయ జలమార్గాల్లో రవాణా స్వేచ్ఛను గౌరవించాలని కేంద్ర ప్రభుత్వం డిమాండ్ చేసింది. ఈ మేరకు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ అమెరికా చర్యను తీవ్రంగా ఖండిస్తూ.. ఢిల్లీలోని యూఎస్ డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ జేసన్ మీక్స్ ను పిలిపించి తన నిరసనను తెలిపింది. 24 మంది భారతీయులున్న మరో నౌకపై ఒమన్ తీరంలో అమెరికా నౌకాదళం మూడు రోజుల కిందట దాడి చేసిన సంగతి తెలిసిందే.

**కేంద్ర మంత్రి స్పందన**



ఒమన్ తీరంలో భారతీయ సిబ్బంది ఉన్న వాణిజ్య నౌకలపై అమెరికా సైన్యం వరుస దాడులకు తెగబడుతుండటం కలకలం రేపుతోంది. జలవీర్ , మారివెక్స్, 'సెటెబె' అనే చమురు ట్యాంకర్లపై జరిగిన దాడిలో ముగ్గురు భారతీయ నావికులు ప్రాణాలు కోల్పోయినట్లు భారత షిప్పింగ్ మంత్రి సర్బానంద సోనోవాల్ అధికారికంగా ధ్రువీకరించారు. మృతులను డెక్ క్యాడెట్ ఆదిత్య శర్మ, ఇంజిన్ ఫిట్టర్ శివానంద్ చౌరాసియా, విశాఖకు చెందిన చీఫ్ ఇంజినీర్ పట్నాల సురేశ్‌గా గుర్తించి, వారి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్లు మంత్రి తెలిపారు.

**మృతుల్లో విశాఖ వాసి**



ఒమన్ తీరంలో భారతీయ సిబ్బందితో ప్రయాణిస్తున్న 'సెటెబె' వాణిజ్య నౌకపై అమెరికా జరిపిన భీకర క్షిపణి దాడిలో మృతి చెందిన ముగ్గురు భారతీయుల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మెరైన్ ఇంజినీర్ ఉన్నట్లు తేలింది. విశాఖపట్నానికి చెందిన చీఫ్ ఇంజినీర్ పట్నాల సురేష్ (44) ఈ ప్రమాదంలో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు ఢిల్లీలోని ఆంధ్రా భవన్ అధికారులు ధ్రువీకరించారు. నౌక జనరేటర్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యను తనిఖీ చేసేందుకు సురేష్ ఇంజిన్ గదిలోకి వెళ్లిన సమయంలోనే.. సరిగ్గా అమెరికా యుద్ధ విమానం ఆ గదిని లక్ష్యంగా చేసుకుని క్షిపణి దాడి చేయడంతో ఆయన తప్పించుకునే అవకాశం లేకుండా పోయింది.ఐదు నెలల సుదీర్ఘ విధులను ముగించుకుని, త్వరలోనే ఇంటికి వచ్చేందుకు సిద్ధమైన సురేష్ ప్రాణాలు కోల్పోవడం ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ నెల 24 నాటికి ఆయనకు 15వ వివాహ వార్షికోత్సవం కావడం గమనార్హం. అంతలోనే భర్త శాశ్వతంగా దూరమవడంతో భార్య భార్గవి, ఆమె ఇద్దరు కుమారులు (13, 10 ఏళ్లు) కన్నీరుమున్నీరవుతున్నారు. మరో ఇంజినీర్‌కు తోడుగా కేవలం 10 రోజుల విధులకు వెళ్లిన సురేష్, అక్కడ ఉద్రిక్తతల వల్ల విధులను పొడిగించుకోవాల్సి వచ్చిందని, జామర్ల కారణంగా వారం రోజులుగా కేవలం టెక్స్ట్ మెసేజ్‌ల ద్వారానే తాము మాట్లాడుకోగలిగామని భార్గవి రోదిస్తూ వివరించారు.



# సోషల్ మీడియా బ్యాన్‌పై పార్లమెంట్‌లో బిల్లు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

ఆన్‌లైన్ మాయాజాలం, సోషల్ మీడియా వ్యసనం నుంచి చిన్నారుల మానసిక ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రపంచవ్యాప్తంగా సరికొత్త నియంత్రణ విప్లవం మొదలైంది. స్మార్ట్ ఫోన్ల స్క్రీన్‌లకు బందీలవుతూ ఆందోళన, ఒంటరితనం, డిప్రెషన్ వంటి తీవ్ర సమస్యల బారిన పడుతున్న నేటి తరాన్ని రక్షించేందుకు కెనడా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 16 ఏళ్ల లోపు వయసున్న పిల్లలు సోషల్ మీడియాను ఉపయోగించకుండా నిషేధం విధిస్తూ రూపొందించిన కొత్త డిజిటల్ భద్రతా బిల్లు 'సేఫ్ సోషల్ మీడియా యాక్ట్' (బిల్ C-34)ను ఆ దేశ పార్లమెంట్‌లో బుధవారం ప్రవేశపెట్టింది. ఆన్‌లైన్ ద్వారా కలిగే హానికరమైన ప్రభావాలు అత్యంత తీవ్రంగా ఉన్నాయని, పిల్లల భద్రతను ఏమాత్రం విస్మరించకూడదని కెనడియన్ ఐడెంటిటీ అండ్ కల్చర్ మంత్రి మార్క్ మిల్లర్ స్పష్టం చేశారు. నిర్దేశిత కఠిన భద్రతా ప్రమాణాలను పాటిస్తూ, పిల్లలకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించగలమని నిరూపించే ప్లాట్‌ఫామ్‌లకు ఈ నిబంధనల నుంచి మినహాయింపు ఉంటుంది. ఈ నిబంధనలను ఉల్లంఘించి చట్టవిరుద్ధంగా పిల్లలకు యాక్సెస్ ఇచ్చే టెక్ కంపెనీలపై కెనడా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోనుంది. సదరు సంస్థల ప్రపంచవ్యాప్త ఆదాయంలో 3 శాతం లేదా గరిష్ఠంగా 10 మిలియన్ కెనడియన్ డాలర్ల (దాదాపు 7.2 మిలియన్ డాలర్లు) భారీ జరిమానా విధిస్తారు. ప్లాట్‌ఫామ్‌లలో అనుమతి లేకుండా షేర్ చేసే అశ్లీల చిత్రాలు, డీప్‌ఫేక్‌లను రిపోర్ట్ చేసిన 24 గంటల్లోగా తొలగించాలని ఈ బిల్లు స్పష్టం చేసింది. దీనితో పాటు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చాట్‌బాట్‌లను సైతం పర్యవేక్షించడానికి, వాటికి భద్రతా ప్రమాణాలను రూపొందించడానికి ఒక ప్రత్యేక డిజిటల్ రెగ్యులేటరీ సంస్థ 'డిజిటల్ సేఫ్టీ కమిషన్ ఆఫ్ కెనడా'ను ఏర్పాటు చేయనున్నారు. ఈ బిల్లు పూర్తిగా చట్టరూపం దాల్చి అమలులోకి రావడానికి 18 నుంచి 24 నెలల సమయం పట్టవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే ఆస్ట్రేలియా, బ్రెజిల్, ఇండోనేషియా వంటి దేశాలు 16 ఏళ్ల లోపు పిల్లలపై ఆంక్షలు విధించగా.. బ్రిటన్, ఫ్రాన్స్, డెన్మార్క్, గ్రీస్ వంటి దేశాలు కూడా ఇదే తరహా కఠినమైన చట్టాలను తెచ్చేందుకు వేగంగా అడుగులు వేస్తున్నాయి.

# ఇరాన్ పై భీకర దాడులే

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

ఇరాన్‌పై భీకర దాడులు చేస్తామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. 'ట్రూత్ సోషల్' వేదికగా పోస్ట్ చేసిన కొద్దిసేపటికే.. ఇరాన్ పై అమెరికా క్షిపణుల వర్షం కురిపించింది. అమెరికా ప్రతిపాదిత ఒప్పందంపై ఇరాన్ సంతకం చేయకపోతే భీకర దాడులు కొనసాగుతాయని ట్రంప్ స్పష్టం చేశారు. సమీప భవిష్యత్తులో ఇరాన్‌కు చెందిన ఖర్గ్ ద్వీపాన్ని, ఇతర చమురు మౌలిక సదుపాయాలను స్వాధీనం చేసుకుంటామని ట్రంప్ పేర్కొన్నారు. ఈ దాడుల్లో భాగంగా మొత్తం 49 తోమహాక్ క్షిపణులతో పాటు ఫైటర్ జెట్లను రంగంలోకి దించి, పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలోని ఇరాన్ రాడార్, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను అమెరికా సైన్యం దెబ్బతీసింది. ఇరాన్‌లోని దక్షిణ ప్రాంతాలైన మినాబ్, బందర్ అబ్బాస్, సిరిక్‌తో పాటు రాజధాని టెహ్రాన్ లక్ష్యంగా ఈ దాడులు జరిగాయి. ట్రంప్ ఆదేశాల మేరకు కేవలం ఆత్మరక్షణ కోసమే ఈ చర్యలు చేపట్టినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది.అమెరికా దాడులకు ఇరాన్ సైతం అంతే దీటుగా ప్రతిస్పందించడంతో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. అంతర్జాతీయంగా అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని అన్ని రకాల వాణిజ్య, చమురు



నౌకల రాకపోకలకు పూర్తిగా మూసివేస్తున్నట్లు ఇరాన్ మరోసారి ప్రకటించింది. ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) దళాలు అమెరికా యుద్ధనౌకల రక్షణలో ఉన్న రెండు చమురు ట్యాంకర్లపై దాడులు చేశాయి. కాల్పుల విరమణ కోసం ఇరాన్ ప్రతినిధులు ప్రాధేయపడ్డారని ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఇరాన్ తీవ్రంగా కొట్టిపారేసింది.

# వివాహేతర సంబంధాలపై బ్లాక్‌మెయిల్ చేశాడు

- జెఫ్రీ ఎప్‌స్టీన్‌పై బిల్ గేట్స్ వాంగ్మూలం

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

ప్రపంచ అపర కుబేరుడు, మైక్రోసాఫ్ట్ సహవ్యవస్థాపకుడు బిల్ గేట్స్ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు.. దివంగత లైంగిక నేరస్థుడు జెఫ్రీ ఎప్‌స్టీన్ ఆయన గత వ్యక్తిగత జీవితంలోని పొరపాట్లను ఏ విధంగా బ్లాక్‌మెయిల్ అస్త్రాలుగా మార్చుకున్నాడో అమెరికా పార్లమెంటరీ కమిటీ విచారణలో బహిర్గతమైంది. అమెరికా ప్రతినిధుల సభకు చెందిన 'హౌస్ ఓవర్‌సైట్ కమిటీ' బుధవారం నిర్వహించిన సుదీర్ఘ రహస్య విచారణలో బిల్ గేట్స్ హాజరై లిఖితపూర్వకంగా ఇచ్చిన సంచలన నిజాలు వెలుగులోకి వచ్చాయి. తన గత వివాహేతర సంబంధాలను ఆయుధంగా మలుచుకుని, తనను లొంగదీసుకోవడానికి ఎప్‌స్టీన్ తీవ్రంగా ప్రయత్నించాడని ఆయన అంగీకరించారు. జెఫ్రీ ఎప్‌స్టీన్, అతనికి సహకరించిన వ్యక్తులపై అమెరికా న్యాయశాఖ జరిపిన దర్యాప్తు తీరును సమీక్షించేందుకు ఈ ప్రత్యేక పార్లమెంటరీ కమిటీ విచారణ చేపట్టింది.కమిటీకి సమర్పించిన వాంగ్మూలంలో గేట్స్ మాట్లాడుతూ.. "నా వ్యక్తిగత జీవి



తంలోని పొరపాట్లు, వివాహేతర సంబంధాలతో ఎప్‌స్టీన్‌తో నాకున్న పరిచయానికి ఎలాంటి సంబంధం లేదు. కానీ ఆ వ్యవహారాలు నా కుటుంబానికి ఎంతో మానసిక వేదనను మిగిల్చాయి. నా తప్పులను, వాటికి తోడు తను అల్లిన అనేక అబద్ధాలను ఆసరాగా చేసుకుని.. నేను మళ్లీ తనతో కలిసి పనిచేసేలా నాపై తీవ్ర ఒత్తిడి తీసుకురావడానికి ఎప్‌స్టీన్ ప్రయత్నించాడు" అని పేర్కొన్నారు. ఎప్‌స్టీన్‌తో పరిచయం పెంచుకోవడం తన జీవితంలోనే తాను చేసిన అతిపెద్ద తప్పిదమని తీవ్ర విచారం వ్యక్తం చేశారు. అయితే ఎప్‌స్టీన్ ఎలాంటి క్రిమినల్ చర్యలకు పాల్పడటం తాను స్వయంగా చూడలేదని, ఈ వ్యవహారంలో తనకెలాంటి భాగస్వామ్యం లేదని బిల్ గేట్స్ స్పష్టం చేశారు.మైనర్ బాలికలతో వ్యభిచారం చేయించాడనే ఆరోపణలపై ఫ్లోరిడా కోర్టులో ఎప్‌స్టీన్ నేరస్థుడిగా తేలిన తర్వాత, 2011లో బిల్ గేట్స్ తో అతనికి పరిచయం ఏర్పడింది. ఒక పెద్ద స్వచ్ఛంద సేవా నిధిని ఏర్పాటు చేసే ఉద్దేశంతోనే తామిద్దరం 2011 నుంచి 2014 మధ్య కొన్నిసార్లు సమావేశం అయ్యామని, ఆ ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చకపోవడంతో 2014 చివరి నాటికే తమ మధ్య చర్చలు ముగిసిపోయాయని తెలిపారు. తదనంతర కాలంలో బహిర్గతమైన పబ్లిక్ డాక్యుమెంట్ల ద్వారా.. ఎప్‌స్టీన్ తన వైవాహిక సమస్యలను ఉపయోగించుకుని తనపై పట్టు సాధించాలని చూసినట్లు తెలిసిందని వివరించారు. 2019లో సెక్స్ ట్రాఫికింగ్ ఆరోపణలపై ఎప్‌స్టీన్ అరెస్ట్ అయిన తర్వాతే వీరిద్దరి మధ్య ఉన్న సంబంధాలు బహిర్గతం అయ్యాయి. ఈ హైప్రొఫైల్ కేసు దర్యాప్తులో భాగంగా హౌస్ ఓవర్‌సైట్ కమిటీ ఇప్పటికే అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్, రిటైల్ దిగ్గజం లెస్లీ వెక్స్‌నర్‌తో సహా పలువురు అంతర్జాతీయ ప్రముఖులను విచారించడం గమనార్హం.

# హర్మూజ్‌లో 'సీక్రెట్ మిషన్'

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పతాకస్థాయికి చేరిన వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అత్యంత కీలకమైన వ్యాఖ్యలు చేశారు. అంతర్జాతీయ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించినప్పటికీ, ఈ జలమార్గం తమ నియంత్రణలోనే ఉందంటూ అమెరికా స్పష్టం చేసింది. ఈ క్రమంలో వైట్‌హౌస్‌లో జరిగిన మీడియా సమావేశంలో ట్రంప్ మాట్లాడుతూ.. హర్మూజ్ మీదుగా తాము ఒక రహస్య ఆపరేషన్ నిర్వహించి లక్షలాది బ్యారెళ్ల చమురును సురక్షితంగా తరలించినట్లు వెల్లడించారు. చిమ్మచీకట్లో లైట్లు లేకుండా, శత్రుదేశ రాడార్లకు చిక్కకుండా ఒకే రాత్రిలో 22 చమురు నౌకలను విజయవంతంగా దాటించామని, ఈ విషయం ఇరాన్‌కు కూడా ఇప్పుడే తెలుస్తుందని సంచలన ప్రకటన చేసింది. ట్రంప్ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా కొంత గందరగోళానికి దారితీయడంతో అమెరికా సీనియర్ మిలిటరీ అధికారులు రంగంలోకి దిగి నష్టనివారణ చర్యలు చేపట్టారు. హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలకు అమెరికా నౌకాదళం 'ఎస్కార్ట్' (రక్షణ) ఇచ్చిన విషయాన్నే అధ్యక్షుడు ఆ విధంగా ప్రస్తావించారని వారు వివరించారు. యూఎస్ సెంట్రల్ కమాండ్ గైడెడ్ నౌకల రక్షణలో గత నెలలోనే దాదాపు 70 వాణిజ్య నౌకలు ఈ మార్గాన్ని దాటాయని, ఇటీవల ఉద్రిక్తతలు స్వల్పంగా తగ్గడంతో



గత నెల రోజుల్లో దాదాపు 200 నౌకలు సురక్షితంగా ప్రయాణించాయని అధికారులు స్పష్టం చేశారు. పశ్చిమాసియా సంక్షోభానికి ముందు ఈ మార్గంలో నెలకు సగటున 3 వేల నౌకలు రాకపోకలు సాగించేవని మిలిటరీ వర్గాలు గుర్తుచేశాయి.

# ఆగని రక్తపాతం..16 మంది మృతి

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీవోకే)లో హక్కుల సాధన కోసం సాగుతున్న ప్రజా ఉద్యమంపై పాకిస్తాన్ సైన్యం అత్యంత అమానుషంగా విరుచుకుపడింది. రావల్‌కోట్‌లోని ఈద్గా గ్రౌండ్‌లో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న నిరాయుధులైన వేలాది మంది ప్రజలపై పాక్ ఆర్మీ గురువారం జరిపిన విచక్షణారహిత కాల్పుల్లో 16 మంది అక్కడికక్కడే మరణించారు. మరో 37 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. బియ్యం, పిండి వంటి నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని, విద్యుత్ ఛార్జీల భారాన్ని నియంత్రించాలంటూ దాదాపు 60 వేల నుంచి 70 వేల మంది స్థానికులు ఇక్కడ భారీ ఎత్తున శాంతియుత నిరసనకు దిగారు. ఇందులో పెద్ద సంఖ్యలో పురుషులు, మహిళలు, యువత పాల్గొనగా వారిని అణచివేసేందుకు పాక్ ప్రభుత్వం హింసాయుత చర్యలకు ఒడిగట్టింది. సైన్యం జరిపిన ఈ ఘోర కాల్పులతో ఆ ప్రదేశమంతా రక్తసిక్తంగా మారింది. గత శుక్రవారం నుంచి పీవోకే పరిధిలో పాక్ భద్రతా దళాలు జరుపుతున్న దాడులలో మరణించిన వారి సంఖ్య 57కు చేరగా, వందలాది మంది ఆసుపత్రుల పాలయ్యారు. పాక్ ఆర్మీ ఉగ్రవాదుల కంటే దారుణంగా ప్రవర్తిస్తోందని, ఇంటర్నెట్



సేవలను నిలిపివేసి పౌర హక్కులను కాలరాస్తోందని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇంతగా సైనిక బలగాలతో అణచివేయాలని చూస్తున్నా.. తమకు న్యాయం జరిగే వరకు, ప్రాథమిక హక్కులు లభించే వరకు ఆందోళనలను విరమించేది లేదని పీవోకే ప్రజలు తెగేసి చెబుతున్నారు.

# యుద్ధం కావాలా..? భారత్ కు పాక్ కవ్వింపు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

భారత్, పాకిస్తాన్ ల మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న సింధూ నదీ జలాల వివాదం తాజాగా యుద్ధ వాతావరణానికి దారితీస్తోంది. గతేడాది జమ్మూకశ్మీర్ పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్' ద్వారా 1960 నాటి సింధూ నది జలాల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేసిన సంగతి తెలిసిందే. భవిష్యత్ లో పాకిస్తాన్ కు సింధూ నదీ వ్యవస్థ నుంచి ఒక్క చుక్క నీరు కూడా వెళ్లకుండా చేస్తామని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ చేసిన వ్యాఖ్యలపై పాక్ తీవ్రస్థాయిలో మండిపడింది. భారత్ గనుక తమకు రావాల్సిన నీటిని అడ్డుకోవాలని చూస్తే దానిని నేరుగా 'యుద్ధ చర్య'గానే పరిగణిస్తామని పాకిస్తాన్ విదేశాంగ ప్రతినిధి తాహిర్ అంద్రాబీ సంచలన హెచ్చరికలు జారీ చేశారు. ఈ మేరకు ఇస్లామాబాద్‌లో మాట్లాడిన అంద్రాబీ.. లక్షలాది మంది పాక్ ప్రజలకు జీవనాధారమైన నీటిని నిలిపివేయాలని చూడటం అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని, ఇది దక్షిణాసియా శాంతిభద్రతలకు తీవ్ర ముప్పుగా మారుతుందని పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి చార్టర్ లోని ఆర్టికల్ 51 ప్రకారం.. ఒక దేశ మనుగడకు అత్యంత అవసరమైన జలవనరులను ఉద్దేశపూర్వకంగా ఆపేయడం యుద్ధాన్ని ప్రకటించడంతో సమానమని



ఆయన వ్యాఖ్యానించారు. సింధూ జలాలపై పాకిస్తాన్‌కు ఉన్న చట్టపరమైన హక్కులు చర్చలకు అతీతమైనవని, అంతర్జాతీయ న్యాయ సూత్రాల ప్రకారం దౌత్య, న్యాయ, రాజకీయ పరంగా తమ హక్కులను కాపాడుకుంటామని స్పష్టం చేశారు. భారత్ తీసుకునే బాధ్యతారహితమైన నిర్ణయాల వల్ల తలెత్తే పరిణామాలకు న్యూఢిల్లీయే బాధ్యత వహించాల్సి ఉంటుందని పాకిస్తాన్ హెచ్చరించింది.

# మనిషిలా మాట్లాడే 'మేధావి'.. 'ఆఫ్రికన్ గ్రే చిలుక'

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

ప్రపంచంలోని సుమారు 350 చిలుక జాతుల్లోకెల్లా అత్యుత్తమ అనుకరణకారి అయిన ఈ చిలుక, మనుషుల మాటలనే కాకుండా వారి స్వరాన్ని సైతం హూబహూ పలకగలదు. పక్షుల ప్రపంచంలోనే అత్యంత తెలివైనదిగా, "మేధావి"గా గుర్తింపు పొందిన 'ఆఫ్రికన్ గ్రే చిలుక' తన అసాధారణ మేధోశక్తితో శాస్త్రవేత్తలనే ఆశ్చర్యపరుస్తోంది. వెండి బూడిద రంగు రెక్కలు, ప్రకాశవంతమైన ఎరుపు రంగు తోకతో ఆఫ్రికా ఖండంలో కనిపించే ఈ ప్రత్యేక పక్షికి.. ఐదేళ్ల చిన్నారికి ఉండే గ్రహణశక్తి, సమస్యలను పరిష్కరించే సామర్థ్యం ఉంటాయని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. కేవలం శబ్దాలను అనుకరించడమే కాకుండా.. సొంతంగా నిర్ణయాలు తీసుకోవడం, పరిస్థితులకు అనుగుణంగా స్పందించడం, తోటి పక్షులకు సహాయం చేయడం వంటి సామాజిక, కుటుంబ లక్షణాలు వీటి సొంతం. జీవితాంతం ఒకే భాగస్వామితో నమ్మకంగా ఉంటూ, గుంపులుగా జీవించే ఈ పక్షులు తాటిపండ్లు, కోలా మొక్కల పండ్లను ఆహారంగా తీసుకుంటాయి.ఇంతటి ప్రతిభావంతమైన ఈ పక్షి జాతి ప్రస్తుతం మనుషుల స్వార్థం వల్ల తీవ్రమైన మనుగడ సాగింపు ముప్పును ఎదుర్కొంటోంది. వీటి తెలివితేటలు, పెంపుడు పక్షిగా



వీటికి ఉన్న విపరీతమైన ఆదరణే వీటికి శాపంగా మారాయి. నేషనల్ జియోగ్రాఫిక్ నివేదిక ప్రకారం, గత కొన్ని దశాబ్దాల్లోనే సుమారు 13 లక్షలకు పైగా ఆఫ్రికన్ గ్రే చిలుకలు చట్టబద్ధంగా ఎగుమతి కాగా.. వీటికి రెట్టింపు స్థాయిలో అక్రమ రవాణా, వేట సాగుతున్నాయి. ఇవి గుంపులుగా జీవించడం వల్ల వేటగాళ్లు వీటిని సులభంగా బంధిస్తూ, చెట్లను నరికి గూళ్లను ధ్వంసం చేస్తున్నారు. ఒకప్పుడు ప్రకృతి వనాలలో స్వేచ్ఛగా విహరిస్తూ తన మేధస్సుతో ప్రపంచాన్ని అబ్బురపరిచిన ఈ అరుదైన పక్షి, నేడు అంతరించిపోయే ప్రమాదంలో పడి మానవుల సంరక్షణ కోరుతోంది.

**ఆఫ్రికన్ గ్రే చిలుక ప్రత్యేకతలివే..**

ప్రపంచంలోనే అత్యంత తెలివైన పక్షులలో ఒకటి. ఇవి దాదాపు 3 నుంచి 5 సంవత్సరాల మానవ శిశువుతో సమానమైన మేధస్సును, అద్భుతమైన జ్ఞాపకశక్తిని కలిగి ఉంటాయి.

**మాట్లాడే సామర్థ్యం:** ఇవి దాదాపు 1000 లేదా అంతకంటే ఎక్కువ పదాలను నేర్చుకుని, మానవుల స్వరాన్ని, పదాలను , శబ్దాలను సందర్భానుసారంగా పలికే శక్తి ఉంది.

**శారీరక లక్షణాలు**: ఇవి మధ్యస్థ పరిమాణంలో బూడిద రంగులో ఉంటాయి. వీటి తోక ముదురు ఎరుపు లేదా మెరూన్ రంగులో ఉంటుంది. ఇవి 13 అంగుళాల వరకు పెరుగుతాయి.

**నివాసం :** 'ఆఫ్రికన్ గ్రే చిలుక' జాతులు ప్రధానంగా పశ్చిమ లేదా మధ్య ఆఫ్రికాలోని వర్షారణ్యాలకు చెందినవి.

**జీవిత కాలం:** ఇవి మంచి సంరక్షణలో ఉన్నప్పుడు సుమారు 30 నుంచి 50 సంవత్సరాల వరకు జీవిస్తాయి.

**స్వభావం:** ఇవి చాలా సున్నితమైనవి, ప్రేమను కోరుకునేవి మరియు యజమానులతో బలమైన అనుబంధాన్ని ఏర్పరుచుకుంటాయి. వీటికి చాలా శ్రద్ధ, సమయం ,మానసిక వ్యాయమం (ఆటలు, శిక్షణ) అవసరం. లేదంటే ఒత్తిడికి గురై ఈకలు పీకేసుకునే అవకాశం ఉంది.



# కువైట్, బహ్రెయిన్ లక్ష్యంగా డ్రోన్ల దాడి

- గగనతలాన్ని మూసివేసిన కువైట్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**


అమెరికా జరిపిన దాడులకు ప్రతీకారంగా ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్.. కువైట్, బహ్రెయిన్ దేశాల్లోని దాదాపు 18 అమెరికా సైనిక స్థావరాలపై బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో వినాశకర దాడులకు తెగబడింది. కువైట్‌లోని అలీ అల్ సలేమ్, అహ్మద్ అల్ జాబర్ ఎయిర్‌బేస్‌లతో పాటు బహ్రెయిన్‌లోని 'షేక్ ఈసా' బేస్‌ను టార్గెట్ చేయడంతో అమెరికా కమాండ్ సెంటర్లు, ఫైటర్ జెట్ హ్యాంగర్లు భారీగా దెబ్బతిన్నాయి. ఈ ఆకస్మిక వైమానిక దాడుల నేపథ్యంలో కువైట్ ప్రభుత్వం అత్యంత కీలక నిర్ణయం తీసుకుంది. దేశ భద్రత దృష్ట్యా తమ ఎయిర్ స్పేస్‌ను పూర్తిగా మూసివేస్తున్నట్లు ప్రకటించి, అన్ని రకాల కమర్షియల్ విమాన సర్వీసులను రద్దు చేసింది. రాకడలో ఉన్న అంతర్జాతీయ విమానాలను పొరుగు దేశాలకు మళ్లించారు.మరోవైపు శత్రు దేశ దాడులను తిప్పికొట్టేందుకు కువైట్ సైన్యం రంగంలోకి దిగింది. తమ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ ను అప్రమత్తం చేసి, ఆకాశంలోనే ఇరాన్ క్షిపణులను, డ్రోన్లను విజయవంతంగా కూల్చివేస్తున్నట్లు కువైట్ మిలిటరీ జనరల్ స్టాఫ్ వెల్లడించారు. అమెరికాకు మద్దతుగా ఉంటూ తమ భూభాగంలో యూఎస్ సైన్యానికి, ఆయుధాలకు చోటిచ్చినందుకే కువైట్, బహ్రెయిన్, జోర్డాన్ దేశాలను ఇరాన్ లక్ష్యంగా చేసుకుంది. అమెరికా గనుక దాడులు ఆపకపోతే ఈ ప్రతీకార చర్యలు మరింత తీవ్రరూపం దాల్చుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



# ఐ లవ్ ద్రవ్యోల్బణం వ్యాఖ్యలపై డెమోక్రాట్లు ఆగ్రహం

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

అమెరికాలో మే నెల ద్రవ్యోల్బణం (కన్జూమర్ ప్రైస్ ఇండెక్స్) మూడేళ్ల గరిష్ఠానికి.. 4.2 శాతానికి చేరిన వేళ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఆర్థిక భయాలను కొట్టిపారేస్తూ.. "గణాంకాలు బాగున్నాయి.. ద్రవ్యోల్బణం అంటే నాకు చాలా ఇష్టం" అని ఆయన మీడియా వద్ద వ్యాఖ్యానించారు. సామాన్యుల ఆర్థిక కష్టాలను లెక్క చేయని విధంగా ఉన్న ట్రంప్ మాటలపై విపక్ష డెమోక్రాట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. నవంబర్‌లో మధ్యంతర ఎన్నికలు జరగనున్న క్రమంలో, ఈ వ్యాఖ్యలను అస్త్రంగా మార్చుకుని సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం మొదలుపెట్టారు. రిపబ్లికన్ పార్టీ నేత మైక్ జాన్సన్ ఈ మాటలను వక్రీకరించారని నష్ట నివారణకు దిగినా ఫలితం లేకపోయింది. మరోవైపు ఇరాన్‌తో ఉద్రిక్తతల వల్ల కీలకమైన హర్మూజ్ జలసంధిలో ఇంధన రవాణాకు అంతరాయం ఏర్పడి అంతర్జాతీయంగా చమురు ధరలు భగ్గుమంటున్నాయి. తాజాగా బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర 2.47 శాతం పెరిగి బ్యారెల్‌కు 95.40 డాలర్లకు ఎగబాకింది. చమురు మంటలతో సామాన్యులపై భారం పడుతుంటే ట్రంప్ ఇలా బాధ్యతారాహిత్యంగా స్పందించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



# భారత సంతతి వ్యాపారవేత్త రూ.950 కోట్ల టోకరా

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

నకిలీ పత్రాలను సృష్టించి అమెరికాలోని ఒక ప్రముఖ బ్యాంకుకు 100 మిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో దాదాపు రూ.954.2 కోట్లు) మేర కుచ్చుటోపీ వేసిన భారత సంతతి వ్యాపారవేత్త మహేందర్ మఖిజాని (44) ఉదంతం అంతర్జాతీయంగా పెను సంచలనం సృష్టిస్తోంది. గ్రీన్ కార్డుపై అమెరికాలో నివసిస్తున్న మఖిజానిని కాలిఫోర్నియాలోని న్యూపోర్ట్ బీచ్‌లో ఉన్న అతడి విలాసవంతమైన భవనంలో అమెరికా పోలీసులు అరెస్ట్ చేసినట్లు వెలుగులోకి వచ్చింది. టైటిల్ ఇన్సూరెన్స్ పాలసీల రికార్డులను తారుమారు చేసి, అసలైన ఆస్తి హక్కుదారుల వివరాలను దాచిపెట్టి, షెల్ కంపెనీల నెట్‌వర్క్ ద్వారా ఈ భారీ ఆర్థిక మోసానికి పాల్పడినట్లు కాలిఫోర్నియా సెంట్రల్ డిస్ట్రిక్ట్ ఫస్ట్ అసిస్టెంట్ యూఎస్ అటార్నీ బిలాల్ ఎస్సాయిలీ వెల్లడించారు. ఈ కేసులో ఆరోపణలు రుజువైతే మఖిజానికి గరిష్ఠంగా 30 ఏళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉంది.ఈ కేసుకు సంబంధించిన కోర్టు అఫిడవిట్లలో మఖిజాని సాగించిన అరాచకాలు, చీకటి దందాలు బహిర్గతమయ్యాయి. న్యూపోర్ట్ బీచ్‌లో 'కాంటర్ గ్రూప్ V LLC' అనే సంస్థను నడుపుతున్న మఖిజాని.. రియల్ ఎస్టేట్ రుణాల ఒప్పందంలో భాగంగా బ్యాంకు నుంచి వంద మిలియన్ డాలర్లను అడ్వాన్స్‌గా పొందాడు. తర్వాత సెప్టెంబర్ 2024 నుంచి ఏప్రిల్ 2025 మధ్య కాలంలో టైటిల్ ఇన్సూరెన్స్ పాలసీలను ఫోర్జరీ చేసి, ఆయా ఆస్తులపై తన సంస్థకే హక్కులు ఉన్నట్లు నకిలీ పత్రాలు సృష్టించి బ్యాంకును నమ్మించాడు. ఈ మోసం బయటపడకుండా ఉండేందుకు అతడు ఎంచుకున్న మార్గం దర్యాప్తు అధికారులనే షాక్‌కు గురిచేసింది. డ్రగ్స్, సెక్స్ వర్కర్లతో మఖిజాని నిర్వహించే ప్రైవేట్ సెక్స్ పార్టీలకు సదరు బ్యాంకు ఉద్యోగులను ఆహ్వానించి.. ఆ సమయంలో అక్కడ జరిగిన తతంగాన్ని రహస్యంగా వీడియోలు తీయించాడు. ఆ దృశ్యాల ఆధారంగా బ్యాంకు సిబ్బందిని గుప్పిట్లో పెట్టుకుని బ్లాక్‌మెయిల్‌కు పాల్పడినట్లు కోర్టు పత్రాలు పేర్కొంటున్నాయి.మఖిజాని కేవలం ఆర్థిక నేరాలకే పరిమితం కాకుండా.. సాయుధ అనుచరులతో హోటళ్లు, రెస్టారెంట్లను అక్రమంగా కబ్జా చేయడం, తన కింద పనిచేసే సిబ్బందిని చంపుతానని బెదిరించడం వంటి తీవ్రమైన చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. అమెరికా ఇంటర్నల్ రెవెన్యూ సర్వీస్ (IRS) ప్రత్యేక ఏజెంట్లు వివిధ ఖాతాల లావాదేవీలను నిశితంగా పరిశీలించి ఈ భారీ కుట్రను ఛేదించారు. గత నెలలోనే లగున బీచ్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త మహ్మద్ హొనార్కర్‌తో జరిపిన రియల్ ఎస్టేట్ లావాదేవీల మోసం కేసులో.. మఖిజాని బాధితుడికి 1.3 బిలియన్ డాలర్ల (సుమారు రూ.12,391.6 కోట్లు) భారీ నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుందని ఒక మధ్యవర్తిత్వ కమిటీ తీర్పునిచ్చింది. వ్యాపార ప్రత్యర్థులపై పైచేయి సాధించడానికి అతడు బెదిరింపులు, హింసను ఆశ్రయించినట్లు న్యూయార్క్ పోస్ట్ నివేదించింది.

# వైసీపీ నేత తురకా కిషోర్‌పై కేసు నమోదు



**పల్నాడు (ఏడీఎన్ఎన్):**

ఇళ్ల పట్టాల పేరుతో మోసం చేశారనే ఆరోపణలపై వైసీపీ నేత తురకా కిషోర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. జగనన్న ఇళ్ల పట్టాల పేరుతో పేద లబ్ధిదారులకు సంబంధించి నకిలీ పత్రాలు ఇచ్చి డబ్బులు తీసుకున్నారనే ఫిర్యాదు ఆధారంగా ఈ కేసు నమోదైనట్లు సమాచారం.బాధితుల ఫిర్యాదు మేరకు రెవెన్యూ, పోలీసు అధికారులు విచారణ చేపట్టగా, నకిలీ ఇళ్ల పట్టాల వ్యవహారం వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ కేసులో తురకా కిషోర్‌తో పాటు ఆయన బంధువు చల్లా శివపై కూడా కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఇద్దరినీ విచారణకు హాజరుకావాలని నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది.

# నన్ను ఈడీ అరెస్ట్ చేయలేదు

### మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు స్పష్టం



**అమరావతి (ఏడీఎన్ఎన్):**

ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో తనను ఈడీ అధికారులు అరెస్ట్ చేశారంటూ వస్తున్న వార్తలను మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఖండించారు. తాను ఉదయం నుంచి తన ఇంట్లోనే ఉన్నానని, తన అరెస్ట్‌కు సంబంధించి జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు . ఆ వార్తలన్నీ పూర్తిగా అవాస్తవమని కొట్టిపారేశారు.హైదరాబాద్‌లో ఏపీ లిక్కర్ స్కామ్‌కు సంబంధించి ఈడీ అధికారులు ఈరోజు పలువురి ఇళ్లలో సోదాలు నిర్వహించడం , ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డిని అరెస్ట్ చేయడంతో, ఇదే కేసులో నిందితుడిగా ఉన్న కారుమూరిని కూడా అరెస్ట్ చేశారంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అయితే, ఆ ప్రచారాన్ని ఆయన ఖండించడంతో వివాదం సద్దుమణిగింది.

# స్టీల్ ప్లాంట్‌పై మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదు



**అమరావతి (ఏడీఎన్ఎన్):**

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంపై వైసీపీ చేస్తున్న విమర్శలను మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రంగా తప్పుబట్టారు. ఈ అంశంపై ఆయన స్పందిస్తూ, స్టీల్ ప్లాంట్ గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి ఏమాత్రం లేదని స్పష్టం చేశారు. ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన వైసీపీ నాయకులు, ఇప్పుడు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. దుష్ప్రచారం , ఫేక్ రాజకీయాలు చేయడం తప్ప, వైసీపీకి ఎలాంటి సిద్ధాంతాలు లేవని, ఆ పార్టీకి రాజకీయ పార్టీగా చెప్పుకునే అర్హతే లేదని ఆయన మండిపడ్డారు. గత పాలనలో ఒక్క ఉపాధ్యాయ ఉద్యోగాన్ని కూడా భర్తీ చేయని దౌర్భాగ్యులు వైసీపీ నేతలని అచ్చెన్నాయుడు ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వం నిరుద్యోగుల కోసం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'మెగా డీఎస్సీ'ని అడ్డుకోవడానికి ఏకంగా 86 కేసులు వేసి, నిరుద్యోగ యువత భవిష్యత్తుతో ఆడుకున్నారని ఆయన ఆరోపించారు. జాబ్ క్యాలెండర్ పేరుతో యువతను నట్టేట ముంచి, వ్యవస్థలను పూర్తిగా విధ్వంసం చేసిన వారు, ఇప్పుడు స్టీల్ ప్లాంట్ గురించి మాట్లాడటం సిగ్గుచేటని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.నిరుద్యోగ యువతపై జగన్ చేసిన కుట్రలు ఇక సాగవని మంత్రి హెచ్చరించారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకున్నవారు, వ్యవస్థలను నాశనం చేసినవారు ఇప్పుడు ప్రతి విషయాన్ని రాజకీయం చేయడం అలవాటుగా మార్చుకున్నారని ఆయన విమర్శించారు. ఏ విషయంలోనైనా వాస్తవాలు తెలుసుకోకుండా, ప్రజలను తప్పుదోవ పట్టించేలా ప్రచారం చేయడం ఆపాలని ఆయన వైసీపీని హెచ్చరించారు.



# విశాఖ ఉక్కులో వరుస ప్రమాదాలు

**విశాఖపట్నం (ఏడీఎన్ఎన్):**

విశాఖ ఉక్కు కర్మాగారంలో వరుస ప్రమాదాలు చోటుచేసుకోవడం కార్మికులను, స్థానికులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. గత రెండు రోజులుగా ప్లాంట్‌లోని వివిధ విభాగాల్లో ప్రమాదాలు సంభవించడం యాజమాన్య తీరుపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది. నిన్న ఎస్ఎంఎస్2 విభాగంలో ల్యాడిల్ నుంచి ద్రవ రూపంలో ఉన్న ఉక్కు నేలపాలవ్వగా, దానికి కొనసాగింపుగా గురువారం ఉదయం ఏ షిఫ్ట్ లో ఎస్ఎంఎస్1 టీపీబేలో ల్యాడిల్‌కు రంధ్రం పడి భారీగా స్టీల్ మెటల్ నేలపాలైంది. వరుసగా జరుగుతున్న ఈ ఘటనలు యాజమాన్య నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయని కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. ప్లాంట్‌లో జరుగుతున్న వరుస ప్రమాదాలపై కేంద్ర ప్రభుత్వం త్రిసభ్య కమిటీని నియమించి విచారణ చేపడుతోంది. కమిటీ విచారణ జరుగుతున్న తరుణంలోనే, ఇలా పదేపదే ప్రమాదాలు చోటుచేసుకోవడం యాజమాన్య యంత్రాంగం యొక్క పర్యవేక్షణలోపాలను స్పష్టం చేస్తోంది. ప్లాంట్‌లోని భద్రతా ప్రమాణాలను విస్మరిస్తున్నారా లేక యంత్రాల నిర్వహణలో లోపాలు ఉన్నాయా అనే అంశంపై ఇప్పుడు తీవ్ర చర్చ జరుగుతోంది. ఈ ఘటనల పట్ల ప్రభుత్వం ,యాజమాన్యం తక్షణమే స్పందించి, భద్రతా ప్రమాణాలను మెరుగుపరచాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో జరిగిన ప్రమాదాలను పరిగణనలోకి తీసుకుని,త్రిసభ్య కమిటీ నివేదిక ఆధారంగా భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వరుస ప్రమాదాలతో కార్మికులు భయాందోళనల మధ్య విధులకు హాజరవుతున్న నేపథ్యంలో, వారి భద్రతకు పూర్తి భరోసా కల్పించడం యాజమాన్యం ప్రాథమిక బాధ్యత అని పలువురు నేతలు హెచ్చరిస్తున్నారు.

# మెగా డీఎస్సీలో పారదర్శకతకు పెద్దపీట

- ఏపీ విద్యాశాఖ కార్యదర్శి స్పష్టం

**అమరావతి (ఏడీఎన్ఎన్):**



ఏపీలో మెగా డీఎస్సీ నిర్వహణ అత్యంత పారదర్శకంగా జరిగిందని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ స్పష్టం చేశారు. మెగా డీఎస్సీపై వైసీపీ చేస్తున్న ఆరోపణలను ఆయన ఖండించారు. మొత్తం 16,347 పోస్టుల భర్తీ ప్రక్రియను ఎటువంటి లోపాలకు తావులేకుండా పూర్తి చేశామని ఆయన తెలిపారు. ఈ పరీక్షల నిర్వహణలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ప్రమేయం లేకుండా, టీసీఎస్ ఐకాన్ సంస్థ సహకారంతో అత్యంత గోప్యంగా వ్యవహరించామని ఆయన పేర్కొన్నారు. పరీక్షా నిర్వహణలో భద్రతా పరమైన చర్యలను వివరిస్తూ.. సుమారు 47 వేల ప్రశ్నలతో క్వశ్చన్ బ్యాంకును తయారు చేశామని, ప్రశ్నాపత్రాలు రూపొందించే కంప్యూటర్ల పాస్‌వర్డ్‌లను ఎప్పటికప్పుడు మారుస్తూ పకడ్బందీగా వ్యవహరించామని వెల్లడించారు. టెట్ స్కోర్, డీఎస్సీ మార్కులు మరియు పూర్తి స్థాయి మెరిట్ జాబితాను ఇప్పటికే అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని ఆయన తెలిపారు. ఈ మొత్తం ప్రక్రియలో పారదర్శకతను పాటిస్తున్నామని, అభ్యర్థులు ఈ వివరాలను ఎవరైనా సరిచూసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. డీఎస్సీ పరీక్షలో ఫస్ట్ ర్యాంక్ సాధించిన నవీన్ అనే అభ్యర్థికి ఉద్యోగం రాలేదన్న ఆరోపణలపై శశిధర్ వివరణ ఇచ్చారు. సదరు అభ్యర్థి నవీన్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియకు హాజరు కాలేదని, నిబంధనల ప్రకారం (రూల్ 26) వెరిఫికేషన్‌కు గైర్హాజరైతే ఉద్యోగ అవకాశం కల్పించలేమని ఆయన స్పష్టం చేశారు. కేవలం నిబంధనల ప్రకారమే ఈ నిర్ణయం తీసుకున్నామని, ఇందులో ఎటువంటి రాజకీయ కోణం లేదని ఆయన తేల్చి చెప్పారు.

# దమ్ముంటే నా ప్రశ్నలకు జవాబివ్వండి

- బీజేపీ నాయకులకు వైఎస్ షర్మిల సవాల్

**అమరావతి (ఏడీఎన్ఎన్):**



ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిలకు కర్ణాటక కోటా నుంచి రాజ్యసభ సీటు దక్కుతుందంటూ ఇటీవల పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అయితే, అది వాస్తవం కాదని తేలడంతో, ఈ అంశంపై బీజేపీ నేతలు వ్యంగ్యంగా స్పందించారు. రాజ్యసభ సీటు రాకపోవడంతోనే షర్మిల అసహనంతో వాస్తవాలను విస్మరించి, బీజేపీపై కక్ష సాధింపు ఆరోపణలు చేస్తున్నారని బీజేపీ నేతలు విమర్శించారు. మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణను బీజేపీ కక్ష సాధింపుగా షర్మిల పేర్కొనడంపై వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.దీనిపై వైఎస్ షర్మిల ట్విట్టర్ వేదికగా బీజేపీపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాజ్యసభ సీటు అనేది మాట ఇచ్చిన వారికి, తీసుకున్న వారికి మధ్య జరిగిన విషయం అని, దీనిపై బీజేపీకి అనవసరమైన అతి స్పందన ఎందుకని ఆమె ప్రశ్నించారు. "రాష్ట్రంలో బీజేపీ 12 ఏళ్ల వైఫల్యాలను ప్రజల ముందు ఉంచితే, సమాధానం చెప్పే దమ్ములేక పిచ్చిప్రేలాపనలు చేస్తున్నారు" అని ఆమె ఘాటుగా విమర్శించారు.తనది ప్రజా ఉద్యమ గొంతుకని, రాష్ట్ర అభివృద్ధి పట్ల తమకు అంకితభావం ఉందని ఆమె పేర్కొన్నారు. నిజంగా బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే, తమ పార్టీ లేవనెత్తిన 12 అంశాలపై సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. రాష్ట్రంలోని సమస్యలపై పుండు మీద కారం చల్లే పనులు మానేసి, తమ పార్టీ వైఫల్యాలను సరిదిద్దుకోవాలని ఆమె బీజేపీ నేతలకు సూచించారు.

# వైసీపీ తప్పుడు ప్రచారం మానుకోవాలి

**అమరావతి (ఏడీఎన్ఎన్):**



డీఎస్సీ ప్రక్రియపై మాజీ సీఎం వైఎస్ జగన్ చేస్తున్న ఆరోపణలను 'గొడ్డలి రాజకీయాలు'గా ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, అభివర్ణించారు. నియామక ప్రక్రియను ఎస్‌సీఈఆర్‌టీ నిపుణుల పర్యవేక్షణలో, అత్యంత భద్రత మధ్య నిర్వహించామని ఆయన స్పష్టం చేశారు. వైసీపీ నేతలకు కనీసం 'సర్టిఫికేట్ వెరిఫికేషన్' అంటే ఏమిటో కూడా తెలియదని, రాజకీయ లబ్ధి కోసం నిరుద్యోగ యువతను వాడుకుంటున్నారని ఆయన విమర్శించారు.గత వైసీపీ ప్రభుత్వంలో అక్రమాలకు పాల్పడ్డారని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. దొంగ సర్టిఫికెట్లతో అనర్హులకు సచివాలయ ఉద్యోగాలు కట్టబెట్టిన చరిత్ర జగన్‌ది అని పేర్కొన్నారు. క్రీడాకారుల కోటా పేరుతో ఇష్టానుసారంగా ఉద్యోగాలు ఇచ్చారని, బాల్ బ్యాడ్మింటన్ వంటి ఆటల గురించి అవగాహన లేకుండానే నిర్ణయాలు తీసుకున్నారని ఆయన ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన నియామకాల్లో ఎలాంటి అక్రమాలు లేవని, అన్ని వివరాలు ఆన్‌లైన్‌లో పారదర్శకంగా ఉన్నాయని వివరించారు.వ్యవస్థలను మేనేజ్ చేయడం అలవాటైన జగన్‌కు, చట్టపరమైన కనీస పరిజ్ఞానం కూడా లేదని ఎమ్మెల్సీ విమర్శించారు. దేశంలోనే అత్యంత అవినీతిపరుడైన జగన్, ఇప్పుడు అవినీతిపై మాట్లాడటం హాస్యాస్పదమని అన్నారు. డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను మోసం చేస్తున్న బొంత రోశయ్య అనే వ్యక్తిపై ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదైందని ఆయన గుర్తు చేశారు.చివరగా, వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జరిగిన డీఎస్సీ స్కామ్‌లపై చర్చించే దమ్ము జగన్‌కు ఉందా? అని భూమిరెడ్డి సవాల్ విసిరారు. కూనా రవికుమార్, భరత్‌లపై చేస్తున్న ఆరోపణలను నిరూపించాలని డిమాండ్ చేస్తూ, దమ్ముంటే ఎక్కడైనా, ఎప్పుడైనా బహిరంగ చర్చకు రావాలని జగన్‌కు ఆయన సవాల్ విసిరారు.

# మెగా డీఎస్సీపై బురదజల్లే రాజకీయాలు

**విజయనగరం (ఏడీఎన్ఎన్):**



మెగా డీఎస్సీ నియామకాలపై వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న ఆరోపణలను విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, తీవ్రంగా ఖండించారు. సీఎం చంద్రబాబు నాయుడు , మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా, నిరుద్యోగుల కలలను సాకారం చేసేలా ఈ ప్రక్రియను చేపట్టిందని ఆయన స్పష్టం చేశారు. అబద్ధాలను పదేపదే చెప్పినంత మాత్రాన అవి నిజాలు కావని, జగన్ ఎన్ని కుట్రలు చేసినా మెగా డీఎస్సీ పారదర్శకతను కించపరచలేరని ఆయన పేర్కొన్నారు.ఐదేళ్ల తమ పాలనలో నిరుద్యోగుల గురించి ఏనాడూ పట్టించుకోని జగన్, నేడు కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీని విజయవంతంగా నిర్వహిస్తుంటే ఓర్వలేక బురదజల్లే రాజకీయాలు చేస్తున్నారని ఎంపీ మండిపడ్డారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన టీసీఎస్ ఐఓఎన్ ప్లాట్‌ఫారమ్ ద్వారా, కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానం లో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా ఈ పరీక్షలు నిర్వహించామని ఆయన వెల్లడించారు. వైసీపీ హయాంలో పదోతరగతి పరీక్ష పత్రాల లీకేజీలు జరిగాయని, స్కామ్‌లకు కేరాఫ్‌గా ఆ ప్రభుత్వం నిలిచిందని ఆయన ఎద్దేవా చేశారు.లక్షలాది మంది అభ్యర్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న మెగా డీఎస్సీని కోర్టుల చుట్టూ తిప్పి అడ్డుకోవాలని ప్రయత్నించినా, ప్రభుత్వం అభ్యర్థుల నమ్మకాన్ని గెలిచి పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసిందని ఎంపీ అప్పలనాయుడు తెలిపారు. స్పోర్ట్స్ కోటా , ఇతర విభాగాల్లో కూడా అక్రమాలకు అవకాశం లేకుండా పూర్తి స్థాయి స్క్రీనింగ్ నిర్వహించామని ఆయన వివరించారు. నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న ప్రభుత్వాన్ని తప్పుడు ఆరోపణలతో తప్పుదోవ పట్టించాలని చూస్తే, యువత జగన్‌ను ఎప్పటికీ క్షమించదని ఆయన హెచ్చరించారు.

# వైసీపీ హయాంలో స్టీల్ ప్లాంట్ అమ్మకానికి కుట్ర

- పల్లా శ్రీనివాసరావు సంచలన ఆరోపణలు

**విశాఖపట్నం (ఏడీఎన్ఎన్):**



వైసీపీ హయాంలో విశాఖ స్టీల్ ప్లాంట్ దుస్థితిని, అప్పట్లో కార్మికుల పట్ల మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి నిర్లక్ష్యాన్ని టీడీపీ ఏపీ అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తీవ్రంగా తప్పుబట్టారు. విశాఖపట్నం వేదికగా గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. వైసీపీ మళ్లీ అధికారంలోకి వచ్చి ఉంటే గంగవరం పోర్టు తరహాలోనే స్టీల్ ప్లాంట్‌ను కూడా అమ్మేసేవారని ఆయన విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే ప్యాకేజీని తెచ్చి ప్లాంట్‌ను నిలబెట్టామని, కార్మికుల పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని స్పష్టం చేశారు.అదేవిధంగా, విశాఖపట్నంలోని భూ సమస్యలపై కూడా ఆయన కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కూలంకషంగా చర్చించారు. సింహాచలం పంచగ్రామాల సమస్యలు, గాజువాక ఇనామ్ భూములు, 22ఏ డిలీషన్ వంటి రెవెన్యూ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామని, నిబంధనలకు లోబడి ఉన్న భూములకు వెంటనే పట్టాలు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. భూ ఆక్రమణల విషయంలో విజిలెన్స్ విభాగానికి పూర్తి బాధ్యతలు అప్పగించామని, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఇక స్టీల్ ప్లాంట్‌లో వరుసగా జరుగుతున్న ప్రమాదాల పట్ల పల్లా శ్రీనివాసరావు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. భయాందోళనల మధ్య కార్మికులు విధులకు వెళ్లడం బాధాకరమని, వారికి పూర్తి భరోసా కల్పించడం యాజమాన్యం బాధ్యత అని ఉద్ఘాటించారు. ప్లాంట్ భద్రతా ప్రమాణాలను క్రమంతప్పకుండా పర్యవేక్షించేందుకు ఒక ప్రత్యేక మెకానిజంను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ప్రమాద ఘటనలపై ఇప్పటికే కమిటీ ఏర్పాటైందని, బాధ్యులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని పల్లా స్పష్టం చేశారు.

# 'వికసిత్ భారత్, వికసిత్ ఏపీ' లక్ష్యంగా అడుగులు

**విజయవాడ (ఏడీఎన్ఎన్):**



జగన్, షర్మిల శవ రాజకీయాలు మానుకోవాలని బీజేపీ ఏపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు . విజయవాడలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏపీలో ఎన్డీఏ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లేందుకు విస్తృతమైన కార్యాచరణను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. శుక్రవారం తిరుపతి వేదికగా నిర్వహిస్తున్న భారీ ఎన్డీఏ సభలో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, బీజేపీ అగ్రనేతలు పాల్గొని కూటమి భవిష్యత్తు ప్రణాళికను వివరించనున్నారని తెలిపారు. 12 ఏళ్ల మోదీ పాలనలో దేశం సాధించిన ప్రగతిని, ఏపీలో జరుగుతున్న అభివృద్ధిని ప్రతి ఇంటికీ తీసుకెళ్తామని, 2047 నాటికి 'వికసిత్ భారత్, వికసిత్ ఏపీ' లక్ష్యంగా తాము ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు.ఇటీవల విశాఖ స్టీల్ ప్లాంట్ ఐరన్ ఓర్ ప్రమాదంలో కార్మికులు మరణించడం అత్యంత బాధాకరమని పీవీఎన్ మాధవ్ అన్నారు. జగన్ అక్కడకు వెళ్లి మొసలి కన్నీరు కారుస్తున్నారని మండిపడ్డారు. శవాలను అడ్డం పెట్టుకుని జగన్ రాజకీయం చేయడం మానుకోవాలని హితవుపలికారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించి, అది ప్రైవేటు పరం కాకుండా ఆపింది తామేనని స్పష్టం చేశారు. 'స్టీల్ ప్లాంట్ ప్రైవేటు పరం కాకుండా నేనే చేశాను అని జగన్ ఎలా చెప్పుకుంటారు?' అని ప్రశ్నించారు.



# మతసామరస్యానికి ప్రతీకగా రొట్టెల పండుగ

**నెల్లూరు(ఏడీఎన్ఎన్):**

నెల్లూరులోని చారిత్రక ప్రాశస్త్యం కలిగిన బారాషాహిద్ దర్గాలో జరగనున్న 'రొట్టెల పండుగ' ఏర్పాట్లపై రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ , ఇతర అధికారులతో కలిసి దర్గా ప్రాంగణంలో పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగకు దేశ, విదేశాల నుండి లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని మంత్రి స్పష్టం చేశారు.ఈ రోటీ ఫెస్టివల్‌కు వచ్చే భక్తుల సౌకర్యార్థం దర్గా సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం, వక్ఫ్ బోర్డు , మున్సిపల్ కార్పొరేషన్ నిధులను కలిపి మొత్తం రూ. 10 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మంత్రి నారాయణ ప్రకటించారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి , వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ పర్యవేక్షణలో ఇప్పటికే డిజైన్లు ఖరారై, టెండర్లు పూర్తయిన పనులను అత్యంత నాణ్యతతో నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈనెల 26 నుండి ఐదు రోజుల పాటు జరగనున్న ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు.



# నేడు రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ ర్యాలీలు

**అమరావతి (ఏడీఎన్ఎన్):**

ఏపీ వ్యాప్తంగా చంద్రబాబు రెండేళ్ల పాలనకు నిరసనగా వైసీపీ అధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ర్యాలీలు నిర్వహిస్తున్నట్టు మాజీ సీఎం వైఎస్ జగన్ తెలిపారు. దగాపడ్డ రైతులు, దగాపడ్డ మహిళలు, దగాపడ్డ పిల్లలు, ఇలా దగాపడిన ప్రతీ వర్గాన్ని కలుపుకుంటూ ప్రజల తరఫున నేడు నియోజకవర్గ స్థాయిలో ఈ ర్యాలీలు జరుగుతున్నాయని స్పష్టం చేశారు.అలాగే, చంద్రబాబు వెన్నుపోట్లను, దగాను, స్కాంలను, మోసాలను గట్టిగా ప్రశ్నిస్తూ నిరసన తెలుపుతామన్నారు. దీంతోపాటు డీఎస్సీ అక్రమాల కారణంగా అన్యాయమైపోయిన వారికి సంఘీభావంగా ఈ నిరసన ర్యాలీలు చేపడతున్నట్టు వెల్లడించారు.




# స్టాఫ్ నర్స్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల

**అమరావతి (ఏడీఎన్ఎన్):**

ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ స్టాఫ్ నర్సులు , ఇతర వైద్య సిబ్బంది నియామకానికి సంబంధించిన నోటిఫికేషన్‌ను గురువారం విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ ఆసుపత్రులు , ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేయనున్నారు. ఈ నోటిఫికేషన్ ద్వారా మొత్తం 419 స్టాఫ్ నర్సు పోస్టులను, అలాగే 110 మల్టీ రిహాబిలిటేషన్ వర్కర్ , ఫార్మసిస్ట్ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయనుంది.ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థులు ఈనెల 13, 2026 నుంచి ఆన్‌లైన్ లేదా నిర్ణీత ప్రక్రియ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుల స్వీకరణకు జూన్ 30, 2026ను చివరి తేదీగా అధికారులు ప్రకటించారు. అభ్యర్థులు ఈ గడువులోపే తమ దరఖాస్తులను సమర్పించుకోవాల్సి ఉంటుంది.ఈ పోస్టులను పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఎన్సీడీ క్లినిక్‌లు, న్యూట్రిషన్ రికవరీ సెంటర్లు, నియోనేటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్లు, డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్లతో పాటు వైద్య ఆరోగ్య శాఖలోని వివిధ విభాగాల్లో భర్తీ చేయనున్నారు. అర్హులైన అభ్యర్థులు ప్రభుత్వ నిబంధనల మేరకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని శాఖ సూచించింది.

# రాజ్ కసిరెడ్డి, వాసుదేవరెడ్డికి 14 రోజుల రిమాండ్

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**



ఏపీ మద్యం కేసులో ఈడీ దర్యాప్తు కీలక మలుపు తిరిగింది. ఈ కుంభకోణానికి సంబంధించి నిందితులుగా ఉన్న రాజ్ కసిరెడ్డి, ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డిని ఈడీ అధికారులు హైదరాబాద్‌లో అరెస్టు చేశారు. వారిద్దరిని అదుపులోకి తీసుకున్న ఈడీ, కార్యాలయానికి తరలించి సుదీర్ఘంగా విచారించింది. మద్యం రవాణా, అక్రమ లావాదేవీలు , నిధుల మళ్లింపుపై అధికారులు ప్రశ్నల వర్షం కురిపించినట్లు సమాచారం.విచారణ తర్వాత , అరెస్టు చేసిన నిందితులిద్దరికీ వైద్య పరీక్షలు నిర్వహించి నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. ఈడీ తరఫున వాదనలు విన్న ధర్మాసనం, కేసు తీవ్రతను పరిగణనలోకి తీసుకుని నిందితులిద్దరికీ 14 రోజుల పాటు రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ తీర్పు తర్వాత, అధికారులు వారిని చంచల్ గూడ జైలుకు తరలించారు.



## ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా బీజేపీ

సిద్దిపేట(ఏడీఎన్ఎన్):

ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రతిపక్షాలు రాజకీయ ప్రయోజనాల కోసమే బీజేపీపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఆరోపించారు. సిద్దిపేట జిల్లా కుకునూర్‌పల్లి మండలం మాత్‌పల్లిలో గురువారం జరిగిన బీజేపీ జిల్లా స్థాయి శిక్షణ తరగతుల్లో ఆ పార్టీ రాష్ట్ర ఆయన మాట్లాడుతూ, ప్రతిపక్షాలపై తీవ్ర విమర్శలు చేశారు.గతంలో ఈ ప్రక్రియ నిర్వహించినప్పుడు మద్దతు ఇచ్చిన వారే, ఇప్పుడు వ్యతిరేకించడం వెనుక కుట్ర ఉందని పేర్కొన్నారు. కేరళ, కర్ణాటక, తెలంగాణ వంటి పలు రాష్ట్రాల్లో అమలవుతున్న ఈ ప్రక్రియ ప్రధాన ఉద్దేశం.. ఓటు హక్కు ఉన్న ప్రాంతంలోనే ఓటు వినియోగించుకునేలా పారదర్శకతను తీసుకురావడమేనని ఆయన స్పష్టం చేశారు.రాష్ట్రంలో బీజేపీ బలమైన ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదుగుతోందని, ప్రజలంతా పార్టీని విశ్వసిస్తున్నారని రామచందర్‌రావు తెలిపారు. మరోవైపు, బీఆర్ఎస్ , కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతులు, విద్యార్థులు, ఉద్యోగుల పట్ల తమ బాధ్యతను విస్మరించి అన్ని వర్గాలను మోసం చేశాయని ఆయన విమర్శించారు. ఇదే సమావేశంలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ, ఓటర్ల జాబితా ప్రక్షాళన కోసమే ఈ ఎస్ఐఆర్ ప్రక్రియ చేపడుతున్నామని, ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ప్రభుత్వం ఈ ప్రక్రియలో పూర్తిస్థాయి పారదర్శకతను పాటించాలని ఆయన డిమాండ్ చేశారు.



## కేసీఆర్ హయాంలో అప్పుల కుప్పగా రాష్ట్రం

హైదరాబాద్(ఏడీఎన్ఎన్):

కేసీఆర్ హయాంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పట్టించుకోకుండా ఇష్టమొచ్చినట్లు అప్పులు చేశారని, కేవలం శిలాఫలకాలు వేయడమే తప్ప అభివృద్ధి పనులకు నిధులు కేటాయించలేదని మంత్రి వివేక్ వెంకటస్వామి ధ్వజమెత్తారు. సిద్దిపేట జిల్లాలో గురువారం జరిగిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ , గత కేసీఆర్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారుకాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, ప్రజల అవసరాలను గుర్తించి కట్టుబడి పనిచేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై మంత్రి వివేక్ వెంకటస్వామి కీలక వివరణలు ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం 50 శాతం వరకు స్లాబ్ లెవల్‌కు చేరుకుందని, సొంతంగా ఇళ్లు నిర్మించుకోవాలనుకునే వారికి తప్పకుండా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, తెలంగాణ ఆర్టీసీకి రూ. 300 కోట్లు కేటాయించామని ఆయన తెలిపారు. వీటితో పాటు విద్యార్థుల కోసం ఉచిత అల్పాహారం, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందని పేర్కొన్నారు.రైతులకు సామాన్య ప్రజలకు భరోసా కల్పిస్తూ మంత్రి పలు కీలక అంశాలను వెల్లడించారు. సిద్దిపేట జిల్లాలో కొత్త రేషన్ కార్డులు, అర్హులకు పింఛన్ల పంపిణీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో యూరియా కొరత ఏమాత్రం లేదని, ప్రతి ఎకరాకు రెండు బస్తాల యూరియాను రైతులకు అందిస్తామని స్పష్టం చేశారు. అలాగే, వచ్చే రెండు రోజుల్లోనే ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేస్తామని ఆయన వివరించారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హైమావతి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.




## ఒక్క రాజ్యసభ సీటు కోసం ఇంతలా దిగజారాలా?

హైదరాబాద్(ఏడీఎన్ఎన్):

రాజ్యసభలో కాంగ్రెస్ బలం పెరగకూడదనే దురుద్దేశంతోనే బీజేపీ కుట్రలు చేస్తోందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆరోపించారు. మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ అంశంపై బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో గురువారం మండిపడ్డారు. ఎటువంటి కేసు నమోదు కాని ప్రైవేట్ కేసును సాకుగా చూపి నామినేషన్‌ను తిరస్కరించడం బాధాకరమని , ఇది కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సీటును బీజేపీ "చోరీ" చేయడమేనని జగ్గారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు దేశ ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని ఆయన వ్యాఖ్యానించారు.రాజకీయాలను మహాభారతంతో పోల్చిన జగ్గారెడ్డి, రాహుల్ గాంధీ ధర్మరాజు వంటి వారని, మోదీ కౌరవుల నాయకుడు దుర్యోధనుడిలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. నిత్యం రాహుల్ గాంధీని, కాంగ్రెస్ పార్టీని ఎలా దెబ్బతీయాలనే ఆలోచనలో ఉన్న ప్రధాని మోదీకి, దేశ పాలనపై శ్రద్ధ లేదని ఆయన ఎద్దేవా చేశారు. నిజాయితీపరురాలైన మీనాక్షి నటరాజన్‌ను అడ్డుకోవడానికి ఏకంగా పీఎంవో కార్యాలయం రంగంలోకి దిగడం వెనుక ఉన్న మతలబు ఏంటని ఆయన ప్రశ్నించారు. కేవలం ఒక రాజ్యసభ సీటు కోసం ఇంతగా దిగజారాల్సిన అవసరం ఏముందని, బీజేపీ చేస్తున్న ఈ "గలీజ్ రాజకీయాల"పై తెలంగాణ బీజేపీ నేతలు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.అంతేకాకుండా, మోదీ గత 12 ఏళ్ల పాలనలో యువతకు ఇచ్చిన హామీల గురించి జగ్గారెడ్డి తీవ్రంగా నిలదీశారు. దేశంలో 24 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన మోదీ, ఆ హామీని ఎందుకు నెరవేర్చలేకపోయారని ఆయన సూటిగా ప్రశ్నించారు. అభివృద్ధి, ఉపాధి వంటి అంశాలను పక్కన పెట్టి, కేవలం రాజకీయ కక్ష సాధింపులకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన ఆరోపించారు. రాజ్యసభ ఎన్నికల ప్రక్రియలో నిబంధనలను పక్కన పెట్టి, బీజేపీ తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తోందని, ఇటువంటి ప్రజా వ్యతిరేక చర్యలను ప్రజలు గమనిస్తున్నారని ఆయన హెచ్చరించారు.

# వైద్య ఆరోగ్యశాఖలో బదిలీల చిక్కులు

హైదరాబాద్(ఏడీఎన్ఎన్):

వైద్య, ఆరోగ్య శాఖలో బదిలీల ప్రక్రియ అసంపూర్తిగా నిలిచిపోవడంతో ఉద్యోగులు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ టీజీఓ అసోసియేషన్ డాక్టర్స్ ఫోరం ప్రతినిధులు గురువారం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి వినతిపత్రం సమర్పించారు. డాక్టర్స్ ఫోరం అధ్యక్షులు డాక్టర్ కత్తి జనార్ధన్ నేతృత్వంలో జరిగిన ఈ భేటీలో వైద్యులు, పారామెడికల్, నర్సింగ్ సిబ్బంది , డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల ప్రతినిధులు పాల్గొన్నారు. మూడేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారికి వెబ్ ఆప్షన్స్ కల్పించి మధ్యలోనే నిలిపివేయడం వల్ల తమకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.బదిలీల ప్రక్రియలో భాగంగా స్పౌజ్ కేసులు, అనారోగ్య కారణాలు మరియు వితంతువులకు సంబంధించిన అసంపూర్తిగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. బదిలీలు కోరుకుంటున్న వారందరికీ న్యాయం జరిగేలా మళ్లీ వెబ్ ఆప్షన్స్ ప్రక్రియను చేపట్టాలని వారు కోరారు. వైద్యారోగ్య శాఖలోని వివిధ విభాగాల ఉద్యోగుల సమస్యలను సావధానంగా విన్న మంత్రి దామోదర రాజనర్సింహ, వారి అభ్యర్థనలపై సానుకూలంగా స్పందించారు.ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశిస్తామని, అన్ని అంశాలపై పరిశీలించి త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్స్ ఫోరం రాష్ట్ర నాయకులు డాక్టర్ వంశీ, డాక్టర్ వెంకట్ యాదవ్, డాక్టర్ అభిరామ్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల సంఘం ప్రతినిధులు ఆలె బాలకృష్ణ, అనిల్ రెడ్డి, ఆయుష్ ఫోరం అధ్యక్షులు డాక్టర్ రవి కుమార్, నర్సింగ్ ఫోరం అధ్యక్షులు సుజాత తదితరులు పాల్గొన్నారు.



# ప్రకృతి వ్యవసాయమే భవిష్యత్తు

కరీంనగర్(ఏడీఎన్ఎన్):

ప్రస్తుత కాలంలో ఆహార పదార్థాలు రసాయనాలతో నిండిపోవడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన రైతు సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ,హైదరాబాద్‌లో తను తాగిన పాలు కలుషితమై ఆసుపత్రి పాలైన విషయాన్ని తెలిపారు . భూమి మొత్తం కెమికల్స్ తో నిండిపోయిందని, రోగాలకు మనమే కారకులమని, వాటిని నివారించాల్సింది కూడా మనమేనని ఆయన పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు మొదట్లో కొంత నష్టపోయినా, ఆ తర్వాత ఖచ్చితంగా లాభాలు పొందుతారని, సేంద్రీయ ఉత్పత్తులకు ప్రస్తుతం మార్కెట్‌లో మంచి గిరాకీ ఉందని ఆయన రైతులకు సూచించారు.ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ. 2,400 కోట్లు కేటాయించిందని, యూరియా దిగుమతి కోసం ఏటా రూ. 1.20 లక్షల కోట్లు విదేశాలకు పంపడం బాధాకరమని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. రాబోయే రెండేళ్లలో తన పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో 25 వేల మంది రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించేలా చర్యలు తీసుకుంటానని, సేంద్రీయ పంటలకు మద్దతు ధర కల్పించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. 'మేక్ ఇన్ ఇండియా' స్ఫూర్తితో స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా దేశ సంపదను కాపాడుకోవాలని, తద్వారా రైతులు కోటీశ్వరులుగా మారే అవకాశం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.





# శాశ్వత భవనాల్లో రెవెన్యూ సేవలు

- అద్దె భవనాలకు గుడ్‌బై

హైదరాబాద్(ఏడీఎన్ఎన్):

రాష్ట్రంలో ప్రజలకు మరింత సౌకర్యవంతమైన, పారదర్శకమైన పరిపాలన అందించేందుకు ఆర్డీవో, తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ భవనాల నిర్మాణం చేపట్టనున్నట్లు రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సచివాలయంలో ఉన్నతాధికారులతో గురువారం నిర్వహించిన సమీక్షలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.మొదటి దశలో అద్దె భవనాల్లో, శిథిలావస్థలో కొనసాగుతున్న 125 తహసీల్దార్ కార్యాలయాలు, 11 ఆర్డీవో కార్యాలయాలకు ఆధునిక సౌకర్యాలతో కొత్త భవనాలు నిర్మించనున్నట్లు మంత్రి వెల్లడించారు. అవసరమైన స్థలాలను వెంటనే గుర్తించి నిర్మాణ పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని భవనాలు ఒకే నమూనాలో, ప్రజలకు అందుబాటులో ఉండేలా రూపకల్పన చేయనున్నట్లు తెలిపారు.గత ప్రభుత్వ హయాంలో ప్రణాళికాబద్ధత లేకుండా మండలాల పునర్విభజన జరగడంతో అనేక కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయని మంత్రి విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త మండలాలకు పోస్టులు మంజూరు చేసి పరిపాలనను బలోపేతం చేసిందన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు.ఇక స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ పరిధిలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 12 క్లస్టర్లుగా విభజించి సమీకృత భవనాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. గచ్చిబౌలి, మేడ్చల్, పటాన్‌చెరు, కోహెడ ప్రాంతాల్లో ఇప్పటికే పనులు ప్రారంభమైనట్లు వెల్లడించారు. జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు కూడా డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ అవసరాలకు అనుగుణంగా కొత్త భవనాలు నిర్మించనున్నట్లు మంత్రి తెలిపారు.





## కవిత పార్టీకి కొత్త చిక్కులు!

హైదరాబాద్(ఏడీఎన్ఎన్):


తెలంగాణ రాజకీయాల్లో టీఆర్ఎస్ పేరు కోసం కొత్త వివాదం తెరపైకి వచ్చింది. కల్వకుంట్ల కవిత ప్రకటించిన తెలంగాణ రక్షణ సేన పార్టీ పేరుపై పెద్ద ఎత్తున అభ్యంతరాలు వ్యక్తమవుతున్నట్లు సమాచారం. పార్టీ పేరుపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలంటూ పత్రికల్లో ఇచ్చిన ప్రకటనలకు దాదాపు 700 వరకు అభ్యంతరాలు అందినట్లు ప్రచారం జరుగుతోంది.అంతేకాకుండా, కవిత తన పార్టీ పేరును అధికారికంగా ప్రకటించడానికి ఒక రోజు ముందే మహారాష్ట్రలోని సోలాపూర్‌కు చెందిన దయానంద్ మహాదేవ్ మామ్‌డ్యాల్ "తెలంగాణ రాష్ట్ర సామాజిక సేన" పేరుతో పార్టీ నమోదు కోసం కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించినట్లు తెలుస్తోంది. ఈ రెండు పార్టీల సంక్షిప్త నామం టీఆర్ఎస్ కావడంతో ఈసీ వద్ద టైటిల్ వార్ ప్రారంభమైనట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.సొంత రాజకీయ వేదిక ఏర్పాటు చేసుకోవాలని చాలా కాలంగా ప్రయత్నిస్తున్న కవితకు పార్టీ పేరు విషయంలో వరుస అడ్డంకులు ఎదురవుతున్నాయి. గత నెలలో జరిగిన పార్టీ ఆవిర్భావ సభలో కవిత తన నోటితో "టీఆర్ఎస్" పేరును ప్రకటించగా, వేదికపై ఏర్పాటు చేసిన స్క్రీన్లలో మాత్రం "తెలంగాణ రాష్ట్ర సేన" అని ప్రదర్శించారు. ఆ తర్వాత కొద్ది రోజులకే పార్టీ పేరును *"తెలంగాణ రక్షణ సేన"*గా ప్రకటించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.ఇప్పుడు మరోసారి అభ్యంతరాలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో కవిత కొత్త పార్టీకి టీఆర్ఎస్ అనే సంక్షిప్త నామం కొనసాగుతుందా? లేక కొత్త పేరును ఎంపిక చేసుకోవాల్సి వస్తుందా? అనే ఉత్కంఠ నెలకొంది.

# డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపాలి

- అధికారులకు మంత్రి జూపల్లి దిశానిర్దేశం

హైదరాబాద్(ఏడీఎన్ఎన్):

డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణాపై నిర్దాక్షిణ్యంగా వ్యవహరించాలని, మాదకద్రవ్యాల ముఠాలు ఎంతటివారైనా చట్టం ముందు మోకరిల్లేలా పనిచేయాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులకు సూచించారు. బండ్లగూడ జాగీర్‌లోని ఎక్సైజ్ అకాడమీలో గురువారం నిర్వహించిన అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, ఎక్సైజ్ సబ్‌ఇన్‌స్పెక్టర్ల పాసింగ్‌అవుట్ పరేడ్‌లో పాల్గొన్న ఆయన, ఎక్సైజ్ శాఖ కేవలం ఆదాయ వనరు మాత్రమే కాదని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే కీలక శాఖ అని పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న 117 మంది అధికారులకు ప్రజాసేవ, కర్తవ్యనిష్ఠ, నిజాయితీని సేవా జీవితానికి మార్గదర్శక సూత్రాలుగా మలచుకోవాలని సూచించారు.ప్రస్తుతం గంజాయి, సింథటిక్ డ్రగ్స్, నార్కోటిక్ నెట్‌వర్క్‌లు సమాజానికి పెద్ద సవాల్‌గా మారాయని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ అనేవి కేవలం చట్ట ఉల్లంఘన మాత్రమే కాకుండా యువత భవిష్యత్తును నాశనం చేసే సామాజిక విపత్తని పేర్కొన్నారు. అధికారులు స్వాధీనం చేసుకునే ప్రతి డ్రగ్స్ ప్యాకెట్ వెనుక ఒక యువకుడి భవిష్యత్తు ఉంటుందని, కేసులు నమోదు చేయడమే కాకుండా సమాజాన్ని రక్షించే బాధ్యత కూడా తమపై ఉందన్నారు.సాంకేతికతను నేరగాళ్లు వినియోగిస్తున్న నేపథ్యంలో అధికారులు కూడా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని జూపల్లి సూచించారు. డ్రోన్ సర్వైలెన్స్, డేటా అనలిటిక్స్, కృత్రిమ మేధస్సు (ఏఐ), జీపీఎస్ ట్రాకింగ్, సోషల్ మీడియా ఇంటెలిజెన్స్ వంటి ఆధునిక పద్ధతుల ద్వారా డ్రగ్స్ నెట్‌వర్క్‌లను ఛేదించాలని సూచించారు. తెలంగాణలో అంతర్జాతీయ స్థాయి నిఘా వ్యవస్థలను మరింత విస్తృతంగా అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.గంజాయి, మద్యం అక్రమ రవాణా ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, రాష్ట్రంలోకి మాదకద్రవ్యాలు ప్రవేశించకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. క్రమశిక్షణ, నిజాయితీ, పారదర్శకతే అధికారుల అసలు గుర్తింపు అని పేర్కొన్న మంత్రి, నిజామాబాద్‌లో గంజాయి అక్రమ రవాణాను అడ్డుకునే క్రమంలో ప్రాణత్యాగం చేసిన కానిస్టేబుల్ సౌమ్య ధైర్యసాహసాలను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.



## మంజీరా పైప్‌లైన్ లీకేజీతో మంచినీటి కష్టాలు

హైదరాబాద్(ఏడీఎన్ఎన్):

హైదరాబాద్ నగరవాసులకు జలమండలి అధికారులు ముఖ్య గమనిక జారీ చేశారు. మంజీరా ఫేజ్ 2 ప్రధాన పైప్‌లైన్‌కు సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారం వద్ద భారీ లీకేజీ ఏర్పడటంతో, నగరంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. పైప్‌లైన్ మరమ్మతు పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ లీకేజీ కారణంగా ఆర్.సి.పురం, లింగంపల్లి, చందానగర్, మియాపూర్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ కాలనీ, ఎర్రగడ్డ, అమీర్‌పేట్ సహా పలు ప్రాంతాల్లో నీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.ఈ సమస్యను అధిగమించేందుకు జలమండలి ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. నీటి సరఫరా నిలిచిపోయిన ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలని హెచ్ఎమ్‌డబ్ల్యూఎస్ఎస్‌బీ ఎండీ అశోక్ రెడ్డి ఆదేశించారు. మరమ్మతులు పూర్తయ్యే వరకు ప్రజలు సహకరించాలని, అత్యవసరమైతే ట్యాంకర్ల కోసం సంబంధిత అధికారులను సంప్రదించాలని కోరారు. తాగునీటి సరఫరాను వీలైనంత త్వరగా పునరుద్ధరించేందుకు సిబ్బంది నిరంతరం శ్రమిస్తున్నారని అధికారులు పేర్కొన్నారు





## కరీంనగర్ లో కొత్త కలెక్టరేట్

కరీంనగర్(ఏడీఎన్ఎన్):

కరీంనగర్ జిల్లా ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న నూతన కలెక్టరేట్ భవనం ఈ నెలాఖరులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం కానుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాతో కలిసి నూతన కలెక్టరేట్ భవనాన్ని గురువారం పరిశీలించిన ఆయన, ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని వెల్లడించారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా శాతవాహన విశ్వవిద్యాలయంలో చేపట్టిన అభివృద్ధి పనులు, మున్సిపల్ శాఖకు సంబంధించిన పలు ప్రాజెక్టులను కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు.గతంలో ప్రారంభమైన కలెక్టరేట్ నిర్మాణ పనులు వివిధ కారణాలతో నిలిచిపోయాయని, జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. ఆధునిక సౌకర్యాలు, సాంకేతిక వసతులు, ప్రజలకు అనుకూలమైన సేవా వ్యవస్థతో ఈ కలెక్టరేట్‌ను సిద్ధం చేశామని తెలిపారు. ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించడంతో పాటు జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారని చెప్పారు.కలెక్టరేట్ ప్రారంభం తర్వాత పలు ప్రభుత్వ కార్యాలయాలను ఒకే ప్రాంగణంలోకి తీసుకువచ్చి ప్రజలకు మరింత సులభంగా సేవలు అందించేలా చర్యలు చేపడతామని మంత్రి వెల్లడించారు. సుడా ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రాంగణంలో విస్తృతంగా గ్రీనరీ, ల్యాండ్‌స్కేపింగ్ అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. పర్యావరణహిత వాతావరణం, విశాలమైన కార్యాలయాలు, ప్రజలకు అందుబాటులో ఉండే సేవలతో ఈ కలెక్టరేట్ రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన ప్రభుత్వ కార్యాలయ సముదాయంగా నిలుస్తుందని అన్నారు.జిల్లాను పరిశ్రమలు, పర్యాటకం, విద్య, వైద్య రంగాల్లో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. శాతవాహన విశ్వవిద్యాలయంలో లా, ఫార్మసీ కళాశాలల ఏర్పాటు ద్వారా ఉన్నత విద్యా అవకాశాలు విస్తరించాయని, ఆరోగ్య రంగంలో కరీంనగర్‌ను హెల్త్ హబ్‌గా తీర్చిదిద్దే చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. మానేరు రివర్‌ఫ్రంట్ రెండో దశ పనులు వేగవంతం చేస్తున్నామని, నూతన కలెక్టరేట్ ప్రాంగణంలోని హెలిప్యాడ్‌ను కూడా త్వరలో వినియోగంలోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు.

## కేంద్ర ప్రభుత్వ నిధులతోనే పాలన

మహబూబ్‌నగర్(ఏడీఎన్ఎన్):



మహబూబ్‌నగర్‌లో బీజేపీ ఎంపీ డీకే అరుణ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పనులను గాలికొదిలేసి, చేతగానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికి కేంద్రంపై నిందలు వేయడం ఎంతవరకు సమంజసమని ఆమె ప్రశ్నించారు. గ్రామ పంచాయతీ భవనాలు, సీసీ రోడ్లు, అంగన్వాడీ కేంద్రాలు మరియు గర్భిణీలు, బాలింతలకు పౌష్టిక ఆహారం వంటి కనీస సౌకర్యాలన్నీ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్నవేనని, గత రెండున్నర ఏళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కటంటే ఒక్క పెండింగ్ పనిని కూడా పూర్తి చేయలేదని ఆమె మండిపడ్డారు.గతంలో కేసీఆర్ సెంటిమెంట్ మాటలతో ప్రజలను మోసం చేయగా, ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారడీ మాటలతో అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చారని డీకే అరుణ విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించిన ఆమె, రెండు తులాల బంగారం మరియు మహిళలకు నెలకు రూ. 2 వేల పెన్షన్ ఏమైందని సూటిగా ప్రశ్నించారు. కేవలం కొడంగల్ నియోజకవర్గానికే పరిమితం కాకుండా, రాష్ట్రమంతా అభివృద్ధి చేయాలని, అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలకు మాత్రమే కాకుండా అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ఆమె డిమాండ్ చేశారు.ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేసిన అప్పుల చిట్టాను ప్రజల ముందు ఉంచాలని ఎంపీ డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని, అందుకే ప్రజలు మూడవసారి బీజేపీకి అధికారాన్ని కట్టబెట్టారని ఆమె స్పష్టం చేశారు. అభివృద్ధి విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని, ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ఆమె సూచించారు.

## పాఠశాలలపై సర్కార్ స్పెషల్ ఫోకస్

హైదరాబాద్(ఏడీఎన్ఎన్):

తెలంగాణలో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును గణనీయంగా పెంచాలని, బడికి రాని పిల్లలను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో, విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫారాల పంపిణీని సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు.అభ్యాస ఫలితాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థుల్లో ప్రాథమిక అక్షరాస్యత ,సంఖ్యాజ్ఞానాన్ని బలోపేతం చేయాలని డైరెక్టర్ సూచించారు. ప్రీప్రైమరీ విద్యకు ప్రాధాన్యతనిస్తూ, మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అకాడమిక్ ప్యానెల్ తనిఖీలను క్రమం తప్పకుండా నిర్వహించాలని, పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా నియామకాలు ,సర్దుబాటు ప్రక్రియను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల సాయంతో విద్యార్థుల నమోదు కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని, 2026-27 విద్యా సంవత్సరాన్ని 'అభ్యాస ఫలితాల మెరుగుదల సంవత్సరంగా' మార్చేందుకు అందరూ సమష్టిగా పనిచేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు.కాగా, గతంలో తీసుకున్న నిర్ణయం మేరకు తెలంగాణలో పాఠశాలలు జూన్ 12న కాకుండా, జూన్ 15వ తేదీన పునఃప్రారంభం కానున్నాయని పాఠశాల విద్యాశాఖ ఇదివరకే స్పష్టం చేసింది. ఈ ఆలస్యానికి సర్దుబాటుగా, జూలై 11వ తేదీని (రెండవ శనివారం) పని దినంగా ప్రభుత్వం ప్రకటించింది.

## రాశి ఫలాలు

**12-06-2026 శుక్రవారం**

**మేషం:**
వృత్తి, వ్యాపారాల్లో అంచనాలకు మించి రాబడి ఉంటుంది. ఆదాయంలో పెరుగుదల ఉంటుంది. బంధువుల నుంచి శుభ వార్తలు వింటారు. ఉద్యోగ, పెళ్లి ప్రయత్నాలు సానుకూలపడతాయి. వృథా ఖర్చులు బాగా తగ్గించుకోవడం మంచిది. మిత్రుల సహాయ సహకారాలతో ముఖ్యమైన వ్యవహారాలు పూర్తవుతాయి.

**వృషభం:**
వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగిపోతాయి. ఉద్యోగాల్లో సహోద్యోగుల నుంచి కొద్దిగా ఇబ్బందులుంటాయి. వ్యాపారాల్లో పోటీదార్ల మీద తప్పకుండా పైచేయి సాధిస్తారు. ఆరోగ్యం మీద బాగా శ్రద్ధ పెట్టాలి. ముఖ్యమైన వ్యక్తులతో పరిచయాలు పెరుగుతాయి. మాటకు విలువ ఉంటుంది.

**మిథునం:**
వృత్తి, ఉద్యోగాల్లోనే కాక, సామాజికంగా కూడా ఆదరణ, అభిమానాలు పెరుగుతాయి. వ్యాపారాలు బాగా కలిసి వస్తాయి. కుటుంబంలో శుభ కార్యాలకు ప్లాన్ చేస్తారు. ఆధ్యాత్మిక చింతన పెరిగి దైవ కార్యాల్లో పాల్గొంటారు. ఆర్థిక ప్రయత్నాలు ఆశించిన దాని కంటే ఎక్కువగా సఫలం అవుతాయి. షేర్లు, స్పెక్యులేషన్లు బాగా లాభిస్తాయి.

**కర్కాటకం:**
ఉద్యోగంలో అధికార యోగానికి అవకాశం ఉంది. ఏ ప్రయత్నం తలపెట్టినా విజయవంతం అవు తుంది. వృత్తి, వ్యాపారాల్లో కీలకమైన నిర్ణయాలు, ఆలోచనలు అమలు చేసి లబ్ధి పొందుతారు. కొత్త ఉద్యోగ ప్రయత్నాలు తప్పకుండా ఫలిస్తాయి. వ్యక్తిగత సమస్యలు తగ్గుముఖం పడతాయి.

**సింహం:**
వృత్తి, ఉద్యోగాల్లో పని భారం, పని ఒత్తిడి బాగా పెరుగుతాయి. అధికారులు ఎక్కువగా ఆధారపడే అవకాశం ఉంది. వ్యాపారాల్లో అనుకోకుండా లాభాలు వృద్ధి చెందుతాయి. ఉద్యోగ ప్రయత్నాలు సఫలమవుతాయి. కుటుంబానికి సంబంధించి ఒక శుభ పరిణామం చోటు చేసుకుంటుంది. ఆధ్యాత్మిక చింతన పెరిగి దైవ కార్యాల్లో పాల్గొంటారు.

**కన్య:**
ఉద్యోగ జీవితం అనుకూలంగా సాగిపోతుంది. వృత్తి జీవితంలో డిమాండ్ బాగా పెరుగుతుంది. వ్యాపారాల్లో లాభాలు ఆర్జిస్తారు. షేర్లు, ఆర్థిక లావాదేవీలు బాగా లాభిస్తాయి. ముఖ్యమైన పనుల్ని పట్టుదలగా పూర్తి చేస్తారు. సహాయం పొందినవారు ముఖం చాటేస్తారు. ఆరోగ్యం బాగా అనుకూ లంగా ఉంటుంది. ఆర్థిక పరిస్థితి చక్కబడుతుంది.

**తుల:**
వృత్తి, ఉద్యోగాల్లో హోదా, బాధ్యతలు పెరుగుతాయి. వ్యాపారాల్లో లాభాలు బాగా పెరిగే అవకాశం ఉంది. ఆశించిన స్థాయిలో ఆదాయం వృద్ధి చెందుతుంది. వాగ్దానాలు చేయడం, హామీలు ఉండడం మంచిది కాదు. ఇతర విషయాల్లో తలదూర్చవద్దు. ఆరోగ్యానికి లోటుండదు. ప్రయాణాలు లాభిస్తాయి. ఆర్థిక విషయాలకు సమయం బాగానే ఉంది.

**వృశ్చికం:**
వృత్తి, ఉద్యోగాల్లో బాధ్యతలు మారుతాయి. వ్యాపారాలు లాభదాయకంగా సాగుతాయి. గ్రహ బలం బాగా అనుకూలంగా ఉన్నందువల్ల ముఖ్యమైన వ్యవహారాలు, పనుల్ని చక్కబెట్టుకోవడం చాలా మంచిది. గతంలో మీ నుంచి సహాయం పొందిన కొందరు మిత్రులు ఇప్పుడు మొహం చాటేస్తారు. ఏ విషయంలోనూ ఎవరి మీదా ఆధారపడకపోవడం మంచిది.

**ధనస్సు:**
వృత్తి, ఉద్యోగాల్లో అంచనాలకు మించి పురోగతి సాధిస్తారు. ఉద్యోగంలో అధికార యోగానికి అవ కాశం ఉంది. ప్రాభవం పెరగడంతో పాటు గౌరవ మర్యాదలు కూడా పెరుగుతాయి. కొత్తగా ఎటు వంటి ప్రయత్నం తలపెట్టినా తప్పకుండా సఫలమవుతుంది. ఆర్థిక పరిస్థితి చాలావరకు మెరుగు పడుతుంది. ఆరోగ్యం చాలావరకు అనుకూలంగా ఉంటుంది.

**మకరం:**
వృత్తి, ఉద్యోగాల్లో అధికారులతో సమానంగా అధికారాలను అనుభవిస్తారు. ఆశించిన స్థాయిలో జీతభత్యాలు పెరుగుతాయి. శుభ పరిణామాలు చోటు చేసుకుంటాయి. కుటుంబంతో కలిసి దైవ కార్యాల్లో పాల్గొంటారు. ఇంటా బయటా గౌరవమర్యాదలు పెరుగుతాయి. ఆస్తి వివాదం పరిష్కారమవుతుంది. ఆహార, విహా రాల్లో జాగ్రత్తగా ఉండడం మంచిది.

**కుంభం:**
వృత్తి, ఉద్యోగాల్లో అధికారుల నమ్మకాన్ని చూరగొంటారు. అధికారులు ఎక్కువగా ఆధారపడే అవ కాశం ఉంది. ఆస్తి, ఆర్థిక వ్యవహారాల్లో వీలైనంత జాగ్రత్తగా వ్యవహరించడం మంచిది. వృత్తి జీవి తంలో తీరిక లేని పరిస్థితి ఏర్పడుతుంది. వ్యాపారాలు లాభసాటిగా సాగిపోతాయి. ఉద్యోగ ప్రయ త్నాలు బాగా సానుకూలంగా సాగిపోతాయి.

**మీనం:**
అదనపు ఆదాయ వృద్ధి ప్రయత్నాలు చాలావరకు విజయవంతం అవుతాయి. ముఖ్యమైన ఆర్థిక, వ్యక్తిగత సమస్యలు పరిష్కారమవుతాయి. కొత్త ఉద్యోగ, పెళ్లి ప్రయత్నాలకు సానుకూల స్పందన లభిస్తుంది. ఉద్యో గంలో అధికారం చేపడతారు. వృత్తి జీవితంలో ప్రాభవం పెరుగుతుంది.

## ప్రభుత్వ పాఠశాలలకు పెరుగుతున్న ఆదరణ

**కట్టంగూర్(ఏడీఎన్ఎన్):**



ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాలు అందుతుండటంతో తల్లిదండ్రులు ప్రభుత్వ విద్యా సంస్థల వైపు మొగ్గు చూపుతున్నారని కట్టంగూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం కొంక ఆంటోని తెలిపారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా పలు గ్రామాల్లో పర్యటించిన ఆయన, ప్రభుత్వ పాఠశాలల ప్రత్యేకతలను తల్లిదండ్రులకు వివరించారు. గత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించడం పాఠశాలపై విశ్వాసాన్ని పెంచిందన్నారు. ఈ ఏడాది 100 కొత్త అడ్మిషన్ల లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు.జూన్ 15 నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులను తొలి రోజు నుంచే బడికి పంపాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఖమ్మం ఘటనపై ప్రభుత్వం స్పందించాలి

**హైదరాబాద్(ఏడీఎన్ఎన్):**



ఖమ్మం జిల్లాలో 12 ఏళ్ల బాలికపై జరిగిన లైంగిక దాడి ఘటన అత్యంత దారుణమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ప్రభుత్వం, ముఖ్యంగా మహిళా మంత్రులు స్పందించకపోవడం విచారకరమని విమర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన సునీతా లక్ష్మారెడ్డి, బాధిత బాలిక తీవ్ర మానసిక వేదనకు గురైందని అన్నారు. వైద్యుల సమాచారం ప్రకారం పురుష వైద్యులు లేదా సిబ్బంది దగ్గరకు వచ్చినా బాలిక భయాందోళనలకు గురవుతోందని పేర్కొన్నారు. దీనిని బట్టి ఆమె ఎంతటి మానసిక, శారీరక హింసను ఎదుర్కొందో అర్థమవుతోందన్నారు.రాష్ట్రంలో మహిళలు, బాలికల భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఆమె సూచించారు. ఖమ్మం జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రులు ఉన్నప్పటికీ ఈ ఘటనపై ఎవరూ స్పందించకపోవడం బాధాకరమని వ్యాఖ్యానించారు. అలాగే సమీప జిల్లాలకు చెందిన మహిళా మంత్రులు కూడా స్పందించకపోవడాన్ని ఆమె ప్రశ్నించారు. బాధిత బాలికకు న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని, కేసు విచారణను వేగవంతం చేసేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నిందితులకు కఠిన శిక్షలు విధించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ఎస్‌బీఐ ఫీల్డ్ అసిస్టెంట్ తొలగించాలని డిమాండ్

**జైనూర్(ఏడీఎన్ఎన్):**



కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండల కేంద్రంలోని ఎస్‌బీఐ శాఖలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌ను వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసి సంఘాల నాయకులు, రైతులు గురువారం బ్యాంకు ఎదుట ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా మార్లవాయి సార్‌మేడి గేడమ్ గణపత్ మాట్లాడుతూ, గత ఆరు నెలలుగా గిరిజన రైతులు క్రాప్ లోన్లు పొందడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. స్థానిక బ్యాంకు ఫీల్డ్ అసిస్టెంట్ వివిధ కారణాలు చూపుతూ రుణాల మంజూరును అడ్డుకుంటున్నారని, దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు.గిరిజన రైతుల పట్ల వివక్ష చూపకుండా అర్హులైన వారికి వెంటనే పంట రుణాలు మంజూరు చేయాలని, రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌పై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ ధర్నాలో సార్‌మేడిలు ఆత్రం అనంతరావు, ఆదివాసి సంఘాల నాయకులు మేశ్రం సేకు, కొడప ఆనందరావు, మడవి నాగరావు, మహిళా రైతులు, గిరిజనులు తదితరులు పాల్గొన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## రూ.1.70 లక్షలకు నవజాత శిశువు విక్రయం

**జియాగూడ/నందిగామ(ఏడీఎన్ఎన్):**




తుక్కుగూడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో జన్మించిన 12 రోజుల మగ శిశువును రూ.1.70 లక్షలకు అక్రమంగా విక్రయించిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారంపై కుల్సుంపురా పోలీస్ స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, కేసును నందిగామ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంతానం లేక 18 ఏళ్లుగా ఎదురుచూస్తున్న మధుసూదన్, మీనా దంపతులు మగబిడ్డ కోసం ప్రయత్నిస్తుండగా, జియాగూడకు చెందిన పోతరాజు సురేష్‌ను సంప్రదించారు. అనంతరం మధ్యవర్తులుగా వ్యవహరించిన పద్మ పాల్దియా, గోపి పాల్దియాల ద్వారా తుక్కుగూడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మోహన్, సంధ్య దంపతులకు జన్మించిన మగ శిశువును విక్రయించేందుకు ఒప్పందం కుదిరినట్లు విచారణలో వెల్లడైంది.మధ్యవర్తి సురేష్ సమక్షంలో కొత్తూర్ మండలం జేపీ దర్గా సమీపంలో మోహన్, సంధ్య దంపతులు శిశువును మధుసూదన్, మీనా దంపతులకు రూ.1.70 లక్షలకు అప్పగించినట్లు పోలీసులు గుర్తించారు. దత్తత ప్రక్రియకు సంబంధించిన చట్టపరమైన నిబంధనలు పాటించకుండా ఈ లావాదేవీ జరిగినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఘటన నందిగామ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకోవడంతో కేసును అక్కడికి బదిలీ చేసినట్లు కుల్సుంపురా పోలీసులు తెలిపారు. శిశువును నగరంలోని శిశు విహార్‌కు తరలించినట్లు పేర్కొన్న పోలీసులు, ఈ వ్యవహారంలో పాల్గొన్న వారందరి పాత్రపై దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.

## టెక్కలిలో వివాహిత హత్య కలకలం

**శ్రీకాకుళం(ఏడీఎన్ఎన్):**



గ్రూప్స్ కోచింగ్ కోసం హైదరాబాద్‌కు వెళ్లిన ఓ వివాహిత యువతి హత్య కేసును పోలీసులు ఛేదించారు. గుండెపోటుతో మృతి చెందినట్లు ప్రచారం చేసిన ఘటన వెనుక కుటుంబ సభ్యులే ఉన్నట్లు దర్యాప్తులో తేలడంతో తల్లి, భర్త, తాతను పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన శ్రీకాకుళం జిల్లా టెక్కలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుంపల హరిణి (24)కి 2020లో ఆమె మేనమామతో వివాహం జరిగింది. వారికి నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు. కొంతకాలం క్రితం హరిణి గ్రూప్స్ కోచింగ్ కోసం కుమారుడితో కలిసి హైదరాబాద్‌కు వెళ్లింది. అక్కడ కోచింగ్ సెంటర్‌లో పరిచయమైన ఓ యువకుడితో ఆమెకు సన్నిహిత సంబంధం ఏర్పడినట్లు తెలిసింది.ఈ విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో హరిణిని పలుమార్లు హెచ్చరించినట్లు సమాచారం. అనంతరం భర్త నుంచి విడాకులు కావాలని హరిణి కోరుతూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. తాను మరో వ్యక్తిని వివాహం చేసుకోవాలనే నిర్ణయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో విభేదాలు మరింత తీవ్రరూపం దాల్చాయి.ఈ నేపథ్యంలో పెద్దల సమక్షంలో సమస్యను పరిష్కరిస్తామని చెప్పి హరిణిని టెక్కలికి పిలిపించిన కుటుంబ సభ్యులు హత్యకు పథకం రచించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. జూన్ 1న హరిణి తల్లి, భర్త, తాత కలిసి ఇనుప రాడ్డుతో దాడి చేసి ఆమెను హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు.అనంతరం ఘటనను సహజ మరణంగా చిత్రీకరించేందుకు ప్రయత్నించిన నిందితులు, గుండె పోటుతో మృతి చెందినట్లు బంధువులకు సమాచారం ఇచ్చి మరుసటి రోజే అంత్యక్రియలు నిర్వహించినట్లు వెల్లడైంది.అయితే తన ప్రాణాలకు ముప్పు ఉందని హరిణి ముందుగానే ఓ సెల్ఫీ వీడియోలో పేర్కొనడం, అలాగే హైదరాబాద్‌కు చెందిన యువకుడిపై అనుమానాలు వ్యక్తం చేయడంతో కేసులో కీలక ఆధారాలు లభించాయి. హరిణి మరణంపై అనుమానం వ్యక్తం చేస్తూ యువకుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ ప్రారంభించారు.దర్యాప్తులో హత్య జరిగినట్లు నిర్ధారణ కావడంతో హరిణి తల్లి, భర్త దంతేశ్వరరావు, తాతను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసుకు సంబంధించిన మరిన్ని వివరాలపై విచారణ కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## జంట హత్యల కేసులో నిందితురాలు మృతి

**తాండూరు(ఏడీఎన్ఎన్):**




మొయినాబాద్ ఫాంహౌస్ జంట హత్యల కేసులో ప్రధాన నిందితురాలిగా ఉన్న కరీమా బేగం చికిత్స పొందుతూ మృతి చెందింది. ఇటీవల పోలీసు కస్టడీలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఆమె గత 24 రోజులుగా హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి కన్నుమూసినట్లు సమాచారం. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలో సంచలనం సృష్టించిన జంట మహిళల హత్య కేసులో కరీమా బేగం ప్రధాన నిందితురాలిగా పోలీసులు గుర్తించారు. కేసు దర్యాప్తులో భాగంగా ఆమెను విచారణ కోసం కరణ్‌కోట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బాత్‌రూంకు వెళ్లిన కరీమా బేగం యాసిడ్ సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం ఆమెను వెంటనే హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే ఆరోగ్య పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వెల్లడైంది.మొయినాబాద్ జంట హత్యల కేసులో కరీమా బేగంతో పాటు ఆమె భర్త రెహమాన్, నయూం అనే వ్యక్తులు కూడా నిందితులుగా ఉన్నారు. వీరి కుట్రలో భాగంగా మహబూబీ బేగం, అబేదా బేగం అనే ఇద్దరు మహిళలు హత్యకు గురైనట్లు పోలీసులు దర్యాప్తులో నిర్ధారించారు. ఇదిలా ఉండగా, పోలీస్ స్టేషన్‌లో కరీమా బేగం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనను తీవ్రంగా పరిగణించిన వికారాబాద్ జిల్లా ఎస్పీ శాఖాపరమైన చర్యలు చేపట్టారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినట్లు గుర్తించి మహిళా కానిస్టేబుల్ సునీత, యాలాల పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ బసవరాజులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ కొనసాగుతోందని పోలీసు అధికారులు తెలిపారు.

## తెలంగాణ అంశంపై మాధవీలత వ్యాఖ్యలు

**హైదరాబాద్(ఏడీఎన్ఎన్):**

తెలంగాణపై బీజేపీ నాయకురాలు, నటి మాధవీలత చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. సోషల్ మీడియా వేదికగా చేసిన ఆమె పోస్టులు వివాదానికి దారితీశాయి. ఫేస్‌బుక్‌లో వరుస పోస్టులు పెట్టిన మాధవీలత, తెలంగాణలో కొందరు వ్యక్తం చేస్తున్న అభిప్రాయాలను ప్రస్తావిస్తూ విమర్శలు గుప్పించారు. 'అజాదీ కశ్మీర్' భావజాలంతో పోల్చుతూ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తెలంగాణ తెలంగాణ భారతదేశంలో అంతర్భాగమనే విషయాన్ని మరవొద్దని ఆమె పేర్కొన్నారు.మరో పోస్టులో తనను కొందరు 'ఆంధ్రకు వెళ్లిపోవాలి' అని వ్యాఖ్యానిస్తున్నారని, అయితే ఎందుకు వెళ్లాలనే విషయాన్ని ఎవరూ చెప్పడం లేదని మాధవీలత పేర్కొన్నారు. తాను 2005 నుంచి హైదరాబాద్‌లోనే నివసిస్తున్నానని, తనకు ఈ నగరంతో ప్రత్యేక అనుబంధం ఉందని తెలిపారు. తన ఇంటి యజమాని కూడా తెలంగాణకు చెందిన వారేనని, వారితో ఎలాంటి సమస్యలు లేవని చెప్పారు. అలాగే తన వద్ద ఉన్న పాస్‌పోర్ట్, ఆధార్ వంటి గుర్తింపు పత్రాలు భారతదేశానివేనని పేర్కొంటూ, తెలంగాణ భారతదేశంలో భాగమే కదా అని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలను వ్యంగ్యంగా ప్రస్తావిస్తూ పలు పోస్టులు చేశారు. ఇదిలా ఉండగా, మాధవీలత వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఆమె అభిప్రాయాలను సమర్థిస్తుండగా, మరికొందరు ఈ వ్యాఖ్యలు అనవసర వివాదానికి దారితీసేలా ఉన్నాయని విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో



ఆమె పోస్టులు రాజకీయ, సామాజిక వర్గాల్లో చర్చకు కారణమయ్యాయి.



## 2027 పుష్కరాలపై ప్రత్యేక దృష్టి

**సిద్దిపేట(ఏడీఎన్ఎన్):**

రాబోయే 2027 గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హుస్నాబాద్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు.గురువారం హుస్నాబాద్ బస్టాండ్‌ను ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డితో కలిసి పరిశీలించిన మంత్రి, అక్కడి మౌలిక సదుపాయాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రయాణికులతో మాట్లాడి బస్సుల రాకపోకలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు.అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి పొన్నం ప్రభాకర్, నాలుగు జిల్లా కేంద్రాలకు అనుసంధానంగా ఉన్న హుస్నాబాద్‌ను మరింత అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థను ఆధునికీకరించడంతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. పెరుగుతున్న పట్టణ అవసరాలకు అనుగుణంగా ఇంజినీరింగ్ కళాశాల, మెడికల్ కళాశాల, పర్యాటక రంగం అభివృద్ధి, ఇండస్ట్రియల్ కారిడార్ వంటి ప్రాజెక్టుల ద్వారా హుస్నాబాద్‌కు మరింత ప్రాధాన్యం కల్పిస్తామని వెల్లడించారు.హుస్నాబాద్ బస్టాండ్ ప్రయాణికుల సంఖ్య, ఆదాయం పరంగా రాష్ట్రంలోనే ప్రముఖ కేంద్రంగా నిలుస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రతిరోజూ సుమారు 35 వేల మంది ప్రయాణికులు ఈ బస్టాండ్‌ను వినియోగిస్తున్నారని తెలిపారు. బస్టాండ్‌ను ఆధునిక సౌకర్యాలతో కూడిన పెద్ద షాపింగ్ మాల్ తరహాలో అభివృద్ధి చేసి ప్రయాణికులకు మెరుగైన సేవలు అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రి వెల్లడించారు.



## క్షణికావేశం.. తండ్రి ప్రాణం తీసిన కొడుకు

**జనగామ(ఏడీఎన్ఎన్):**

క్షణికావేశంలో జరిగిన ఘర్షణ ఓ కుటుంబంలో విషాదాన్ని నింపింది. నాటు కోడి కూర వండాలన్న విషయమై ప్రారంభమైన కుటుంబ కలహం చివరకు తండ్రి మృతికి దారితీసిన ఘటన జనగామ జిల్లా తరిగొప్పుల మండలంలో చోటుచేసుకుంది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. మండలానికి చెందిన జంగిలి రమేష్ (42), అనూష దంపతులు. మంగళవారం రాత్రి రమేష్ నాటు కోడిని తీసుకువచ్చి కూర వండాలని భార్యను కోరాడు. అయితే అదే రోజు చేపల కూర వండినట్లు తెలిపిన అనూష, కోడిని మరుసటి రోజు ఉదయం కోసుకుని వండుకుందామని భర్తకు సూచించింది. అయితే ఈ విషయమై రమేష్ ఆగ్రహానికి గురై భార్యతో వాగ్వాదానికి దిగాడు. ఆమెను దుర్భాషలాడుతుండగా, ఇంట్లో ఉన్న కుమారుడు గణేష్ తల్లి తరఫున తండ్రిని నిలదీశాడు. ఈ క్రమంలో తండ్రి, కుమారుడి మధ్య కూడా తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది.ఆగ్రహావేశానికి లోనైన గణేష్ ఇంట్లో ఉన్న రోకలి బండతో తండ్రి తలపై బలంగా దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రమేష్‌ను కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే జనగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ రమేష్ బుధవారం మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కుటుంబ కలహాలు, క్షణికావేశం కారణంగా జరిగిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. పోలీసులు నిందితుడు గణేష్‌ను అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నట్లు సమాచారం.



## రెండు లారీలు ఢీకొని ఒకరు మృతి

హనుమకొండ జిల్లా దామెర మండలంలోని పసరగొండ క్రాస్ సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ లారీ డ్రైవర్ మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన గురువారం చోటుచేసుకోగా స్థానికంగా విషాదాన్ని నింపింది.

**గుంటూరు జిల్లా ప్రజలందరికీ ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ తరఫున తెలిజేయునది ఏమనగా...**

మేము గత ఏడు సంవత్సరాల నుంచి గుంటూరులోని కొత్తపేట ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ నందు ప్రజలకు సేవలు అందించడం జరుగుతుంది. అలాగే గత నాలుగు నెలల క్రిందట మేము హైదరాబాదుకు సంబంధించిన మెడికవర్ హాస్పిటల్స్ వారితో కలిసి ఆదిత్య మెడికవర్ హాస్పిటల్స్ గా రూపాంతరం చేయడం జరిగింది. కానీ కొన్ని అనివార్య కారణాలవల్ల మేము మరియు మెడికవర్ హాస్పిటల్స్ వారి మధ్య ఉన్న ఒప్పందము రద్దు అయినది. గుంటూరులోని నేషనల్ హైవే పక్కన బుడంపాడు రోడ్డు వద్ద ఉన్న హాస్పిటల్ ను ఆదిత్య మెడికవర్ హాస్పిటల్స్ గా ఇప్పుడు సేవలందించటం జరుగుతున్నది. ఈ రోజు పత్రికా మీడియా సమావేశంలో ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ యాజమాన్యం ప్రకటన విడుదల చేయడమైనది కావున ప్రజలందరూ ఈ విషయాన్నిగ్రహించవలసిందిగా కోరుచున్నాము.

**ఆదిత్య హాస్పిటల్స్**
నేషనల్ హైవే పక్కన, బుడంపాడు రోడ్డు, కొత్తపేట,
గుంటూరు జిల్లా - 522001 ఆంధ్రప్రదేశ్



# అండర్-19లో ద్రవిడ్ కుమారుడు

## శ్రీలంకతో సిరీస్, వన్డే మ్యాచ్‌లకు కొత్త జట్టు ప్రకటన

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

శ్రీలంక పర్యటనకు సంబంధించి భారత జూనియర్ క్రికెట్ ఎంపిక కమిటీ పురుషుల అండర్19 జట్లను అధికారికంగా ప్రకటించింది. ఈ పర్యటనలో భాగంగా భారత అండర్19 జట్టు ఆతిథ్య శ్రీలంకతో వన్డే సిరీస్‌తో పాటు ఫోర్‌డే మ్యాచ్‌లు ఆడనుంది. ఈ మెగా పర్యటనకు యువరాజ్ సింగ్ చౌహాన్ జట్టును ముందుండి నడిపించనున్నాడు. అయితే, ఈ జట్టు ఎంపికలో అందరి దృష్టిని ఆకర్షించిన అంశం.. భారత క్రికెట్ దిగ్గజం రాహుల్ ద్రావిడ్ చిన్న కుమారుడు అన్వయ్ ద్రావిడ్ మరోసారి భారత జట్టులో చోటు దక్కించుకోవడం! గత ఏడాది నవంబర్‌లో జరిగిన అండర్19 సిరీస్‌లో భారత్'బి' జట్టు తరపున అన్వయ్ ద్రావిడ్ ప్రాతినిధ్యం వహించాడు. దేశీయంగా అండర్19 ఆఫ్రోఆసియా కప్ టోర్నమెంట్‌లో అఫ్ఘానిస్తాన్ అండర్19 జట్టుతో జరిగిన మ్యాచ్‌లోనూ ఆడాడు. బెంగళూరు వేదికగా జరిగిన ఆ సిరీస్‌లో ఒక మ్యాచ్‌లో అన్వయ్.. హాఫ్ సెంచరీతో అదరగొట్టి జట్టును ఆదుకున్నాడు. దేశీయ క్రికెట్‌లో స్థిరమైన ప్రదర్శనతో దూసుకుపోతున్న ఈ యంగ్ వికెట్ కీపర్ బ్యాటర్‌కు సెలెక్టర్లు మరోసారి మొగ్గు చూపారు. ఈ టూర్‌లో అన్వయ్ ద్రావిడ్ తన వికెట్ కీపింగ్, బ్యాటింగ్ నైపుణ్యాలతో సెలెక్టర్ల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని చూస్తున్నాడు. భారత అండర్19 ప్రపంచకప్ ముగిసిన తర్వాత సెలెక్టర్లు సరికొత్త యువ శక్తులతో కూడిన కొత్త జట్టును సిద్ధం చేశారు. అండర్19 ప్రపంచకప్ ఆడిన పాత ఆటగాళ్లెవరినీ ఈ తాజా టూర్‌కు ఎంపిక చేయలేదు. భవిష్యత్తు సిరీస్‌లు, మెగా టోర్నమెంట్లను దృష్టిలో ఉంచుకొని యువరాజ్ చౌహాన్ సారథ్యంలో సరికొత్త వ్యూహాలతో, సరికొత్త కాంబినేషన్‌తో యువ భారత్ లంక గడ్డపై అడుగుపెట్టబోతోంది.




# పెట్రోల్‌పై ఎక్సైజ్ సుంకం రద్దు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

పెరుగుతున్న ఇంధన ధరల నుండి సామాన్యుడికి ఉపశమనం కలిగిస్తూ, 22% నుండి 30% వరకు ఇథనాల్ కలిపిన పెట్రోల్ (E22, E30) పై కేంద్ర ఎక్సైజ్ సుంకం, రోడ్డు మౌలిక సదుపాయాల సెస్సులను ప్రభుత్వం పూర్తిగా రద్దు చేసింది. పశ్చిమ ఆసియా ఉద్రిక్తతలు, హోర్ముజ్ జలసంధి ముప్పు కారణంగా ప్రపంచవ్యాప్తంగా ముడిచమురు సంక్షోభం పొంచి ఉన్న నేపథ్యంలో, ఈ నిర్ణయం విదేశీ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి దేశీయంగా భారీగా నిధులు ఆదా చేస్తుంది. అలాగే, చెరకు, ధాన్యాల నుండి ఇథనాల్ ఉత్పత్తి పెరగడం వల్ల రైతులకు మంచి లాభాలు లభించడమే కాకుండా, ప్రస్తుతం సగం సామర్థ్యంతో నడుస్తున్న ఇథనాల్ పరిశ్రమలు పూర్తి స్థాయిలో పనిచేస్తూ కొత్త ఉపాధి అవకాశాలను సృష్టిస్తాయి. ఈ విప్లవాత్మక నిర్ణయం వల్ల భవిష్యత్తులో ప్రజలకు చౌకగా ఇంధనం లభించడంతో పాటు కాలుష్యం తగ్గి, దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం కానుంది.



# నష్టాల్లో స్టాక్ మార్కెట్లు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

పశ్చిమాసియాలో ముదిరిన యుద్ధ మేఘాల నేపథ్యంలో ఇవాళ్టి ట్రేడింగ్‌లో భారత ఈక్విటీ మార్కెట్లు నష్టాలతో ముగిశాయి. ఇరాన్‌పై అమెరికా సైనిక చర్య తీవ్రతరం చేసిందనే వార్తలతో ఇన్వెస్టర్లలో ఆందోళన వ్యక్తమైంది. రోజంతా తీవ్ర ఒడుదొడుకులకు లోనైన సూచీలు చివరికి నష్టాల్లోనే స్థిరపడ్డాయి. సెన్సెక్స్ 150.63 పాయింట్లు నష్టపోయి 73,832.55 వద్ద ముగిసింది. నిఫ్టీ 53.35 పాయింట్లు తగ్గి 23,161.60 వద్ద ముగిసింది. ఇరాన్‌పై తీవ్రంగా దాడి చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. అమెరికా దాడుల తర్వాత వ్యూహాత్మకంగా కీలకమైన 'హోర్ముజ్ జలసంధి'ని మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. దీనివల్ల ప్రపంచ ముడిచమురు సరఫరాకు అంతరాయం కలిగి, చమురు ధరలు పెరిగే ప్రమాదం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. అంతర్జాతీయ ఉద్రిక్తతల వల్ల డాలర్‌కు డిమాండ్ పెరగడంతో, గత రెండు రోజులుగా లాభపడుతూ వచ్చిన భారత రూపాయి విలువ ఇవాళ మళ్లీ పడిపోయింది. పశ్చిమాసియా పరిణామాలు మరింత తీవ్రమైతే రాబోయే రోజుల్లో ఈక్విటీ మార్కెట్లలో రిస్క్ మరింత పెరగొచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. హెచ్‌సీఎల్, అదానీ పోర్ట్స్, ఇన్ఫోసిస్, ఎటర్నల్ షేర్లు నష్టపోయాయి. ఐసీఐసీఐ బ్యాంక్, కోటక్ మహీంద్రా, మహీంద్రా అండ్ మహీంద్రా, భారతీ ఎయిర్ టెల్, సన్ ఫార్మా షేర్లు లాభపడ్డాయి. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర 92 డాలర్లు ట్రేడవుతోంది. బంగారం ఔన్సు 4092 డాలర్లు కొనసాగుతోంది.

# కింగ్స్ ఆఫ్ టెస్ట్.. నంబర్-1 స్థానంలో భారత్

## పాకిస్తాన్‌కు భారీ షాక్, టాప్-10 లోకి దూసుకొచ్చిన ఆఫ్ఘనిస్తాన్!

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**




అంతర్జాతీయ క్రికెట్ మండలి తాజాగా ప్రకటించిన పురుషుల టెస్ట్ జట్టు ర్యాంకింగ్స్ అభిమానుల్ని ఆశ్చర్యపరుస్తున్నాయి. సుదీర్ఘ ఫార్మాట్‌లో టీమిండియా తన విశ్వరూపాన్ని చూపిస్తూ.. రేటింగ్ పాయింట్లలో అగ్రస్థానాన్ని మరింత పటిష్టం చేసుకుంది. మరోవైపు మన పొరుగు దేశాలైన పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ జట్లకు సంబంధించిన ర్యాంకింగ్స్ క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఐసీసీ తాజా రేటింగ్స్ ప్రకారం భారత జట్టు టెస్టుల్లో నంబర్ 1 స్థానంలో తిరుగులేని ఆధిక్యంతో కొనసాగుతోంది. టీమిండియా అత్యధికంగా 118 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. ఈ సరికొత్త ర్యాంకింగ్స్ లో పాకిస్తాన్ క్రికెట్ జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. వరుస వైఫల్యాల కారణంగా టెస్ట్ ర్యాంకింగ్స్ లో పాక్ స్థానం మరింత దిగజారింది. పాకిస్తాన్ జట్టు తాజాగా 100 రేటింగ్ పాయింట్లతో ఐదో స్థానానికి పడిపోయింది. ఈ ఐసీసీ అప్‌డేట్‌లో అందరినీ ఆశ్చర్యపరిచిన అంశం ఏదైనా ఉందంటే అది ఆఫ్ఘనిస్తాన్ జట్టు ప్రదర్శనే! టెస్టుల్లో పసికూనగా భావించే ఆఫ్ఘన్.. అద్భుతమైన రేటింగ్‌తో దూసుకొచ్చింది. రెండో స్థానంలో ఉన్న కంగారూ జట్టు (ఆస్ట్రేలియా) 113 పాయింట్లతో ఉంది. భారత్‌కు, ఆస్ట్రేలియాకు మధ్య ఏకంగా 5 పాయింట్ల స్పష్టమైన తేడా ఉంది. 2025-2027 వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ రేసులో ఈ రెండు జట్లు ప్రస్తుతం ముందంజలో ఉన్నాయి. న్యూజిలాండ్ జట్టు 102 రేటింగ్ పాయింట్లతో పాకిస్తాన్‌ను వెనక్కి నెట్టి మరీ నాలుగో స్థానాన్ని కైవసం చేసుకుంది. అయితే, ఐసీసీ నిబంధనల ప్రకారం లీగ్ లేదా సిరీస్‌లలో ఆడే మ్యాచ్‌ల సంఖ్య పరంగా చూస్తే.. ఆఫ్ఘనిస్తాన్ ఆడిన టెస్ట్ మ్యాచ్‌ల సంఖ్య చాలా తక్కువ. ఐసీసీ పూర్తి స్థాయి టెస్ట్ హోదా దేశాల జాబితాలో ఉన్నప్పటికీ, వీరు ఆడే మ్యాచ్‌ల పరిమాణం తక్కువగా ఉండటం వల్ల ఈ రేటింగ్ సమీకరణం ఇలా మారింది.

# భారత్-ఏ జట్టుకు గుంటూరు కుర్రోడు ఎంపిక

**గుంటూరు జిల్లా (ఏడీఎన్ఎన్) :**




గుంటూరు జిల్లా క్రీడాకారుల ప్రతిభ జాతీయ స్థాయిలో మరోసారి మెరిసింది. జిల్లాకు చెందిన యువ క్రికెటర్ షేక్ రషీద్ ప్రతిష్టాత్మకమైన భారత్ 'ఏ' జట్టులో స్థానం సంపాదించుకోగా, మహిళా క్రికెటర్ కాట్రగడ్డ దీక్ష అండర్19 భారత జట్టుకు ఎంపికయ్యారు. ఈ నెల 24 నుంచి శ్రీలంకలో జరగనున్న మల్టీ డే టోర్నీలో రషీద్ భారత్'ఏ' జట్టు తరఫున తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. 2019 అండర్19 వరల్డ్ కప్‌లో వైస్ కెప్టెన్‌గా వ్యవహరించి భారత్ విజయంలో కీలక పాత్ర పోషించిన రషీద్, ఆ తర్వాత ఐపీఎల్‌లో సీఎస్కే జట్టుకు కూడా ఎంపికయ్యారు. గతేడాది రంజీ మ్యాచ్‌ల్లో ప్రదర్శించిన అద్భుతమైన ప్రతిభే అతన్ని ఇప్పుడు జాతీయ జట్టులోకి చేరేలా చేసింది. మరోవైపు, అండర్19 భారత మహిళా జట్టులో చోటు దక్కించుకున్న కాట్రగడ్డ దీక్ష అద్భుతమైన ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు. వికెట్ కీపర్ , ఓపెనర్‌గా రాణిస్తున్న దీక్ష, ఎన్‌సీఏలో మెరుగైన శిక్షణ పొంది తన నైపుణ్యాలను నిరూపించుకున్నారు. గతంలో అండర్15 రాష్ట్ర స్థాయి పోటీల్లో అజేయంగా 105 పరుగులు చేసి, 249 పరుగుల భారీ భాగస్వామ్యంతో రికార్డు నెలకొల్పిన దీక్ష, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని క్రీడా వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. రషీద్, దీక్షల ఎంపికపై త్రీమెన్ కమిటీ సభ్యులు జీవీ శరత్ బాబు, టీవీ శివరామకృష్ణ , సీహెచ్ నాగరాజు హర్షం వ్యక్తం చేశారు. చిన్నతనం నుంచే పట్టుదల, క్రమశిక్షణతో కష్టపడిన వీరికి జాతీయ జట్టులో అవకాశం లభించడం గర్వకారణమని, భవిష్యత్తులో వీరు సీనియర్ జట్లలో కూడా స్థానం సంపాదించుకుని జిల్లాకు, దేశానికి మంచి పేరు తీసుకువస్తారని వారు అభినందనలు తెలిపారు.

# హైదరాబాద్ వేదికగా 'ఆర్చరీ ప్రీమియర్ లీగ్'

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**



హైదరాబాద్‌లోని క్రీడాభిమానులకు మరో అద్భుతమైన వినోదం సిద్ధమైంది. ప్రతిష్టాత్మక ఆర్చరీ ప్రీమియర్ లీగ్ రెండో సీజన్‌కు హైదరాబాద్ ఆతిథ్యమివ్వబోతోంది. భారత ఆర్చరీ సంఘం ఆధ్వర్యంలో గత ఏడాది అత్యంత విజయవంతంగా ప్రారంభమైన ఈ లీగ్, ఇప్పుడు రెండో సీజన్‌తో అలరించేందుకు సిద్ధమైంది. ఈ ఏడాది అక్టోబర్ 8 నుండి 18 వరకు నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా ఈ రెండో సీజన్ మ్యాచ్‌లు జరగనున్నట్లు ఏపీఎల్ డైరెక్టర్ అనిల్ కామినేని వెల్లడించారు. ఈ లీగ్‌లో మొత్తం ఆరు ఫ్రాంచైజీ జట్లు తలపడనున్నాయి. గత సీజన్ విజేతగా నిలిచిన రాజ్‌పుతానా రాయల్స్ ఈసారి డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతోంది. రాజ్‌పుతానా రాయల్స్, మైటీ మరాఠాస్, పృథ్వీరాజ్ యోధాస్, కాకతీయ నైట్స్, చెరో ఆర్చర్స్, చోళా చీఫ్స్ టీమ్స్ పోటీలో పాల్గొననున్నాయి. ఈ టోర్నీలో భారత్‌కు చెందిన అగ్రశ్రేణి ఆర్చర్లతో పాటు పలువురు అంతర్జాతీయ స్టార్ ఆర్చర్లు కూడా వేర్వేరు జట్ల తరపున తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. వీరిలో భారత స్టార్ ఆర్చర్లు అయిన వెన్నం జ్యోతి సురేఖ, దీపిక కుమారి, అతాను దాస్, అభిషేక్ వర్మ వంటి దిగ్గజాలు ఈ లీగ్‌లో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నారు. రికర్వ్, కాంపౌండ్ విభాగాల్లో కలిపి మొత్తం 48 మంది ఆర్చర్లు ఈ మెగా టోర్నీలో పోటీ పడనున్నారు. ఈ ఆర్చరీ పండగకు సంబంధించిన పూర్తి మ్యాచ్ షెడ్యూల్‌ను నిర్వాహకులు త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు. సిటీ నడిబొడ్డున పీపుల్స్ ప్లాజాలో జరగనుండటంతో ఈ టోర్నీని చూసేందుకు భారీగా ప్రేక్షకులు తరలివచ్చే అవకాశం ఉంది.

# ఎంజీ కామెట్ ఈవీపై భారీ తగ్గింపు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**



ఖరీదైన పెట్రోల్, డీజిల్ ధరలకు బైబై చెప్పి.. బడ్జెట్ ధరలో ఒక క్రేజీ ఎలక్ట్రిక్ కారును మీ ఇంటికి తెచ్చుకోవాలనుకునేవారికి అదిరిపోయే గుడ్ న్యూస్! ప్రముఖ వాహన తయారీ సంస్థ ఎంజీ (మోరిస్ గ్యారేజెస్) తన మోస్ట్ పాపులర్, క్యూట్ మైక్రో ఎలక్ట్రిక్ కారు అయిన 'ఎంజీ కామెట్ ఈవీ' పై జూన్ 2026 లో ఊహించని రేంజ్‌లో డిస్కౌంట్లను ప్రకటించింది. పరుగుల పెట్టే నగర జీవితానికి పర్ఫెక్ట్ గా సెట్ అయ్యే ఈ చిన్న ఈవీపై కంపెనీ ఇప్పుడు రూ. 80 వేల భారీ ఆఫర్లతో కస్టమర్లను ఆకట్టుకుంటోంది. దేశవ్యాప్తంగా కస్టమర్లకు లభించే నగదు తగ్గింపులు, ఎక్స్ఛేంజ్ బోనస్‌లు, లాయల్టీ బోనస్‌లు, కార్పొరేట్ ఆఫర్ల ద్వారా రూ. 60,000 వరకు ప్రయోజనం దక్కుతుంది. దీనితో పాటు భారతదేశంలోని కొన్ని ఎంపిక చేసిన ప్రాంతాలలో ప్రత్యేక అదనపు ప్రయోజనాలతో కలిపి ఈ మొత్తం తగ్గింపు రూ. 80,000 వరకు చేరుకుంటుంది. మీ పాత కారును ఎక్స్ఛేంజ్ చేయాలనుకున్నా, లేదా ఇప్పటికే మీ దగ్గర ఎంజీ కారు ఉండి లాయల్టీ బోనస్ పొందాలనుకున్నా.. మీకు అదనపు బోనస్‌లు లభిస్తాయి. ఎంజీ కామెట్ ఈవీ అతిపెద్ద ప్లస్ పాయింట్ దాని కాంపాక్ట్ సైజ్. 3 మీటర్ల కంటే తక్కువ పొడవు ఉండే ఈ మైక్రోఎలక్ట్రిక్ కారుతో రద్దీగా ఉండే మెట్రో సిటీ రోడ్లు, ఇరుకైన గల్లీల్లో దీనిని నడపడం చాలా సులభం. చాలా తక్కువ పార్కింగ్ ప్లేస్ ఉన్నా ఈజీగా ఇమిడిపోతుంది. దీని టర్నింగ్ రేడియస్ చాలా తక్కువ కావడం వల్ల సిటీ ట్రాఫిక్‌లో యూ టర్న్‌లు చాలా సులభంగా తీసుకోవచ్చు. ఇందులో 17.3 kWh బ్యాటరీ ప్యాక్ ఉంటుంది. ఫుల్ ఛార్జ్ చేస్తే ఏకంగా 230 కిలోమీటర్ల డ్రైవింగ్ రేంజ్ ఇస్తుందని కంపెనీ చెబుతోంది. కారు లోపల డ్యాష్‌బోర్డ్ పై రెండు భారీ 10.25అంగుళాల స్క్రీన్స్ ఉంటాయి. స్మార్ట్ ఫోన్ కనెక్టివిటీ, వాయిస్ కమాండ్‌లు, నావిగేషన్, రియల్‌టైమ్ ట్రాఫిక్ అప్‌డేట్‌లతో కూడిన 'కనెక్టెడ్ కార్ టెక్నాలజీ'ని ఇందులో ఇచ్చారు. భారత మార్కెట్లో ఎంట్రీలెవల్ ఈవీ సెగ్మెంట్‌లో ఇది ప్రధానంగా టాటా టియాగో ఈవీతో తలపడుతుంది. అయితే, టియాగో ఈవీ అనేది ఒక నార్మల్ ఫ్యామిలీ హ్యాచ్‌బ్యాక్ కారు కాగా.. ఎంజీ కామెట్ ఈవీ మాత్రం ప్రత్యేకంగా సిటీ లోపల రోజువారీ ఆఫీస్, షాపింగ్ వంటి స్వల్ప దూర ప్రయాణాల కోసం డిజైన్ చేయబడింది.

# భారీగా దిగొస్తున్న బంగారం, వెండి ధరలు

## వారం రోజుల్లోనే రూ.10,000 డౌన్!

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**




పసిడి కొనుగోలు చేయాలనుకునే వారికి ఇది ఒక అద్భుతమైన అవకాశం! గత కొంతకాలంగా ఆకాశాన్నంటుతున్న పసిడి ధరలు దేశీయ మార్కెట్‌లో ఒక్కసారిగా దిగివస్తున్నాయి. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు మళ్లీ పెరగడం, అమెరికా డాలర్ బాగా బలపడటం వంటి కారణాలతో పాటు దేశీయంగా డిమాండ్ కాస్త తగ్గడంతో ఈ విలువైన లోహాల ధరలు తగ్గుముఖం పట్టాయి. గురువారం హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ. 1.50 లక్షలుగా ఉంది. 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ. 1.35 లక్షలు పలికింది. కిలో వెండి ధర ఏకంగా రూ. 2.40 లక్షలకు దిగొచ్చింది. ఇటీవల మార్కెట్లో 10 గ్రాముల బంగారం ధర ఏకంగా రూ. 1.60 లక్షల గరిష్ఠ స్థాయికి చేరిన సంగతి తెలిసిందే. అయితే కేవలం వారం రోజుల వ్యవధిలోనే ఏకంగా రూ. 10,000 మేర తగ్గడం విశేషం. ప్రస్తుతం ఇరాన్‌అమెరికా దేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న నేపథ్యంలో, సమీప కాలంలో బంగారం, వెండి ధరలు మరికొంత తగ్గే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. అంతర్జాతీయంగా ఔన్స్ బంగారం ధర 4095 డాలర్లుగా ఉండగా, ఔన్స్ వెండి ధర 63.95 డాలర్లుగా నమోదైంది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ ఆగస్టు కాంట్రాక్టుకు సంబంధించి బంగారం ఫ్యూచర్స్ ధర రూ. 1.48 లక్షలుగా కొనసాగుతోంది. అలాగే జులై కాంట్రాక్టుకు గానూ కిలో వెండి ధర రూ. 2.34 లక్షలుగా ట్రేడ్ అవుతోంది.




# కొంపముంచిన వర్షం... భారత్ ఓటమి

## డీఎల్ఎస్ పద్ధతిలో అఫ్గాన్ టీమ్ విజయం

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

ట్రై సిరీస్‌లో భాగంగా ఆఫ్గానిస్తాన్ ఏ టీమ్ తో గురువారం జరిగిన మ్యాచ్ లో భారత్ ఏ టీమ్ అనూహ్యంగా ఓటమిపాలయ్యింది. 349 రన్స్ తో భారీ స్కోర్ చేసిన ఓడిపోవడంతో అభిమానులు నిరాశ చెందారు. భారత్ టీమ్ తొలుత బ్యాటింగ్ చేసింది. ప్రభు సిమ్రన్ సింగ్(84), రుతురాజ్(66), తిలక్ (66), వైభవ్(44) రన్స్ తో విజృంభించారు. దీనితో భారత్ భారీ స్కోర్ సాధించింది. ఆఫ్గాన్ బ్యాటింగ్ చేస్తుండగా వర్షం కురవడంతో మ్యాచ్‌ను 38 ఓవర్లకి కుదించారు. అయితే 25 ఓవర్ల వద్ద వర్షం మళ్లీ పడడంతో 177 పరుగులకు రెండు వికెట్లు కోల్పోయిన ఆఫ్గాన్ డీఎల్ఎస్ పద్ధతిలో 4 రన్స్ తేడాతో గెలిచినట్లు ప్రకటించారు. ఆఫ్గాన్ ప్లేయర్లు ఇమ్రాన్(75), జహీర్ (51) రాణించారు. ఈ ట్రై సిరీస్ లో శ్రీలంకపై గెలిచి, ఆఫ్గాన్ తో ఓడిన భారత్ నెట్ రన్ రేట్ పరంగా వెనకబడడంతో రెండవ స్థానంలో నిలిచింది. ఆడిన ఒక్క మ్యాచ్ గెలవడంతో ఆఫ్గానిస్థాన్ మొదటి స్థానంలో ఉంది.



# ఒక్క సిక్స్ కూడా కొట్టకుండానే వైభవ్ విధ్వంసం

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

క్రికెట్ ప్రపంచంలో ఇప్పుడు ఎక్కడ చూసినా టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ పేరే హాట్ టాపిక్‌గా మారింది! ముక్కోణపు సిరీస్‌లో భారత్ A తరపున బరిలోకి దిగిన ఈ కుర్రాడు.. ఆఫ్ఘనిస్తాన్ A జట్టుపై ఆడిన ఇన్నింగ్స్ ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతోంది. తొలి మ్యాచ్‌లో శ్రీలంకపై త్వరగానే అవుట్ అయి నిరాశపరిచిన వైభవ్.. రెండో మ్యాచ్‌లో మాత్రం ఆఫ్ఘన్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. క్రీజులోకి వచ్చినప్పటి నుంచే తనదైన శైలిలో దూకుడుగా ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. హాఫ్ సెంచరీకి కేవలం 6 పరుగుల దూరంలో దురదృష్టవశాత్తూ అవుట్ అయినప్పటికీ.. వైభవ్ ఆడిన ఇన్నింగ్స్ ఒక రేంజ్‌లో హైలైట్ అవుతోంది. కేవలం 22 బంతుల్లోనే 44 పరుగులు చేసి సత్తా చాటాడు. అయితే ఆఫ్ఘన్ A జట్టు బౌలర్ రహీమి వేసిన బౌలింగ్‌లో కీపర్‌కు క్యాచ్ ఇచ్చి వైభవ్ పెవిలియన్‌కు చేరాడు. ఐపీఎల్ లో అత్యధిక సిక్సర్లు కొట్టిన హిట్టర్‌గా పేరు తెచ్చుకున్న వైభవ్ సూర్యవంశీ.. ఈ మ్యాచ్‌లో ఒక్కటంటే ఒక్క సిక్స్ కూడా కొట్టకపోవడం గమనార్హం! సిక్సర్లు కొట్టకపోయినా స్ట్రైక్ రేట్ మాత్రం అస్సలు తగ్గలేదు. తను చేసిన 44 పరుగుల్లో ఏకంగా 36 పరుగులు కేవలం ఫోర్ల (9 ఫోర్లు) రూపంలోనే వచ్చాయి! పరిస్థితులకు తగ్గట్టుగా గేమ్‌ను ఎలా మార్చుకోవాలో తనకు బాగా తెలుసని వైభవ్ ఈ ఇన్నింగ్స్ తో నిరూపించాడు. కేవలం సిక్స్ లపైనే ఆధారపడకుండా, క్లాస్ షాట్లతో కేవలం ఫోర్ల ద్వారా కూడా స్కోరు బోర్డును నడిపించగలనని చాటిచెప్పాడు.




# అంత్రోపిక్‌తో టీసీఎస్ బిగ్ డీల్

## 50 వేలమంది ఉద్యోగులకు 'క్లాడ్ ఏఐ' శిక్షణ

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రేసులో భారత ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ఒక భారీ సంచలన అడుగు వేసింది. ప్రపంచ ప్రసిద్ధ ఏఐ స్టార్టప్ అంత్రోపిక్ తో చేతులు కలిపినట్లు టీసీఎస్ ప్రకటించింది. ఎంటర్‌ప్రైజ్ ఏఐ స్కేలింగ్‌ను వేగవంతం చేసేందుకు ఈ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కుదుర్చుకుంది. ఐటీ రంగంలో సాంప్రదాయ శ్రమఆధారిత నమూనాపై జనరేటివ్ ఏఐ ఎలాంటి ప్రభావం చూపుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్న తరుణంలో, టీసీఎస్ తీసుకున్న ఈ నిర్ణయం ఇప్పుడు కార్పొరేట్ ప్రపంచంలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ వ్యూహాత్మక కూటమిలో భాగంగా టీసీఎస్ తన అసోసియేట్లకు అత్యాధునిక సాంకేతికతను అందించబోతోంది.

- ప్రత్యేక శిక్షణ: అంత్రోపిక్ సంస్థకు చెందిన అత్యాధునిక ఏఐ మోడల్ 'క్లాడ్' వినియోగంలో దాదాపు 50,000 మంది టీసీఎస్ అసోసియేట్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు.
- కొత్త ఏఐ పరిష్కారాలు: బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, హెల్త్ కేర్ వంటి కఠినమైన నిబంధనలు ఉండే రంగాల కోసం ఇరు సంస్థలు సంయుక్తంగా సరికొత్త ఏఐ పరిష్కారాలను మార్కెట్లోకి తీసుకురానున్నాయి.
- కార్పొరేట్ ప్రయోజనాలు: 'క్లాడ్ ఏఐ' కి ఉన్న అద్భుతమైన డేటా సెక్యూరిటీ, అక్యురసీ ఫీచర్లు కార్పొరేట్ క్లయింట్లకు మెరుగైన సర్వీసులు అందించేందుకు ఎంతగానో దోహదపడతాయని కంపెనీ అధికారులు భావిస్తున్నారు.

సాంప్రదాయ కోడింగ్, టెస్టింగ్, సపోర్ట్ వంటి శ్రమఆధారిత పనులను ఏఐ సాధనాలు పూర్తిగా భర్తీ చేస్తే, ఐటీ కంపెనీల ప్రస్తుత ఆదాయ నమూనా దెబ్బతింటుందనే భయాలు పెట్టుబడిదారులలో నెలకొన్నాయి. ఈ సవాళ్లను అధిగమించడానికే టీసీఎస్ ముందస్తుగా ఏఐ వైపు వేగంగా అడుగులు వేస్తోంది. ఐటీ ఉద్యోగులు తమ నైపుణ్యాలను ఏఐకి అనుగుణంగా అప్‌గ్రేడ్ చేసుకోవడం ఎంత అవసరమో ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

మనసర్కార్
Follow: manasarkar
శుక్రవారం | హైదరాబాద్
12.06.2026
www.manasarkar.com



# కింగ్ ఆఫ్ కేయాస్ 'ఎంట్రీ ఆఫ్ ఆన్ ఎరా' గ్లింప్స్

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, సక్సెస్ ఫుల్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని భారీ కాన్వాస్‌పై రూపుదిద్దుకుంటున్న 'ఎన్.బి.కె111'చిత్రం కోసం మళ్ళీ జతకట్టారు. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై నిర్మాత వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్, హైవోల్టేజ్ యాక్షన్, గ్రిప్పింగ్ డ్రామా. ఈ స్టార్‌డైరెక్టర్ కాంబినేషన్ నుంచి అభిమానులు ఆసక్తిగా ఎదురుచూసే ట్రేడ్‌మార్క్ మాస్ మూమెంట్స్ తో సినిమా అద్భుతంగా అలరించబోతోంది. బాలకృష్ణకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ, చిత్ర నిర్మాతలు 'ఎంట్రీ ఆఫ్ ఆన్ ఎరా' పేరుతో ఒక పవర్ ఫుల్ గ్లింప్స్ ను విడుదల చేశారు. బాలకృష్ణ పాత్రను పరిచయం చేసేలా ఈ గ్లింప్స్ ను రూపొందించారు. 1993 బాంబే అల్లకల్లోల పరిస్థితుల నేపథ్యంలో సాగే ఈ వీడియోలో డార్క్, హింసతో నిండిన ప్రపంచాన్ని చూపించారు. అలాంటి పరిస్థితుల్లో స్టైల్, ఇంటెన్స్, పవర్ కు ప్రతీకగా బాలకృష్ణ ఎంట్రీ అదిరిపోయింది. డైలాగ్స్ లేకుండానే విజువల్స్ ద్వారా పాత్ర పవర్‌ను అద్భుతంగా చూపించారు. దర్శకుడు గోపీచంద్ మలినేని ఈ చిత్రాన్ని భారీ యాక్షన్ సాగాగా మలిచారు. భారీ యంత్రాలు, అగ్నిజ్వాలలు, ప్రాణాంతక ఆయుధాలు, విధ్వంసకర యాక్షన్ ఎపిసోడ్స్ తో గ్లింప్స్ అంతా ఉత్కంఠభరితంగా సాగింది. ప్రతి ఫ్రేమ్ హీరో పాత్ర స్థాయిని మరింత ఎలివేట్ చేసేలా రూపొందించారు. ఈ చిత్రంలో బాలకృష్ణ పాత్రను 'కింగ్ ఆఫ్ కేయాస్'గా ప్రజెంట్ చేశారు. ఈ గ్లింప్స్ బాలకృష్ణ ఆదరగొట్టేశారు. సరికొత్త మేకోవర్‌లో ఆయన ఎంతో స్టైలిష్‌గా, ఎనర్జిటిక్‌గా, అత్యంత పవర్‌ఫుల్‌గా కనిపించారు. ఆయన స్క్రీన్ ప్రెజెన్స్ పాత్రను మరింత ఇంపాక్ట్ ఫుల్ గా నిలబెట్టింది. డీవోపీ అరవింద్ ఎస్. కశ్యప్ తన కెమెరా పనితనంతో చిత్రానికి రగ్డ్, స్టైలిష్ విజువల్ టెక్చర్‌ను అందించారు. ఎస్. థమన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ గ్లింప్స్ కు మరింత ఊపునిచ్చింది.



# గ్యాంగ్ వార్ నేపథ్యంలో 'ఇసాకపట్నం' థ్రిల్లర్

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

ప్రైమ్ వీడియో తన అత్యంత ఆసక్తికరమైన తెలుగు ఒరిజినల్ సిరీస్ 'ఇసాకపట్నం' స్ట్రీమింగ్ తేదీని అధికారికంగా ప్రకటించింది. గ్యారీబీహెచ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ ఏడు ఎపిసోడ్‌ల యాక్షన్ థ్రిల్లర్లు జూలై 2 నుంచి ప్రపంచవ్యాప్తంగా ప్రైమ్ వీడియో లో ప్రేక్షకులముందుకు రానుంది. భారతదేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన ఓటీటీ వేదిక ప్రైమ్ వీడియో తన ప్రతిష్టాత్మక తెలుగు ఒరిజినల్ సిరీస్ 'ఇసాకపట్నం' ప్రపంచవ్యాప్త ప్రీమియర్ తేదీని అధికారికంగా ప్రకటించింది. ప్రతీకారం, అధికారం, కుటుంబ రాజకీయాలు, గ్యాంగ్ వార్ నేపథ్యంలో రూపొందిన ఈ యాక్షన్ థ్రిల్లర్ సిరీస్ జూలై 2 నుంచిప్రైమ్ వీడియో లో స్ట్రీమింగ్ కానుంది. గ్యారీ బీహెచ్ దర్శకత్వం వహించిన ఈ సిరీస్‌కు ప్రశాంత్ రాఘతికథా రచన అందించగా, తాజుద్దీన్ సయ్యద్ సంభాషణలు రాశారు. తమడా మీడియా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాహుల్ తమడా, సైదీప్ రెడ్డిబొర్రా నిర్మించారు. ఒక కల్పిత పోర్ట్ టౌన్ నేపథ్యంలో సాగే 'ఇసాకపట్నం' కథలో అధికారం కోసం జరిగే పోరాటాలు, కుటుంబ విభేదాలు, రాజకీయకుట్రలు, గ్యాంగ్‌స్టర్ సంఘర్షణలు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ఈ సిరీస్‌లో సముద్రఖని, ఐశ్వర్య రాజేష్ ప్రధాన పాత్రల్లో నటించగా, సునీల్, నరేష్ అగస్త్య, మెరిన్ ఫిలిప్, సుధాకర్ కోమకుల, రాజీవ్ కనకాల, మైమ్ గోపి, రోహిణి, బెనర్జీ, జ్వాలా కోటి, రవివర్మ, రాజా చెంబోలు తదితరులు కీలక పాత్రలు పోషించారు.

# పొల్లాచ్చిలో 'చిరు158' హై-ఎనర్జీ షెడ్యూల్ పూర్తి



**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్ లో 'చిరు158' చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. 'వాల్తేరు వీరయ్య' భారీ బ్లాక్‌బస్టర్ తర్వాత ఈ విజయవంతమైన కాంబో మరోసారి చేతులు కలపడంతో అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మాత వెంకట్ కె. నారాయణ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. పలు భాషల్లో భారీ విజయాలు అందుకున్న కేవీఎన్ ప్రొడక్షన్స్‌కు ఇది తొలి తెలుగు చిత్రం కావడం విశేషం. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతోంది. తాజాగా తమిళనాడులోని పొల్లాచ్చిలో జరిగిన హైఎనర్జీ షెడ్యూల్‌ను పూర్తి చేశారు. ఈ షెడ్యూల్‌లో మెగాస్టార్ చిరంజీవి, ఇతర తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. నెక్స్ట్ షెడ్యూల్ త్వరలో ప్రారంభం కానుంది. 'చిరు158' కోసం దర్శకుడు బాబీ కొల్లి భారీ స్థాయిలో కథను సిద్ధం చేశారు. దశాబ్దాలుగా తన స్క్రీన్ ప్రెజెన్స్ తో ప్రేక్షకులను అలరిస్తున్న చిరంజీవి ఈ చిత్రంలో తన కెరీర్‌లోనే అత్యంత పవర్‌ఫుల్, ఇంటెన్స్ పాత్రలో కనిపించనున్నారు. ఇందుకోసం ఆయన మరోసారి అద్భుతమైన ఫిజికల్ ట్రాన్స్ ఫర్మేషన్ అయ్యారు. ఈ భారీ ప్రాజెక్ట్ కు టాప్ టెక్నికల్ టీం పని చేస్తోంది. సంగీతాన్ని ఎస్. థమన్ అందిస్తుండగా, సినిమాటోగ్రాఫర్ విజయ్ కార్తిక్ కన్నన్ చిత్రానికి అద్భుతమైన విజువల్స్ అందించనున్నారు. ప్రొడక్షన్ డిజైన్ అవినాశ్ కొల్లా నిర్వహిస్తుండగా, ఎడిటింగ్‌ను ఆంటోని ఎల్. రూబెన్ చేస్తున్నారు. కోన వెంకట్, కె. చక్రవర్తి రెడ్డి స్క్రీన్‌ప్లే అందిస్తుండగా, హరి మోహన కృష్ణ, వినీత్ పొట్లూరి ఆడిషినల్ స్క్రీన్‌ప్లే రచయితలుగా పనిచేస్తున్నారు. భాను-నందు ద్వయం సంభాషణలను అందిస్తున్నారు. ఈ చిత్రంలో కథానాయికతో పాటు ఇతర ప్రధాన తారాగణానికి సంబంధించిన వివరాలను త్వరలోనే మేకర్స్ ప్రకటించనున్నారు. తారాగణం: మెగాస్టార్ చిరంజీవి, అనశ్వర రాజన్




# ఓ అందమైన జ్ఞాపకం!

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

మాస్ మహారాజా రవితేజ, ప్రముఖ పాన్‌ఇండియా నిర్మాణ సంస్థ 'మైత్రీ మూవీ మేకర్స్' నిర్మిస్తున్న 'ఇరుముడి' చిత్రం కోసం దర్శకుడు శివ నిర్వాణ జతకట్టారు. ఈ చిత్రానికి సంబంధించిన 'ది హార్ట్ ఆఫ్ ఇరుముడి' గ్లింప్స్ కు వచ్చిన అద్భుతమైన స్పందనతో సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. భక్తి, కుటుంబ భావోద్వేగాలు, యాక్షన్ అంశాల సమ్మేళనంగా తెరకెక్కుతున్న ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉండబోతోంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ప్రస్తుతం చిత్రీకరణ శరవేగంగా కొనసాగుతోంది. తాజాగా హీరోయిన్ ప్రియా భవానీ శంకర్ సెట్స్ నుంచి బ్యూటిఫుల్ వర్కింగ్ స్టిల్స్ షేర్ చేశారు. ఈ స్టిల్స్ రవితేజ, ప్రియా భవానీ శంకర్, శివ నిర్వాణ నేచురల్ స్మైల్స్ తో కనిపించడం అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ప్రియా భవానీ శంకర్ సోషల్ మీడియాలో ఓ స్పెషల్ పోస్ట్ పెట్టారు. 'ఇరుముడి' షూటింగ్ ప్రయాణం ఓ అందమైన జ్ఞాపకం. సన్నివేశాలను చిత్రీకరిస్తూ ఎన్నో మధుర క్షణాలను సొంతం చేసుకున్నాం. సెట్స్ లో పుట్టిన సరదా జోక్స్, నవ్వులు, టీమ్‌తో గడిపిన ప్రతి క్షణం ఈ ప్రయాణాన్ని మరింత ప్రత్యేకంగా మార్చాయి, అలా ఎంతో ఆనందంగా ఫిలిం చేశాం. 'ఇరుముడి'తో చేసిన ఈ ప్రయాణం జీవితాంతం గుర్తుండిపోయే అనుభవం' అని తన ఆనందంగా వ్యక్తం చేశారు. ఎనర్జిటిక్ కమర్షియల్ ఎంటర్‌టైనర్స్ తో ప్రేక్షకులను అలరించిన రవితేజ 'ఇరుముడి'లో పూర్తిగా భిన్నమైన, భావోద్వేగాలకు ప్రాధాన్యం ఉన్న పాత్రలో కనిపించనున్నారు. మధ్యతరగతి కుటుంబానికి చెందిన వ్యక్తిగా ఆయన నటన ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని కలిగించనుంది. మానవ సంబంధాలు, కుటుంబ విలువల నేపథ్యంలో శివ నిర్వాణ ఈ కథను మనసుని ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. అదే సమయంలో కమర్షియల్ అంశాలను కూడా సమతూకంగా మేళవించారు. ఈ చిత్రంలో సాయికుమార్, అజయ్ ఘోష్, రమేష్ ఇందిర, స్వాసిక, బేబీ నక్షత్ర కీలక పాత్రలు పాత్రల్లో కనిపించనున్నారు.

# సెన్సార్ గడపదాటిన మా ఇంటి బంగారం..

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

ట్రాలాలా పిక్చర్స్ బ్యానర్ మీద సమంత, రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరు సంయుక్తంగా నిర్మించిన సినిమా 'మా ఇంటి బంగారం'. సమంత ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రానికి నందినీ రెడ్డి దర్శకత్వం వహించారు. ఈ మూవీ ఈ నెల 19న విడుదల కాబోతోంది. ఇప్పటికే టీజర్, ట్రైలర్‌లతో సినిమా టీం ప్రేక్షకుల్లో అంచనాలు పెంచేసింది. తాజాగా ఈ మూవీకి సంబంధించిన సెన్సార్ పూర్తయింది. 'మా ఇంటి బంగారం' చిత్రాన్ని వీక్షించిన సెన్సార్ సభ్యులు మేకర్స్ ను అభినందించారు. ఈ సినిమాకి యూ/ఏ సర్టిఫికెట్‌ను జారీ చేశారు. ఇక ఈ చిత్రం జూన్ 19న గ్రాండ్ రిలీజ్‌కు రెడీగా ఉంది. ఇప్పటికే సమంత ఈ సినిమా గురించి ఎన్నో విశేషాల్ని పంచుకున్నారు. తాజాగా ఇన్ స్టాలో తన అభిమానులతో ముచ్చటిస్తూ ఈ మూవీకి సంబంధించిన ఎన్నో విషయాల్ని తెలియజేశారు. ప్రేక్షకులు పెట్టే డబ్బు, వెచ్చించే సమయం ఇలా అన్నింటికీ న్యాయం చేసేలా సినిమా ఉంటుందని టీం హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇక ఈ చిత్రానికి సంతోష్ నారాయణన్ సంగీతాన్ని అందించారు. ఈ మూవీకి ఓం ప్రకాష్ కెమెరామెన్‌గా, ధర్మేంద్ర కాకరాల ఎడిటర్‌గా పని చేశారు. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకునేందుకు ఈ సినిమా జూన్ 19న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కాబోతోంది. ఈ చిత్రంలో శ్రీముఖి, గౌతమి, ఆనంద్, లక్ష్మి, శ్రీనివాస్ గవిరెడ్డి, మంజుష, దిగంత్, గుల్షన్ దేవయ్యలు ముఖ్య పాత్రలు పోషించారు.



# నా జీవితంలో నిజంగానే కొత్త మలుపు

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

> భైరవి ఆర్థ్యాతో స్పెషల్ చిట్‌చాట్

**మీ నేపథ్యం గురించి చెప్పండి. అస్సాం నుంచి టాలీవుడ్ వరకు మీ ప్రయాణం ఎలా సాగింది?**

నేను అస్సాంకు చెందిన అమ్మాయిని. మా కుటుంబంలో అమ్మ, నాన్న, చెల్లెలు అందరూ అక్కడే ఉంటారు. చిన్నప్పటి నుంచే సినిమాలు, నటన అంటే చాలా ఇష్టం. తెలుగు సినిమాలు కూడా చూస్తూ పెరిగిన నేను ఒక రోజు నటిగా మారాలనే కల కనడం ప్రారంభించాను. ఆ కలనే లక్ష్యంగా పెట్టుకుని అడుగులు వేసాను. నా చదువుతో పాటు ఆడిషన్స్ ఇవ్వడం మొదలుపెట్టాను. అప్పట్లో నాకు తెలుగు అస్సలు రాదు. అయినప్పటికీ వెనక్కి తగ్గలేదు. దాదాపు రెండు మూడు సంవత్సరాల పాటు నిరంతరం ఆడిషన్స్ ఇస్తూ, తెలుగును నేర్చుకునేందుకు ప్రత్యేకంగా ప్రయత్నించాను. చుట్టుపక్కల వాళ్లతో తెలుగులో మాట్లాడటానికి ప్రయత్నిస్తూ భాషపై పట్టు సాధించాను. ఆ కృషి ఫలితమే ఈ సినిమా.

**సినిమాలో మీ పాత్ర గురించి చెప్పండి.**

ఈ చిత్రంలో నా పాత్ర పేరు వరలక్ష్మి. ఆమె కొనసీమకు చెందిన అమాయకమైన గ్రామీణ యువతి. చాలా స్వేచ్ఛగా, మనసుకు నచ్చినట్టు జీవించే అమ్మాయి. సహజత్వానికి దగ్గరగా ఉండే అందమైన పాత్ర ఇది. నటిగా నాకు మంచి అవకాశాన్ని ఇచ్చిన క్యారెక్టర్. కొనసీమ ప్రకృతి అందాలు నన్ను చాలా ఆకట్టుకున్నాయి. కొబ్బరి తోటలు, అక్కడి సంస్కృతి, ఆహారం అన్నీ నాకు కొత్త అనుభవం. ముఖ్యంగా సీఫుడ్ చాలా నచ్చింది. అస్సంలోని మా జీవన శైలి వేరు ఇక్కడి కొనసీమ లైఫ్‌స్టైల్ వేరుగా ఉంటాయి. అందుకే షూటింగ్ ప్రారంభానికి ముందు నెల రోజుల పాటు అక్కడే ఉండి స్థానికుల జీవనశైలి, డ్రెస్సింగ్, బాడీ లాంగ్వేజ్, యాస అన్నింటినీ పరిశీలించి నేర్చుకున్నాను. అందుకే ఇప్పుడు నన్ను చూసి చాలామంది అస్సాం నుంచి వచ్చానని గుర్తించలేరు. అచ్చ తెలుగమ్మాయి అని అందరూ అంటున్నారు. ఈ సినిమాలో నాకు భాషే పెద్ద సవాలుగా మారింది.

> సింగర్ సునీత తనయుడు ఆకాష్ హీరోగా, భైరవి ఆర్థ్యా హీరోయిన్‌గా, శివ వరప్రసాద్ దర్శకత్వంలో తాటి బాలకృష్ణ నిర్మించిన 'కొత్త మలుపు' చిత్రం ఈ నెల12న ప్రేక్షకుల ముందుకు రానున్న సందర్భంగా హీరోయిన్ భైరవి ఆర్థ్యాతో స్పెషల్ చిట్‌చాట్. అస్సాం నుంచి వచ్చి తెలుగు భాష నేర్చుకుని, కొనసీమ అమ్మాయి పాత్రలో నటించిన ఆమె తన సినీ ప్రయాణం, సినిమా విశేషాలు, భవిష్యత్ లక్ష్యాల గురించి ఈ చిట్‌చాట్‌లో ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.

**తెలుగు సినీ పరిశ్రమ గురించి మీ అభిప్రాయం?**

నేను స్కూల్ రోజుల నుంచే తెలుగు సినిమాలకు అభిమానిని. ముఖ్యంగా ఇక్కడి కథలు, భావోద్వేగాలు చాలా బాగుంటాయి. టాలీవుడ్‌లో అందరూ ఎంతో ప్రోత్సాహకరంగా వ్యవహరించారు. ఇక్కడికి వచ్చిన తర్వాత నటనలో కూడా చాలా విషయాలు నేర్చుకున్నాను. హైదరాబాద్‌లోని నటరంగ్ థియేటర్‌లో ఆరు నెలల పాటు యాక్టింగ్ శిక్షణ కూడా తీసుకున్నాను. నాకు ఇష్టమైన తెలుగు హీరోలు, హీరోయిన్లు హీరోల్లో పవన్ కళ్యాణ్, మహేష్‌బాబు, రష్మిక, సమంతని ఎంతో అభిమానిస్తాను.

**'కొత్త మలుపు' సినిమా చూసారా? ఎలా అనిపించింది?**

అవును. నేను ఇప్పటికే మూడు సార్లు సినిమా చూశాను. చాలా బాగా వచ్చింది. ఇందులో కుటుంబ భావోద్వేగాలు, వినోదం, కామెడీ, సస్పెన్స్ అన్నీ ఉన్నాయి. ప్రతి వర్గం ప్రేక్షకుడికి కనెక్ట్ అయ్యే అంశాలు ఉన్నాయి. ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారని నమ్ముతున్నాను. ఓటీటీ ప్రాజెక్టులపై ఆసక్తి ఉంది. నాకు మంచి కథ, మంచి పాత్ర. అది సినిమా అయినా, ఓటీటీ ప్రాజెక్ట్ అయినా నేను సిద్ధమే. నటిగా మంచి పేరు తెచ్చుకోవడం, నా తల్లిదండ్రులు గర్వపడేలా చేయడం నా లక్ష్యం.

**గ్లామర్‌పై మీ అభిప్రాయం?**

గ్లామర్ ఒక హీరోయిన్‌కు అవసరమే. కానీ అది మాత్రమే సరిపోదు. నటన, పాత్రల ఎంపిక, ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రదర్శన కూడా అంతే ముఖ్యమైనవి. మంచి సినిమాలు చేస్తూ నటిగా గుర్తింపు పొందాలని కోరుకుంటున్నాను. చివరగా..తెలుగు ప్రేక్షకులు నాకు ఎంతో ప్రేమ చూపిస్తున్నారు. అందరి ఆశీర్వాదాలు, ప్రేమ ఎప్పుడూ ఉండాలి. 'కొత్త మలుపు' సినిమాను థియేటర్లలో చూసి ఆదరించండి. మీ అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు

-ఎం.డి అబ్దుల్






# 'దీవాన' ట్రైలర్

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

'శుభం' సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న యంగ్ టాలెంటెడ్ యాక్టర్ హర్షిత్ రెడ్డి హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'దీవాన'. ఈ చిత్రాన్ని అర్హ మీడియా, వీ స్టూడియోస్ బ్యానర్ పై వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి నిర్మిస్తున్నారు. ఈ బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో హీరోయిన్ స్నేహ మణిమేగలై, దర్శకుడు శ్రీకాంత్ సంగిశెట్టి పరిచయం కానున్నారు. 'దీవాన' సినిమా గీతా ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా ఈ నెల 19న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తోంది. తాజాగా ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ ఈవెంట్ ను హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్, మాస్ కా దాస్ హీరో విశ్వక్ సేన్, ప్రొడ్యూసర్ ధీరజ్ మొగిలినేని అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎడిటర్ హృషికేశ్ పాస్పల్, డీవోపీ వంశీ పచ్చిపులుసు, మ్యూజిక్ డైరెక్టర్ ఈశ్వర్ చంద్, యాక్టర్ నర్సింగ్, యాక్టర్ టోనీ, ప్రొడ్యూసర్ వాసుదేవ్ కొప్పినేని, ప్రొడ్యూసర్ శ్రీదేవి కార్యంపూడి, ప్రొడ్యూసర్ ధీరజ్ మొగిలినేని, డైరెక్టర్ శ్రీకాంత్ సంగిశెట్టి, హీరోయిన్ స్నేహ మణిమేగలై, హీరో హర్షిత్ రెడ్డి, మాస్ కా దాస్ హీరో విశ్వక్ సేన్, ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ మాట్లాడారు.

Printed and Published By **SHAIK MASTAN** on behalf of **AARAA DIGITAL NEWS NETWORKS**, Printed at YADU GRAPHICS, Ground Floor 3-2-798, STO Bhavan, Chappal Bazar, Kachiguda, Hyderabad, Telangana-500 027
Published at Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073. Editor: **SHAIK MASTAN**, Phone No. 040 - 24099999, **PRGI REG. No. : TGTEL/25/A0540**